PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 118 | విజయవాడ, శనివారం 30 నవంబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 30 November 2024 | Rs

ఢిల్లీలో కదం తొక్కిన ఆశా వర్కర్లు

- రెగ్యులర్ చేయాలని డిమాండ్
- కనీస వేతనం, ఇతర సమస్యల పరిష్కారం కోసం సంఘర్ష్ ర్యాలీ

7

అదాని కుంభకోణాలపై నాలుగు పేజీల ప్రజాశక్తి ప్రత్యేక సంచిక నేటి పత్రికతో పాటు అందుకోండి



మరో రూ.9,412 కోట్ల భారం

పబ్లిక్ హియరింగ్ లేకుండానే విద్యుత్ 'సర్దుపోటు'

ఉత్తర్వులు విడుదల చేసిన ఎపిఇఆర్‌సి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా విద్యుత్ వినియోగదారులపై డిస్కంలు భారాలపై భారాలు మోపుతున్నాయి. ఇప్పటికే ట్రూఅప్‌తో పాటు రెండు ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్ (ఎఫ్‌పిపిసిఎ) ఛార్జీలతో నడ్డివిరుస్తున్న విద్యుత్ సంస్థలకు మరో భారాన్ని మోపేందుకు ఎపి విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) అనుమతి ఇచ్చింది. పబ్లిక్ హియరింగ్ నిర్వహించకుండానే ఎఫ్‌పిపిసిఎ ఛార్జీలను కూడా వసూలు చేసుకోవచ్చని చడిచప్పుడు లేకుండా ఇఆర్‌సి కార్యదర్శి పి కృష్ణ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.12,844 కోట్లు ఎఫ్‌పిపిసిఎ కింద వసూలు చేసుకునేందుకు అనుమతినివ్వాలని ఇఆర్‌సికి డిస్కంలు ప్రతిపాదించిన విషయం తెలిసిందే. ఈ ప్రతిపాదనలపై ఈ నెల 19లోపు అభ్యంతరాలు, సలహాలు, సూచనలు పంపాలని ఇఆర్‌సి ఈ నెల 4న బహిరంగ ప్రకటన విడుదల చేసింది. వేల కోట్లకు సంబంధించిన భారంపై కనీసం బహిరంగ విచారణ జరపకుండా రూ.9,412 కోట్లు వసూలు చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది.

ఛార్జీల వసూలు ఇలా..

పంపిణీ సంస్థ పేరు	భారం (రూ.కోట్లలో)	రెండేళ్లపాటు వసూలు (నెలకు యూనిట్‌కు)
ఎపిఎస్‌పిడిసిఎల్	4473.21	0.45
ఎపిసిపిడిసిఎల్	1865.70	0.46
ఎపిఇపిడిసిఎల్	3073.59	0.45

ఇఆర్‌సి అనుమతించిన దానిలో గత ఆర్థిక సంవత్సరం ప్రతినెలా 40 పైసలు చొప్పున రూ.2,868.90 కోట్లు డిస్కంలు వినియోగదారుల నుంచి ఇప్పటికే వసూలు చేశాయి. మిగిలిన రూ.6,543.60 కోట్లను వచ్చే డిసెంబర్ నుంచి 2026 నవంబర్ వరకూ వసూలు చేసుకోవాలని ఎపిఇఆర్‌సి ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఎస్‌పిడిసిఎల్) పరిధిలో యూనిట్‌కు 0.9132 పైసలు, ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిసిపిడిసిఎల్) పరిధిలో 0.9239 పైసలు, ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్) పరిధిలో 0.9049 పైసలు చొప్పున వినియోగదారుల నుంచి డిస్కంలు వసూ లు చేయనున్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఒక నెలకు సంబంధించిన ఎఫ్‌పిపిసిఎ భారాన్ని రెండు నెలల్లో వసూలు చేసుకోమంది.

భారత జిడిపి మందగమనం

- సెప్టెంబర్ త్రైమాసికంలో 5.4 శాతమే
- దాదాపు రెండేళ్ల కనిష్టానికి పతనం
- ఆర్‌బిఐ అంచనాలకు దూరం
- ఎన్‌ఎస్‌ఒ గణాంకాల వెల్లడి

న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థ ఉరుకులు పెడుతోందన్న బిజెపి పాలకుల ఊకదంపుడు ఉపన్యాసాలు, రిపోర్టులు వాస్తవ రూపంలో కార్యరూపం దాల్చడం లేదు. స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) వృద్ధి రోజురోజుకూ మందగిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో వృదిఆద ఏకంగా 5.4 శాతానికి పడిపోయి.. దాదాపు రెండేళ్ల కనిష్టానికి క్షీణించింది. ఆర్‌బిఐ, రేటింగ్ ఏజెన్సీల అంచనాల కంటే ఘోరంగా క్షీణించడం గమనార్హం. కేంద్ర గణాంకాల శాఖ (ఎన్‌ఎస్‌ఒ) శుక్రవారం జిడిపి రిపోర్ట్‌ను వెల్లడించింది. మైనింగ్, గనుల రంగాలు అత్యంత పేలవ ప్రదర్శన కనబర్చాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో జిడిపి ఏకంగా 8.1 శాతం పెరుగుదల చోటుచేసుకుంది. గడిచిన ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 6.7 శాతానికి పరిమితమైంది. ఈ రెండింటితోనూ పోల్చినా జిడిపిలో భారీ తగ్గుదల నమోదుకావడం ఆందోళనకరం. మరోవైపు రేటింగ్ ఏజెన్సీలు కూడా 6 శాతం ఎగువన వృద్ధి ఉండొచ్చని చేసిన అంచనాల కంటే మరింతగా పడిపోవడం విశేషం. జిడిపి 7 శాతం పెరగనుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గవర్నర్ శక్తికాంతదాస్ అంచనా వేశారు. ఆర్‌బిఐ అంచనాలకు మించి జిడిపి పతనం కావడం ఆర్థిక వ్యవస్థ పట్ల తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఒక ఏడాదిలో దేశంలో ఉత్పత్తి అయిన సరుకులు, సేవల మొత్తం విలువను జిడిపిగా పేర్కొంటారు. ఇది ఆర్థిక వ్యవస్థ పనితీరును తెలుపుతోంది. జిడిపి పడిపోతుందంటే దేశంలో ఆర్థిక కార్యకలాపాలు సన్నగిల్లుతున్నాయని అర్థం. ఇటీవల ప్రజల వినిమయం భారీగా దెబ్బతిందన్న రిపోర్టులు జిడిపిపై తీవ్ర ప్రభావం చూపి ఉంటుందని తెలుస్తోంది.

తయారీ, గనుల రంగాలు డీలా
ఎన్‌ఎస్‌ఒ గణాంకాల వెల్లడి

7

అక్రమ రిజిస్ట్రేషన్లపై విచారణ

రెవెన్యూశాఖ పనితీరు, ప్రజల సంతృప్తిపై థర్డ్ పార్టీ ఆడిట్ • సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నిబంధనలకు విరుద్ధంగా 7,827 ఎకరాల భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారంలో అవకతవకలు జరిగాయని, వాటిపై విచారణ చేపట్టాలని రెవెన్యూ ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రెవెన్యూశాఖపై సచివాలయంలో సిఎం శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెనుకొండ, నందలూరు, వెదురు కుప్పం, ధర్మవరం, వీరబల్లి, సోమందేపల్లి, ఏర్పేడు, దొర్నాల, రొద్ద, రామాపురం మండలాల్లో ఫ్రీ హోల్డ్ భూముల అక్రమ రిజిస్ట్రేషన్లు అత్యధికంగా జరిగాయని, వీటిపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,21,433 ఎకరాల్లో ఫ్రీ హోల్డ్ భూముల్లో జరిగిన నిబంధనల ఉల్లంఘనలను కూడా తేల్చాలన్నారు. ప్రజలు సులభంగా రెవెన్యూ సేవలు పొందేందుకు అవసరమైన ప్రక్షాళన చేపట్టాలని అభిప్రాయపడ్డారు. ఏ తరహా ఫిర్యాదును ఎలా పరిష్కరిస్తున్నారు? ఎంత సమయం తీసుకుంటున్నారు? ప్రజల నుంచి సంతృప్తి వ్యక్తం అవుతుందా అనే అంశాలపై థర్డ్ పార్టీ ద్వారా ఆడిట్ చేయాలని సిఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో రెవెన్యూ సేవలు సులభతరం కావాలని, ఆన్‌లైన్‌లో అన్ని సర్వీసులూ అందుబాటులోకి రావాలని అన్నారు. రెవెన్యూశాఖ సమూల ప్రక్షాళనతోపాటు కఠిన నిర్ణయాల ద్వారా ప్రజల ఇబ్బందులను తగ్గించాలన్నారు. భూములు బలవంతంగా లాక్కునేందుకు 22-ఎలో పెడతామని బెదిరించి చేసిన కబ్జాలు అనేకం ఉన్నాయని, వాటిపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో 13,59,805 ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేశారని, వీటిలో 4,21,433 ఎకరాలు నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీ హోల్డ్ చేసినట్లు అధికారులు గుర్తించారన్నారు. ఇందులో 25,284 ఎకరాలు రిజిస్ట్రేషన్లు కాగా, అందులో 7,827 ఎకరాలు రిజిస్ట్రేషన్స్‌లో నిబంధనలు ఉల్లంఘన జరిగినట్లు ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. పుట్టిన తేదీ, మరణించిన తేదీ, కులం, ఆదాయం వంటి సర్టిఫికెట్లు వంటి సర్వీసుల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే అవసరం లేకుండా ఆన్‌లైన్‌లో సేవలు పొందేలా చర్యలు చేపట్టాలన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. 1,74,720 అర్జీలు రాగా, అందులో 67,928 అర్జీలు కేవలం రెవెన్యూ విభాగం నుంచే వచ్చాయన్నారు. మొత్తం అర్జీల్లో 1,32,572 పరిష్కరించగా, అందులో 49,784 అర్జీలు పరిష్కరించాల్సి ఉందని అధికారులు తెలిపారు. భూముల రీ సర్వే గురించి సిఎం మాట్లాడుతూ.. 16,816 గ్రామాలకు, 6,698 గ్రామాల్లో 85 లక్షల ఎకరాల్లో రీసర్వే పూర్తయిందని, రీసర్వేలో తప్పులపై ప్రజల నుంచి 2,79,148 ఫిర్యాదులు వచ్చాయని అన్నారు. వీటిని పరిష్క రించడంతోపాటు రీసర్వే జరుగుతున్న గ్రామాలతోపాటు రీసర్వే మొదలు కాని గ్రామాల్లో కూడా పారదర్శకంగా సమస్యలు తలెత్తకుండా సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లా డుతూ.. వైసిపి ప్రభుత్వం 77,98,516 సరిహద్దు రాళ్ల నాటి సిఎం బొమ్మలతో ముద్రించిందని, కూటమి ప్రభుత్వం వీటిని తొలగించే కార్యక్రమం చేపట్టిందన్నారు. ఇప్పటి వరకు 4,40,651 రాళ్లపై బొమ్మలను తొలగించామన్నారు. ఒక్కో బొమ్మ తొలగింపునకు రూ.15 ఖర్చవుతోందని, అన్ని రాళ్లపై బొమ్మలు తొలగించేందుకు రూ.12 కోట్లు ఖర్చవుతుందని మంత్రి వివరించారు. జనవరి నాటికి ఈ పనిని పూర్తి చేస్తామన్నారు.

రిషితేశ్వరి ఆత్మహత్య కేసు కొట్టివేత

- ప్రాసిక్యూషన్ నేరం నిరూపించలేకపోయింది : జడ్జి నీలిమ

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

నాగార్జున విశ్వవిద్యాలయం ఆర్కిటెక్చర్ విద్యార్థిని రిషితేశ్వరి ఆత్మహత్యకు సహచర విద్యార్థుల ర్యాగింగ్, లైంగిక వేధింపులే కారణమంటూ 2015లో నమోదైన కేసులో నిందితులపై మోపిన అభియోగాలు సరికాదని గుంటూరు జిల్లా అదనపు న్యాయమూర్తి కె.నీలిమ శుక్రవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ నేరం రుజువు చేయలేకపోయినందున కేసు కొట్టివేసినట్టు వెల్లడించారు. ర్యాగింగ్, లైంగిక వేధింపుల కారణంగా తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్టు 2015 జులై 15న రిషితేశ్వరి తన సూసైడ్ నోట్‌లోనూ, డైరీలోనూ పేర్కొన్నారు. తెలంగాణలోని వరంగల్‌కు చెందిన ఆ విద్యార్థిని ఆత్మహత్య అప్పట్లో మన రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. ఈ ఘటనలో ఫిర్యాదు చేసినా సకాలంలో చర్యలు తీసుకోలేదని ఆరోపణలు రావడంతో ప్రిన్సిపాల్ బాబూరావును కూడా పోలీసులు అప్పట్లో అరెస్టు చేశారు. ప్రధాన నిందితులుగా సహ విద్యార్థులు నాగసాయి లక్ష్మి, చరణ్, నరాల శ్రీనివాస్‌లను పేర్కొన్నారు. వారినీ అప్పట్లో అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. నేరం రుజువు కాలేకపోవడం వల్ల కేసు కొట్టివేస్తున్నట్లు న్యాయమూర్తి తన తీర్పులో వెల్లడించారు. తీర్పు తర్వాత ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.కోటేశ్వరరావు మాట్లాడుతూ రిషితేశ్వరి ఆత్మహత్యకు ప్రేరేపించిన వారి పేర్లు డైరీలో ఉన్నాయన్నారు. తాను ఏ విధంగా వేధింపులకు గురైందో డైరీల్లో ఆమె రాసుకుందని తెలిపారు. అవన్నీ కోర్టు ముందుంచామన్నారు. హాయ్‌ల్యాండ్‌లో ఫ్రెషర్స్ పార్టీలో లైంగికంగా వేధించారన్నారు. ఈ కేసులో నిందితులకు శిక్ష పడుతుందని భావించామని, కానీ తీర్పు భిన్నంగా రావడంతో పైకోర్టుకు అప్పీలుకు వెళ్లాలని కోరతానని తెలిపారు. ప్రధాన నిందితుల తరపు న్యాయవాది మహతి శంకర్ మాట్లాడుతూ స్వప్రయోజనాల కోసం కేసును సెన్సేషన్ చేశారని, నేరం రుజువు చేయలేకపోయారని పేర్కొన్నారు. అసలు నిందితుల పేర్లను తొలగించి... మెరిట్ స్టూడెంట్లను ఇరికించారని అన్నారు. తన క్లయింట్లకు న్యాయం జరిగిందని చెప్పారు.

న్యాయం జరగలేదు : రిషితేశ్వరి కుటుంబ సభ్యుల ఆవేదన

కోర్టు తీర్పుపై రిషితేశ్వరి తల్లి దుర్గాబాయి మాట్లాడుతూ తాము తొమ్మిదేళ్లుగా పోరాడుతున్నామని, న్యాయం జరుగుతుందని భావించామని తెలిపారు. అయితే, న్యాయం జరగలేదన్నారు. రిషితేశ్వరి తండ్రి మురళీకృష్ణ మాట్లాడుతూ రిషితేశ్వరి డైరీలను ఎందుకు పరిగణలోకి తీసుకోలేదో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. ఆమె డైరీల్లో అన్ని వివరాలూ ఉన్నాయని వివరించారు. ఫోరెన్సిక్ ల్యాబ్ కూడా రిషితేశ్వరే డైరీ రాసినట్లు నివేదిక ఇచ్చిందన్నారు.

అది అమెరికా న్యాయ శాఖ, ప్రైవేట్ సంస్థల లీగల్ సమస్య

- అదాని వ్యవహారంపై ప్రభుత్వ

న్యూఢిల్లీ : అదానీ ముడుపుల వ్యవహారం పార్లమెంటును పట్టి కుదిపేస్తుంటే అది అమెరికా న్యాయశాఖ, ప్రైవేట్ సంస్థలకు సంబంధించిన లీగల్ సమస్యగా భారత్ కొట్టి పారేసింది. దీనిపై మాకు ఎవరినుంచి ఎలాంటి అభ్యర్థనలు రాలేదని చెప్పింది. మోడీ అత్యంత సన్నిహితుడైన వివాదాస్పద వ్యాపార వేత్త గౌతమ్ అదానీపై అమెరికా న్యాయశాఖ అభియోగాలను మోపిన వారం రోజులకు తీరికగా స్పందించిన విదేశాంగ శాఖ ఆకుకు అందని పోకకు పొందని రీతిలో ఈ వ్యాఖ్యలు చేసింది. విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వీక్లీ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ అదానీపై అభియోగాలకు సంబంధించి మాకు ఎలాంటి సమాచారం రాలేదని సమాధానం దాటవేసే యత్నం చేశారు. ఈ విషయంలో అమెరికాతో ఎలాంటి సంభాషణలు కానీ, సంప్రదింపులు కానీ భారత్ జరపలేదని చెప్పారు. అదానీ, ఆయన ఆరుగురి అధికారులకు సమన్లు, అరెస్టు వారెంట్లు అమెరికా కోర్టు జారీ చేసిందా అని విలేకరులు అడగ్గా, ఎలాంటి విజ్ఞప్తులు మాకు అందలేదని జైస్వాల్ ముక్త సరిగా సమాధానమిచ్చారు. అటువంటి అభ్యర్థన ఏదైనా వస్తే, దానిలో మెరిట్‌ను బట్టి చట్టపరమైన పరస్పర సహకార విషయం పరిశీలిస్తామని అన్నారు.

మసీదులో సర్వే ఆపండి

- సంభాల్‌లో శాంతి సామరస్య పరిరక్షణకు చర్యలు
- యుపి పోలీసులు, జిల్లా అధికారులు తటస్థంగా వ్యవహరించాలి
- సుప్రీం కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : ఉత్తర ప్రదేశ్‌లోని :సంభాల్ మసీదులో సర్వే ఆపాలని సుప్రీం కోర్టు శుక్రవారం ఆదేశించింది. పోలీసులు, జిల్లా అధికార యంత్రాంగం పూర్తిగా తటస్థంగా వుంటూ, అక్కడ శాంతి భద్రతలు, సామరస్యాన్ని కాపాడాలని కూడా కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. దీనిపై విచారణను వచ్చే ఏడాది జనవరి6న చేపట్టేందుకు వీలుగా లిస్ట్‌లో చేర్చాలని న్యాయ సిబ్బందిని కోరింది. అంతవరకు ఎలాంటి సర్వేలు మసీదులో నిర్వహించరాదని తెలిపింది. దీనిపై రాష్ట్ర హైకోర్టును అప్రోచ్ కావాలని పిటిషనర్లను సుప్రీం కోరింది. సంభాల్‌లో 16వ శతాబ్దానికి చెందిన మసీదులో సర్వే నిర్వహించాలని ఈ నెల 19న యుపిలోని స్థానిక సివిల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులతో ఆ ప్రాంతంలో ఆందోళనలు , ఘర్షణలు చెలరేగడం, పోలీసుల కాల్పుల్లో ముగ్గురు ముస్లిం యువకులు చనిపోయిన సంగతి తెలిసిందే. ఈ అసాధారణ పరిస్థితి కారణంగా సుప్రీంకోర్టును నేరుగా మసీదు నిర్వాహకుల కమిటీ ఆశ్రయించింది. సివిల్ కోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా పిటీషన్ వేసింది. ఈ పిటీషన్‌ను శుక్రవారం విచారించిన సుప్రీంకోర్టు సర్వే ప్రక్రియ కార్యక్రమాలను నిలిపివేయాలని సివిల్ కోర్టును ఆదేశించింది. అలాగే, సివిల్ కోర్టు అడ్వకేట్ కమిషనర్ రూపొందించిన మసీదు సర్వే నివేదికను సీల్డ్ కవర్‌లో తమ ముందు ఉంచాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన బెంచ్ ఆదేశించింది. అలాగే, సర్వే నిర్వహించాలని లేదా ఆదేశాలు సవరించాలని ఈ నెల 19న సివిల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలలపై అలహాబాద్ హైకోర్టును పిటీషనర్లు సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని 13వ నిబంధన ప్రకారం ఆశ్రయించ వచ్చునని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖన్నా చెప్పారు. కమిటీ దాఖలు చేసే పిటీషన్‌పై హైకోర్టు విచారించేవరకు ఎలాంటి కార్యకలాపాలను విచారణను సివిల్ కోర్టు చేపట్టరాదని బెంచ్ స్పష్టం చేసింది. అదేవిధంగా సివిల్ కోర్టు ఆదేశాలపై పిటిషన్ దాఖలైతే మూడు రోజుల్లోగా దానిని విచారణాంశాల జాబితాలో చేర్చాలని హైకోర్టు కోరింది. ఈలోగా ఈ కేసులో ఎలాంటి పరిణామాలు జరుగుతున్నాయో సుప్రీం కోర్టు పర్యవేక్షిస్తూ వుంటుందని అధికారులు తెలుసుకోవాలని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు.

నిమిషాల్లో పార్లమెంట్ వాయిదా

- అదానీ, మణిపూర్, సంభాల్‌పై చర్చకు పట్టుబట్టిన ప్రతిపక్షాలు
- నిరాకరించిన మోడీ సర్కార్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అదానీ ముడుపుల వ్యవహారం, మణిపూర్ హింస, ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో శాంతి భద్రతల ఉల్లంఘన అంశాలపై చర్చకు ప్రభుత్వం తిరస్కరించడానికి నిరసనగా ప్రతిపక్షాలు ఆందోళనకు దిగడంతో పార్లమెంట్ ఉభయ సభలు సమావేశమైన కొద్ది నిమిషాలకే మరుసటి రోజుకు వాయిదా పడ్డాయి. తొలుత లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అదానీ ముడుపుల వ్యవహారంపై ప్రధాని మోడీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల ఆందోళన నడుమ స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు ప్రారంభించారు. ప్రతిపక్ష సభ్యుల నిరసనలు, అరుపులతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. దీంతో సభ మొదలైన పది నిమిషాలకే మధ్యాహ్నం 12 గంటలకు స్పీకర్ ఓం బిర్లా వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాలు తమ ఆందోళనను కొనసాగించాయి. ప్యానల్ స్పీకర్ దిలీప్ సైకియా అదానీ వ్యవహారం, మణిపూర్ హింస, సంభాల్ హింసపై ప్రతిపక్షాలు ఇచ్చిన వాయిదా తీర్మాన నోటీసులను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఎవరు ఏమి మాట్లాడుతున్నదీ వినిపించలేదు. ఈ గందరగోళం మధ్య నేషనల్ ఎఆర్‌టి అండ్ సరోగసీ బోర్డులో ఇద్దరు మహిళా సభ్యులను నియమిస్తూ కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి నడ్డా ఓ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా లోక్ సభ దీన్ని మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఆ వెంటనే సభను సోమవారానికి వాయిదా వేశారు. రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి. చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ ప్రతిపక్ష సభ్యులు ఇచ్చిన 17 వాయిదా తీర్మాన నోటీసులను తిరస్కరించారు. ప్రతిష్టంభన కొనసాగడంపై ధన్‌ఖర్ అసహనం వ్యక్తం చేశారు.

ఢిల్లీలో శాంతి భద్రతలపై ఆప్ ఆందోళన

ఢిల్లీలో శాంతిభద్రతలు క్షీణించడాన్ని నిరసిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపిలు పార్లమెంట్ ఆవరణంలో ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనలో ఆప్ ఎంపిలు సంజయ్ సింగ్, రాఘవ్ చద్దా తదితరులు ప్లకార్డులు చేబూని మోడీ సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాల హోరెత్తించారు.

66 మంది డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వం 66 మంది డిప్యూటీ కలెక్టర్ల బదిలీ, పోస్టింగ్‌లకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు శుక్రవారం జిఓ ఆర్‌టి నెంబరు 2033ను విడుదల చేసింది. పలు జిల్లాల్లో డిప్యూటీ కలెక్టర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో పాలనాపరమైన ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఈ బదిలీలు జరిగినట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం. వీరిలో కొందరికి డిప్యూటీ కలెక్టర్లుగా పోస్టింగ్‌లు ఇవ్వగా, ఒకరిద్దరిని ఆలయాలకు ఇఒలుగా నియమించారు. మిగిలిన వారిని ఆయా జిల్లాల్లో అవసరాన్ని బట్టి వివిధ రకాల పోస్టులకు బదిలీ చేసింది.

రబీ గట్టెక్కేదెలా!

- ఏలేరు నుంచి సాగునీరు అందేనా?
- వరదలకు 280 చోట్ల గండ్లు
- పనులు త్వరితగతిన చేపడితేనే రైతులకు మేలు

3

నేడు తీరం దాటనున్న ఫెంగల్

- తమిళనాడులోని ఏడు జిల్లాలకు హెచ్చరికలు
- స్కూళ్లకు సెలవు, పరీక్షల వాయిదా • పలు జిల్లాల్లో రెడ్ అలెర్ట్

చెన్నై : ఫెంగల్ తుపాను శుక్రవారం మధ్యాహ్నం తమిళనాడులోని మమల్లపురం (మహాబలిపురం), కరైకల్ (పుదుచ్చేరి) మధ్య తీరం దాటనుందని చెన్నైలో ప్రాంతీయ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ఈ ప్రభావంతో తమిళనాడులోని ఏడు తీర ప్రాంతా జిల్లాల్లో శుక్రవారం సాయంత్రం చెన్నయ్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. శనివారం సాయంత్రం వరకూ అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని, తుపాను తీరం దాటే సమయంలో గంటకు 70 -80 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశముందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. కొన్ని డెల్టా, ఉత్తర కోస్తా జిల్లాలో 24.4 సెంమీలకు పైన అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని రెడ్ ఎలర్ట్ జారీ చేసింది. శుక్రవారం మధ్యాహ్నం విడుదల చేసిన సమాచారం ప్రకారం ఆ సమయానికి ఫెంగల్ తుపాను బంగాళాఖాతంలో చెన్నైకు 480 కిమీ, నాగపట్నానికి 310 కిమీ దూరంలోనూ ఉన్నట్లు తెలిపింది. ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి తీరాలపై కదులుతున్నట్లు తెలిపింది. శనివారం మధ్యాహ్నానికి తీరం దాటుందని, తమిళనాడులోని ఏడు జిల్లాలు పుదుచ్చేరిలోనూ భారీ లేదా కుండపోత వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. వాతావరణ కేంద్రం హెచ్చరికలతో తమిళనాడు ప్రభుత్వం ప్రజలకు హెచ్చరికలు జారీ చేసింది. అత్యవసరమయితే తప్ప ఇళ్ల నుంచి బయటకు వెళ్లవద్దని స్పష్టం చేసింది. ముందుజాగ్రత్త చర్యగా విద్యా సంస్థలకు శనివారం సెలవు ప్రకటించింది.

7న మెగా పేరెంట్-టీచర్ మీటింగ్

- రాజకీయాలకు అతీతంగా పాల్గోవాలి : మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాల విద్యాశాఖలో అతిపెద్ద పండగగా డిసెంబరు 7న రాష్ట్ర వ్యాప్తంగా తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల సమావేశం (పిటిఎం) నిర్వహించనున్నట్లు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాజకీయాలకు అతీతంగా తమ పరిధిలోని పాఠశాలల్లో జరిగే ఈ సమావేశంలో పాల్గొనాలని శుక్రవారం బహిరంగ లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఎడ్యుకేట్, ఎంగేజ్, ఎంపవర్ లక్ష్యాలతో దేశంలోనే తొలిసారిగా ఒకేసారి నిర్వహించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పిల్లల చదువు, ప్రవర్తన, క్రమశిక్షణ తల్లిదండ్రులు తెలుసుకోవచ్చునని తెలిపారు. పిల్లల సమస్యలు, అభ్యసనా సామర్థ్యాలు, క్రీడలు, కళలు పట్ల ఆసక్తులను ఉపాధ్యాయుల ముందుంచి వారిని మరింతగా ఆయా అంశాల్లో పరిణతి సాధించేలా ప్రోత్సహించవచ్చని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థను రాజకీయాలకు దూరంగా ఉంచడం, విద్య నేర్చుకునే పిల్లలు, వారి తల్లిదండ్రులను పాఠశాలలకు దగ్గర చేయడం తమ ప్రభుత్వం లక్ష్యమని వెల్లడించారు. పేరెంట్, టీచర్ సమావేశానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు ఏ పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్నా తమ పార్టీ జెండాలు, కండువాలు, రంగులు వేసుకుని రావొద్దని విజ్ఞప్తి చేశారు. పాఠశాలలకు విరాళాలిచ్చిన దాతలు, పాఠశాలల అభివృద్ధికి దోహదపడే పూర్వ విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా ఈ సమావేశంలో భాగం కావాలని కోరారు.

భూ కేటాయింపునకు ధరల పాలసీ

- రాజధానిలో పలు సంస్థలకు కేటాయింపులు
- కేబినెట్ సబ్ కమిటీలో నిర్ణయం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతిలో పలు సంస్థలకు భూములు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శుక్రవారం ఉదయం వెలగపూడి సచివాలయంలో రాజధాని భూములపై ఏర్పాటుచేసిన కేబినెట్ సబ్ కమిటీ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ కమిటీలో మంత్రి నారాయణ, కొల్లు రవీంద్ర, గుమ్మడి సంధ్యారాణి తదితరులు ఉన్నారు. ముఖ్యంగా రాజధాని పనులను 2025 జనవరి నుండి ప్రారంభించాలని నిర్ణయించారు. అలాగే పలు సంస్థలకు భూములు కేటాయించడంతోపాటు, గతంలో కేటాయించిన సంస్థల గడువు ముగిసిన నేపథ్యంలో వాటి గడువునూ పొడిగించారు. సమావేశం అనంతరం వాటి వివరాలను మంత్రి నారాయణ మీడియాకు వెల్లడించారు. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్స్ డిజైన్‌కు ఐదెకరాలు కేటాయించారు. ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీకి 0.8 ఎకరాలు, బసవతారకం కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు 15 ఎకరాలు ఇచ్చారు. ఎల్‌అండ్‌టి స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు ఐదెకరాలు ఇచ్చారు. బ్రహ్మకుమారి ఎడ్యుకేషన్ సొసైటీకి పదెకరాలు ఇచ్చారు. వెంకటపాలెం వద్ద గతంలో టిటిడి దేవస్థానానికి ఇచ్చిన 25 ఎకరాలను పూర్తిగా దేవస్థానానికి కేటాయించేస్తూ నిర్ణయం తీసుకున్నారు. 131 సంస్థలకు గతంలో భూములు కేటాయించామని, వాటితో మరికొన్ని సంస్థలకు అదనపు కేటాయింపులు చేశామని మంత్రి నారాయణ వెల్లడించారు. గతంలో భూములు కేటాయించిన వారికి అదే ధరకు ఇస్తున్నామని, దీనికోసం ఒక పాలసీని తయారు చేస్తున్నామని చెప్పారు. డిసెంబర్ నెలాఖరులోపు భూ కేటాయింపులు పూర్తవ్వాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

విశాఖ డెయిరీ అవినీతిపై విచారణకు హౌస్ కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖ డెయిరీలో అవినీతి, అక్రమాలపై విచారణ చేసేందుకు శాసనసభ స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రత్యేక హౌస్ కమిటీని శుక్రవారం నియమించారు. ఇదే అంశంపై ఈ నెల 20న శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించడంతో ఈ కమిటీ ఏర్పాటుకు అడుగుపడినట్లు స్పీకరు తెలిపారు. కమిటీ ఛైర్మన్‌గా జ్యోతుల నెహ్రూ, సభ్యులుగా బోండా ఉమామహేశ్వరరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పల్లా శ్రీనివాసరావు, గౌతు శిరీష, ఆర్‌విఎస్‌కెకె రంగారావు, దాట్ల సుబ్బరాజును నియమించారు. కమిటీ సమగ్ర విచారణ చేసి రెండు నెలల్లో నివేదికను సమర్పించాలని స్పీకర్ ఆదేశించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఇది ఒక కీలక అడుగుగా ఆయన అభిప్రాయపడ్డారు.

వివేకా హత్య కేసులో భాస్కర్ రెడ్డికి నోటీసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో వైఎస్ భాస్కర్ రెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులిచ్చింది. వివేకా హత్య కేసులో వైఎస్ భాస్కర్‌రెడ్డి బెయిల్‌ను రద్దు చేయాలని సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఒకసారి బెయిల్ పిటిషన్ కొట్టివేసిన న్యాయమూర్తి ఇప్పుడు బెయిల్ మంజూరు చేశారని సిబిఐ తరపున న్యాయవాది అడిషనల్ సొలిసిటర్ జనరల్ (ఎఎస్‌జి) రాజ్ ఠాక్రే తెలిపారు. ఇదే కేసులో మిగిలిన నిందితులకు కూడా బెయిల్ రద్దు చేయాలని దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులోనే విచారణ జరుగుతోందని ధర్మాసనం దృష్టికి సునీత తరపున న్యాయవాది జెఎస్ఎల్ వాహీ తీసుకొచ్చారు. ఆ పిటిషన్లతోనే భాస్కర్‌రెడ్డి బెయిల్ రద్దు పిటిషన్‌ను కూడా జత చేయాలని కోరారు. దీంతో భాస్కర్‌రెడ్డికి ధర్మాసనం నోటీసులు జారీ చేసి, మిగిలిన పిటిషన్లకు ఈ పిటిషన్‌ను జత చేయాలని ఆదేశించింది. అనంతరం విచారణను వాయిదా వేసింది.

12న రాష్ట్రవ్యాప్త నిరసనలు

- సమ్మె హామీల అమలు కోసం అంగన్‌వాడీ సంఘాల ఆందోళన

సమ్మెసందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీల పత్రాలను చూపిస్తున్న అంగన్‌వాడీ సంఘాల నాయకులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత ఏడాది 42 రోజులపాటు సమ్మె చేపట్టిన అంగన్‌వాడీలకు చర్చల్లో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని అంగన్‌వాడీ సంఘాలు డిమాండ్ చేశాయి. సమ్మె ప్రారంభించి డిసెంబర్ 12 నాటికి ఏడాది అవుతున్న సందర్భంగా ఆ రోజు రాష్ట్ర వ్యాప్తంగా ప్రాజెక్టుల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని పిలుపునిచ్చాయి. శుక్రవారం ఉదయం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ, నాయకులు ఎన్‌సిహెచ్ సుప్రజ, గజలక్ష్మి, ఉమాదేవి, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి లలితమ్మ, ప్రేమ, ఎపి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు) కార్యదర్శి విఆర్ జ్యోతి, భారతి, పద్మ పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు అనేక సేవలు అందిస్తున్న అంగన్‌వాడీలపై రకరకాల యాప్‌ల పేరుతో విపరీతమైన పనిభారం పెంచారని తెలిపారు. ఫోన్లు పనిచేయడం లేదని, సెంటర్ నిర్వహణకు ఇవ్వాల్సిన బిల్లులు, అద్దెలు నెలనెలా చెల్లించడం లేదన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయని పేర్కొన్నారు. గత ఐదేళ్లగా అంగన్‌వాడీలకు వేతనాలు పెరగలేదని తెలిపారు. సెంటర్ నిర్వహణకు పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని, దీంతో అప్పుల పాలవుతున్నారని పేర్కొన్నారు. 2023 డిసెంబర్ 12 నుండి 2024 జనవరి 22 వరకూ 42 రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు సమ్మెకు దిగారని వివరించారు. అంతకముందు జులై నెలలో చర్చలకు పిలిచి వేతనాలు పెంచుతామని తెలిపారని, ఇతర సమస్యలు పరిష్కరిస్తామని మినిట్స్ కాపీ కూడా ఇచ్చారని తెలిపారు. వీటిని అమలు చేయాలని కూటమి ప్రభుత్వానికి పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా పరిష్కరించలేదన్నారు. సమ్మె ప్రారంభించి డిసెంబర్ 12 నాటికి ఏడాది అవుతుందని, ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రాజెక్టుల్లో నిరసన ప్రదర్శనలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఒప్పంద సమయంలో అంగీకరించిన హామీలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న మొత్తం మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ వెంటనే జిఓ ఇవ్వాలన్నారు. సర్వీసులో ఉండి చనిపోయిన వారి దహన సంస్కారాలకు రూ.20 వేలు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, సమ్మెకాలంలో చనిపోయిన వారికి కూడా అమలు చేయాలని కోరారు. ప్రీ స్కూల్‌ను బలోపేతం చేయాలని, పిల్లలకూ తల్లికి వందనం అమలు చేయాలని, ఐదేళ్ల వరకూ పిల్లలు అంగన్‌వాడీ సెంటర్లలో ఉండేలా జిఓ ఇవ్వాలని కోరారు. వారికి సాయంత్రం స్నాక్స్ కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సాధికారత సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులు అనే పదాన్ని తొలగించాలని, సమ్మెకాలంలో పెట్టిన కేసులు ఎత్తేయాలని కోరారు. ఒకే యాప్ అమలు చేయాలని, ఇకవైసి, చిన్న పిల్లలకు ఫేస్ యాప్ రద్దు చేయాలన్నారు. పెండింగ్లో ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులు రెగ్యులర్‌గా సరఫరా చేయాలని, మెనూ, మెనూ ఛార్జీలు పెంచాలని కోరారు. వేతనంతో కూడిన మెడికల్ లీవు మూడు నెలలు ఇవ్వాలని, సెంటర్లకు ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీ యూనియన్లతో జాయింట్ మీటింగు ఏర్పాటు చేయాలని వారు కోరారు.

5 కీలక వింగ్స్
ఆధునిక టెక్నాలజీతో గంజాయి సాగుకు చెక్

- ఐజి (ఈగిల్) రవికృష్ణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గంజాయి సాగు, మాదకద్రవ్యాలు, డ్రగ్స్ అమ్మకాలు, రవాణాను అరికట్టేందుకు ఐదు విభాగాలతో ప్రత్యేకంగా వింగ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు యాంటి నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగిల్) ఐజి రవికృష్ణ తెలిపారు. మంగళగిరిలోని డిజిపి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశోధన, లీగల్ వింగ్, డాక్యుమెంటేషన్ ట్రైనింగ్, అవేర్‌నెస్ వింగ్, అడ్మినిస్ట్రేటివ్ వింగ్, టాస్క్‌ఫోర్స్ వంటి కీలక విభాగాలు ఏర్పాటుకు మార్గదర్శకాలు సిద్ధమవుతున్నాయన్నారు. ఈగిల్ నిర్వహణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా బడ్జెట్‌లో రూ.8.59 కోట్లు కేటాయించిందన్నారు. ఇంట్లోకి డ్రగ్స్ రాకుండా ప్రతి తల్లి బాధ్యత తీసుకుని ఈగిల్‌కు బ్రాండ్ అంబాసిడర్ కావాలన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి సాగు చేస్తుండటం దురదృష్టకరమన్నారు. గంజాయి సాగు చేస్తున్న వ్యక్తులు, రవాణా చేసే వ్యక్తులపై ఆధునిక టెక్నాలజీ సహాయంతో గట్టి నిఘా పెడుతున్నామన్నారు. డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాల సమాచారం అందించాలనుకునే వారి కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన టోల్ ఫ్రీ నెంబరు 1972 అన్ని వేళలా పనిచేస్తుందన్నారు. సమాచారం అందించిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఎన్‌డిపిఎస్ కేసుల్లో ముద్దాయిల ఫొటోలను ఆయా సచివాలయం / పోలీస్ స్టేషన్ నోటీస్ బోర్డులో పెట్టి అందరికీ తెలిసేలా చేస్తామన్నారు. అమరావతిలో ఈగిల్ హెడ్ క్వార్టర్స్, ప్రత్యేక నార్కోటిక్స్ కంట్రోల్ సెల్ ఏర్పాటు చేస్తామన్నారు. డ్రగ్స్ నియంత్రణ కోసం 459 మంది సిబ్బంది పనిచేస్తారన్నారు. నార్కోటిక్ ప్రధాన పోలీస్ స్టేషన్‌లో 66 మంది పోలీసు అధికారుల బృందం సేవలందిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఎస్‌పి (ఈగిల్) నగేష్‌బాబు పాల్గొన్నారు.

రైల్వే ప్రైవేటీకరణ చర్యలను ఉపసంహరించుకోవాలి

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైల్వే ప్రైవేటీకరణ చర్యలను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. విజయవాడ డివిజన్ 21వ ఎఐఎల్‌ఆర్‌ఎస్‌ఎ మహాసభ శుక్రవారం జరిగింది. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నర్సింగరావు మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైల్వేలతో సహా అన్ని ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటీకరిస్తుందన్నారు. ప్రైవేటీకరణ విధానానికి వ్యతిరేకంగా లోకో పైలెట్స్, కార్మిక సంఘాలు, ఎఐఎల్‌ఆర్‌ఎస్‌ఎ చేస్తున్న పోరాటాలకు సిఐటియు పూర్తి మద్దతునిస్తుందన్నారు. సభలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు వివిఎల్ నరసింహులు, ఎఐఎల్‌ఆర్‌ఎస్‌ఎ నాయకులు కె రామకృష్ణ, కెవిఆర్‌కె రాజు ప్రసంగించారు.

ఎఐఎల్‌ఆర్‌ఎస్‌ఎ విజయవాడ డివిజన్ అధ్యక్షులుగా వెంకటేషన్

ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ (ఎఐఎల్‌ఆర్‌ఎస్‌ఎ) విజయవాడ డివిజన్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా ఎం వెంకటేషన్, ప్రధాన కార్యదర్శిగా ఆర్‌వి రాము, ఉపాధ్యక్షులుగా కె రామకృష్ణతోపాటు మరో 20 మందిని నూతన కమిటీలో సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ మేరకు రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి వివిఎల్ నరసింహులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎఐఎల్‌ఆర్‌ఎస్‌ఎ విజయవాడ బ్రాంచ్ నూతన ప్రెసిడెంట్‌గా ఎన్ఎన్‌వి రావు, బ్రాంచ్ సెక్రటరీగా గౌరీ ప్రసాద్, బ్రాంచ్ ట్రెజరర్‌గా కె శేఖర్‌ను ఎన్నుకున్నారు.

కానుకలు తీసుకోవడానికా స్టాండింగ్ కమిటీ ?

- రైల్వే స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ సిఎం రమేష్‌పై స్పీకర్‌కు సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ బీహార్ ఎంపి లేఖ
- తనకు వచ్చిన గిఫ్ట్ ప్యాక్‌ను వెనక్కి పంపిన సుదామ ప్రసాద్
- రైల్వేలో ప్రకంపనలు రేపుతున్న సిఎం రమేష్ వ్యవహారం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'బహుమతులు, కానుకలు తీసుకోవడానికా రైల్వే స్టాండింగ్ కమిటీ స్టడీ టూర్‌లు చేస్తోంది. ప్రజా ధనంతో పర్యటనలు చేసి ప్రజా సమస్యలను పట్టించుకోనక్కర్లేదా' అంటూ రైల్వే స్టాండింగ్ కమిటీ ఛైర్మన్, అనకాపల్లి బిజెపి ఎంపి సిఎం రమేష్ వ్యవహారంపై స్టాండింగ్ కమిటీ సభ్యులు సుదామ ప్రసాద్ లోక్‌సభ స్పీకర్‌కు తాజాగా రాసిన లేఖ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. దీంతో సి.ఎం.రమేష్‌కు షాక్ తగిలినట్టయింది. ఇప్పటికే ఉమ్మడి విశాఖ జిల్లా పరవాడ ఎన్‌టిపిసి బొగ్గు రవాణా కాంట్రాక్టును చేజిక్కించుకోవడానికి అదానీ కోసం ఈ ప్రాంత ప్రజాప్రతినిధిగా ఉన్న ఆయన చక్రం తిప్పిన విషయంపై చర్చ జరుగుతోంది. తాజాగా బయటపడిన కానుకల వ్యవహారంతో రైల్వేలోనూ ఈ చర్చ నడుస్తోంది. సిఎం రమేష్ ఇటీవల జరిగిన రైల్వే స్టాండింగ్ కమిటీ స్టడీ టూర్‌లో సభ్యులకు ఖరీదైన కానుకలు ఇప్పించారని తెలుస్తోంది. ఈ విషయమై సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ బీహార్ ఎంపి, రైల్వే స్టాండింగ్ కమిటీ సభ్యులు సుదామ ప్రసాద్ ఎదురు తిరిగారు. గత అక్టోబర్ 31 నుంచి ఈ నెల 7వ తేదీ వరకూ కమిటీ ఛైర్మన్ సిఎం రమేష్ నాయకత్వంలో స్టడీ టూర్ జరిగిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ బెంగళూరు, తిరుపతి, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో పర్యటించింది.

కానుకలు ఏమిటి?

రైల్వే స్టాండింగ్ కమిటీ సభ్యులకు ఇచ్చిన కానుకల్లో ఒక గ్రాము బంగారం, వంద గ్రాముల వెండి ఉండడాన్ని సుదామ ప్రసాద్ గుర్తించారు. ప్రజాధనాన్ని ఇలా దుబారా చేయడం దారుణమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనకు అందజేసిన గిఫ్ట్ ప్యాక్‌ను వెనక్కి పంపించేశారు. స్టాండింగ్ కమిటీ సమావేశాలకు హాజరయ్యే సభ్యులు, అధికారులు బస చేయడానికి ఫైవ్ స్టార్ హోటళ్లు వద్దని, ప్రజా సేవ చేయడానికి వచ్చినందున ప్రజల సొమ్మును దుర్వినియోగం చేయకూడదని సి.ఎం.రమేష్‌కు ఆయన లేఖ రాశారు. ఈ లేఖ రైల్వే శాఖలో ప్రకంపనలు సృష్టిస్తోంది.

కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ప్రమాదం

- కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్
- ఫార్మా ప్రమాద బాధితులకు పరామర్శ

బాధితున్ని పరామర్శిస్తున్న మంత్రి సుభాష్

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)

కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే పరవాడ ఫార్మాసిటీలో ప్రమాదం చోటుచేసుకుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ఈ ఘటనపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పరవాడ ఫార్మాసిటీలోని ఠాగూర్ లేబొరేటరీలో విషవాయువు లీకవ్వడంతో అస్వస్థతకు గురై విశాఖలోని షీలా నగర్ కిమ్స్ ఐకాన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితులను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుతో కలిసి ఆయన శుక్రవారం పరామర్శించారు. అనంతరం ఆస్పత్రి వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 26న ఠాగూర్ ఫార్మా కంపెనీలో రియాక్టర్ జిఎల్‌ఆర్ - 325 నుంచి క్లోరో ఫామ్ లీకై నేలపై పడిందని తెలిపారు. ఆ సమయంలో నేలపై పడిన బూడిదను శుభ్రపరిచే సమయంలో కార్మికులు ప్రమాదానికి గురయ్యారన్నారు. ఈ ఘటనలో ఇప్పటికే ఇద్దరు చనిపోయారని, వారి కుటుంబాలకు రూ.40 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించామని తెలిపారు. 26 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, వారంతా క్షేమంగానే ఉన్నారన్నారు. ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు మంత్రి చెప్పారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదాలు వెంటాడుతున్నాయని విమర్శించారు.

వర్రా రవీందర్ రెడ్డికి 14 రోజుల రిమాండ్

ప్రజాశక్తి-బాపట్ల

రవీంద్రారెడ్డిని కోర్టుకు తీసుకెళ్తున్న పోలీసులు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్య మంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌పై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన కేసులో వర్రా రవీందర్ రెడ్డికి బాపట్ల ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి జి రుక్మిణి 14 రోజుల పాటు రిమాండ్ విధించారు. ఈ కేసుకు సంబంధించిన పూర్వపరాలను పరిశీలిస్తే... కూటమి నాయకుల మధ్య చిచ్చు పెట్టాలనే ఉద్దేశంతో రవీందర్ రెడ్డి సోషల్ మీడియా గ్రూపుల్లో అసభ్యకర పోస్టులు, ఫొటోలు పెడుతున్నట్లు జనసేన సానుభూతి పరుడైన గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం గోగులమూడి గ్రామానికి చెందిన అముదాలపల్లి నరేంద్ర ఈ నెల 4న పెదనందిపాడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెదనందిపాడు ఎస్ఐ అద్దంకి మధుపవన్ కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా కడప జైలులో ఉన్న వర్రా రవీందర్ రెడ్డిని పిటి వారంట్‌పై బాపట్ల కోర్టులో హాజరు పరిచారు. కేసు పూర్వపరాలను విచారించిన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గూడూరు రుక్మిణి డిసెంబర్ 13 వరకూ 14 రోజుల పాటు రవీందర్ రెడ్డికి రిమాండ్ విధించారు.

మరోసారి బోరుగడ్డ అరెస్టు

- రాజమండ్రికి తరలింపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎన్నికల ఫలితాలకు ముందు ఆరా మస్తాన్ వెల్లడించిన ఎగ్జిట్ పోల్ ఆధారంగా వైసిపి మరోసారి గెలుస్తుందనే అతి విశ్వాసంతో చంద్రబాబు నాయుడు, లోకేష్‌తో ఒక సామాజిక తరగతి మహిళలను దూషిస్తూ వీడియో విడుదల చేసిన ఘటనలో బోరుగడ్డ అనిల్‌ను గుంటూరు పట్టాభిపురం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఓ కేసు విషయంలో అనిల్‌ను గుంటూరుకు తీసుకురాగా పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అనిల్‌కు కోర్టు రిమాండ్ విధించగా ఆయనను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. అనిల్ పెట్టిన పోస్టింగ్‌లపై ఎన్నికల ఫలితాలు రాకముందే కొంత మంది టిడిపి నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల నేపథ్యంలో అప్పట్లో కేసు నమోదు చేశారు.

సజ్జలపై కఠిన చర్యలొద్దు

- గత మధ్యంతర ఉత్తర్వులు పొడిగించిన హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

టిడిపి ఆఫీసుపై దాడి ఘటనకు సంబంధించి మంగళగిరి పోలీసులు పెట్టిన కేసులో వైసిపి నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై కఠిన చర్యలు తీసుకోరాదంటూ గతంలోని మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు శుక్రవారం పొడిగించింది. డిసెంబర్ 12న విచారణ చేస్తామని, అప్పటి వరకు సజ్జలపై కఠిన చర్యలు తీసుకోరాదని జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. టిడిపి ఆఫీసుపై దాడి కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ సజ్జల పిటిషన్ వేశారు. ఈ కేసులో పోలీసులు ఎల్‌ఒసి జారీ చేయడాన్ని కూడా సవాల్ చేస్తూ పిటిషన్ వేశారు.

సజ్జల భార్గవ్ రెడ్డికి ఊరట

వైసిపి సోషల్ మీడియా ఇన్‌ఛార్జి సజ్జల భార్గవ్ రెడ్డిపై నమోదైన కేసుల్లో పోలీసులు కఠిన చర్యలు తీసుకోరాదని హైకోర్టు ఆదేశించింది. తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ భార్గవ్ రెడ్డి వేసిన పిటిషన్‌ను జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ విచారణ జరిపారు. విచారణను డిసెంబర్ 6కు వాయిదా వేశారు. సోషల్ మీడియాలో పోస్టులకు చెందిన అభ్యంతరాలపై భార్గవ్ రెడ్డిపై వేర్వేరు జిల్లాల్లో పలు కేసులు నమోదయ్యాయి. ముందస్తు బెయిల్ పిటిషన్ల తరపున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, పోలీసుల తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా వాదించారు. విచారణ డిసెంబరు 6కు వాయిదా పడింది. ఇదే తరహా కేసుల్లో కడపకు చెందిన సరిగిరెడ్డి అర్జున్‌రెడ్డి, మరొక కేసులో షేక్ జానీ బాషా ఇతరులపై కూడా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించింది. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే పోలీసులతో మూకుమ్మడిగా కేసులు నమోదు చేస్తున్నారని పిటిషనర్లు వాదనలు వినిపించారు.

ఓల్గాకు పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, రావెల సాంబశివరావు తదితరులు

సాహిత్య రచనలో నూతన పద్ధతులు అన్వేషించాలి

- సాహితీ పురస్కార సభలో ప్రముఖ రచయిత్రి ఓల్గా
- కేశవరెడ్డి సాహితీ పురస్కారం-2024 అందజేత

ప్రజాశక్తి-గుంటూరు

సమాజంలో సాంకేతిక మార్పులు, సవాళ్లకు అనుగుణంగా కొత్త పద్ధతుల్లో సాహిత్య రచనకు సాహితీవేత్తలు, సంస్థలు కృషి చేయాల్సిన అవసరం ఉందని ప్రముఖ రచయిత్రి ఓల్గా అన్నారు. సాహిత్యాన్ని పాఠకులలోకి విస్తృతంగా తీసుకెళ్లడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. ప్రముఖ సాహితీవేత్త కొమ్మారెడ్డి కేశవరెడ్డి సాహితీ పురస్కార సభ శుక్రవారం గుంటూరులోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో జరిగింది. కేశవరెడ్డి సాహితీ పురస్కారం-2024ను రచయిత్రి ఓల్గాకు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సాహితీవేత్త రావెల సాంబశివరావు తదితరులు అందజేశారు. ఈ సందర్భంగా ఓల్గా మాట్లాడుతూ.. ఫాసిస్టు ధోరణులు పెరుగుతున్న నేపథ్యంలో రచనా వ్యూహాలను మార్చుకొని, ప్రజల్లోకి ప్రత్యామ్నాయ సాహిత్యాన్ని తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కొమ్మారెడ్డి వంటి గొప్ప సాహితీవేత్తల భావాల వారసత్వాన్ని కొనసాగించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ... ఉపాధ్యాయుడిగా, ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడిగానే కాక సాహిత్య రంగంలో తనకంటూ కేశవరెడ్డి ప్రత్యేక స్థానం ఏర్పరుచుకున్నారని తెలిపారు. ముఖ్యంగా అనువాద సాహిత్యంలో గొప్పవారని కొనియాడారు. ఉపాధ్యాయులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యు.రాజశేఖర్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ డి.ఆంజనేయరెడ్డి, సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యాజీ, ప్రజాశక్తి బుక్ హౌస్ జనరల్ మేనేజర్ లక్ష్మయ్య, అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, కేశవరెడ్డి కుటుంబ సభ్యులు శ్రీనివాసరెడ్డి, రాజీ తదితరులు పాల్గొన్నారు.

12న విజన్-2047 విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌ను డిసెంబర్ 12న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విడుదల చేయనున్నారు. ఈ డాక్యుమెంట్‌పై సచివాలయంలో శుక్రవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఈ డాక్యుమెంట్ డ్రాఫ్ట్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. పేదరికం లేని సమాజం, ఉపాధి కల్పన, నైపుణ్యం-మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత, వ్యవసాయంలో సాంకేతికత, అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలు, ఇంధన వనరుల సమర్థ వినియోగం, నాణ్యమైన ఉత్తత్తులు, బ్రాండింగ్, స్వచ్ఛాంధ్ర, డీప్ టెక్ అనే ప్రధాన సూత్రాలను సిఎం వివరించారు. ఈ లక్ష్యాలను సాధించేందుకు అనుసరించాల్సిన ప్రణాళికపై డాక్యుమెంట్‌లో పొందుపరిచారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్, వివిధ శాఖల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రామ్‌నాథ్ కోవింద్ దంపతులతో చంద్రబాబు భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దంపతులతో సిఎం చంద్రబాబు దంపతులు శుక్రవారం రాత్రి రాజ్‌భవన్‌లో భేటీ అయ్యారు. మర్యాదపూర్వక భేటీగా ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదే సందర్భంలో గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్‌తో చంద్రబాబు సుమారు 30 నిమిషాలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వీరిద్దరి మధ్య అదానీ అంశంతోపాటు రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, సోషల్ మీడియాలో పెట్రేగిపోయిన యాక్టివిస్టుల అరెస్ట్‌ల గురించి చర్చించినట్లు సమాచారం. వీటితో పాటు ఇటీవల ముగిసిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు, వైసిపి గైర్హాజరు వంటి విషయాలు వీరిద్దరి భేటీలో చర్చకు వచ్చినట్లు తెలిసింది.

పోలవరాన్ని 45.72 మీటర్లకే నిర్మిస్తాం

- మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తుకు నిర్మించి నీటిని నిల్వ చేస్తామని, ఈ విషయంలో ఎంతమాత్రం రాజీపడబోమని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. సచివాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు 41.14 మీటర్ల ఎత్తుకే నిర్మిస్తామని గత సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 29న కేంద్రానికి ప్రతిపాదన పంపిందని చెప్పారు. సవరించిన ధరను కమిటీ రూ.47,617 కోట్లకు ఆమోదం తెలిపిందన్నారు. ఈ ప్రకారం కేంద్ర కేబినెట్ పోలవరానికి రూ.12,157 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. వైసిపి నేతలు పోలవరంపై ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఎం చంద్రబాబు నేతృత్వంలో ప్రాజెక్టు డయాఫ్రం వాల్ ఇతర పనులను తిరిగి పునర్నిర్మిస్తామన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడ్డాం

- సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడ్డామని సమాచార, పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. వెలగపూడి సచివాలయంలో సీనియర్ జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. వారి సమస్యలపై విస్తృతంగా చర్చలు జరిపారు. త్వరలో అక్రిడిటేషన్ పాలసీతో సహా ఇతర సంక్షేమ పథకాలను అమలు చేస్తామని పేర్కొన్నారు. జర్నలిస్టులకు ఇళ్లు కట్టించి ఇచ్చే విషయంలో ఆలోచన చేస్తామని పిఎంఎవై 2.0లో అర్హులైన వారికి ఇళ్లు కట్టించే అంశాన్ని ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. హెల్త్ కార్డులు అందించడం, జర్నలిస్టులపై దాడులను నిరోధించడం, ఇతర సంక్షేమ పథకాల అమలు పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతామని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలను పత్రికలు, ప్రసార సాధనాలు ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. సోషల్ మీడియా దుర్వినియోగం చేయకుండా చూడటంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆరోగ్యకర పరిస్థితులు సమాజంలో నెలకొల్పాలని మీడియా ప్రతినిధులను ఆయన కోరారు. మీడియా అక్రిడిటేషన్ కమిటీకి సంబంధించిన విధివిధానాలను సమాచారశాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా వివరించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) నాయకులు ఆంజనేయులు, ఎస్ వెంకట్రావు, సురేష్ తదితరులు జర్నలిస్టుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. పలు సంఘాల నాయకులు డైరెక్టర్, మంత్రిని సన్మానించారు.

విద్యార్థి దారుణ హత్య

- మేనమామే హంతకుడు : ఎస్‌పి

ప్రజాశక్తి - మడకశిర

విద్యార్థి చేతన్ (ఫైల్‌ఫొటో)

శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మండలం డి. అచ్చంపల్లిలో ఓ విద్యార్థి దారుణహత్యకు గురయ్యారు. సొంత మేనమామే అల్లుడిని గొంతుకోసి హతమార్చాడు. పోలీసులు, బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. డి.అచ్చంపల్లి గ్రామానికి చెందిన దంపతులు పుష్పలత, వెంకటేష్‌లకు కుమారుడు చేతన్ ఉన్నారు. సమీపంలోని అమిదాలగొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్నారు. పాఠశాలకు వెళ్లిన చేతన్‌ను ఆయన మేనమామ అశోక్ గురువారం పాఠశాల నుంచి తీసుకువెళ్లాడు. పథకం ప్రకారం తన స్నేహితులతో కలిసి కర్ణాటక అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి బ్లేడుతో గొంతుకోసి హతమార్చాడు. అనంతరం హతుడి తల్లిదండ్రులతో కలసి చేతన్ కనిపించడం లేదని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులకు అశోక్ వైఖరిపై అనుమానం రావడంతో విచారణ చేపట్టారు. తానే గొంతుకోసి హతమార్చినట్లు అశోక్ నేరం అంగీకరించాడు. నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. కుటుంబ కలహాల నేపథ్యంలో హత్య జరిగిందని శుక్రవారం ఎస్‌పి రత్న విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు చెప్పారు.

కిరణ్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

గుండెపోటుతో పారిశుధ్య కార్మికుడి మృతి

ప్రజాశక్తి-పొదిలి

గుండెపోటుతో పారిశుధ్య కార్మికుడు మృతి చెందిన ఘటన ప్రకాశం జిల్లా పొదిలి నగర పంచాయతీలో శుక్రవారం చోటు చేసుకుంది. తోటి కార్మికుల కథనం ప్రకారం.. పారిశుధ్య కార్మికుడు కసుకుర్తి కిరణ్ రోజులాగే పనులు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో గుండెపోటుకు గురయ్యారు. గమనించి తోటి కార్మికులు ఒంగోలు హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కిరణ్ మృతదేహాన్ని నగర పంచాయతీ కమిషనర్ పి శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ మారుతీరావు, సిబ్బంది సందర్శించి నివాళు లర్పించారు. కొంత ఆర్థిక సాయం అందజేశారు. మానవత సంస్థ సభ్యులు, ఆకీబ్ అహమ్మద్ కుటుంబ సభ్యులు రూ. ఐదు వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

మృతుడి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : సిఐటియు

విధి నిర్వహణలో కిరణ్ మృతి చెందిన ఆయన కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ కోరారు. కిరణ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఎపి మున్సిపల్ అండ్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ పొదిలి నగర పంచాయతీ అధ్యక్ష కార్యదర్శులు డి సుబ్బయ్య, బి కోటేశ్వరరావు, నాయకులు వెంకట సింహం, నాగేశ్వరరావు కోటేశ్వరమ్మ, హజరతమ్మ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

స్కిల్ కేసులో చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ మరోసారి వాయిదా పడింది. హైకోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను రద్దు చేయాలని సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ సతీష్ చంద్ర శర్మతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. సిఐడి తరపున వాదనలు వినిపించేందుకు నేరుగా కోర్టుకు హాజరయ్యేందుకు కొంత సమయం ఇవ్వాలని సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ కోరారు. దీంతో ధర్మాసనం విచారణను జనవరి రెండో వారానికి వాయిదా వేసింది.

రబీ గట్టెక్కేదెలా!

- ఏలేరు నుంచి సాగునీరు అందేనా?
- వరదలకు 6 మండలాల్లో 280 చోట్ల గండ్లు
- పనులు త్వరితగతిన చేపడితేనే రైతులకు మేలు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

ఈ ఏడాది సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలు, వరదలకు ఏలేరు ఆయకట్టు కింద రైతులు తీవ్ర స్థాయిలో నష్టపోయారు. నాలుగు రోజుల పాటు వచ్చిన వరదలకు ఖరీఫ్ పంటను కోల్పోయారు. అనేక చోట్ల భారీ గండ్లు పడ్డాయి. కానీ, నేటికీ పూర్తి స్థాయిలో గండ్లను పూడ్చలేదు. రబీకి ఏలేరు నుంచి సాగునీరు సక్రమంగా అందే పరిస్థితి కనిపించట్లేదు. దీంతో, రబీ గట్టెక్కేదెలా? అంటూ పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ జిల్లాలో రబీ సాగును కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. కాకినాడ జిల్లాలో 20 మండలాల్లో 2.10 లక్షల ఎకరాల్లో వరి సాగు చేపట్టాలని కార్యాచరణలో పేర్కొన్నారు. మరో 20 వేల ఎకరాల్లో మినుము, పెసర వంటి అపరాలు సాగు చేయనున్నారు. గోదావరి తూర్పు డెల్టా పరిధిలో 1,05,341 ఎకరాలకు, పిఠాపురం బ్రాంచి కెనాల్ కింద 32,507 ఎకరాలకు, ఏలేరు కింద 53,017 ఎకరాలకు సాగునీటికి ఆమోదం తెలిపారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి రబీ సీజన్ ప్రారంభం కానుండగా, 31లోగా నాట్లు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఇదే సందర్భంలో సాగునీటి వ్యవస్థల పటిష్టతకు రూ.6 కోట్లు మంజూరు చేస్తున్నట్టు కలెక్టర్ ప్రకటించారు.

గండ్లు పూడ్చేది ఎప్పుడో?

ఏలేరు వరదల కారణంగా ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ప్రాజెక్టు పరిధిలో రైతాంగం తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. 19 ఏళ్ల తర్వాత ప్రాజెక్టులోకి రికార్డు స్థాయిలో వరద నీరు వచ్చింది. గత సెప్టెంబర్ 9 నుంచి 12 వరకు భారీ వరదల వల్ల జగ్గంపేట, కిర్లంపూడి, పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలాల్లో 208 చోట్ల ఏలేరు కాలువ వెంబడి గండ్లు పడ్డాయి. సుమారు 70 వేల ఎకరాల్లో వరి నేలమట్టమైంది. ఈ గండ్లు పూడ్చేందుకు రూ.19.53 కోట్లు అవసరం అవుతాయని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ, నిధులు విడుదల కాలేదు.

కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం రాజుపాలెం- ముక్కొల్లు మధ్య ఇసుక బస్తాలతో గండ్లను పూడుస్తున్న కార్మికులు

యుద్ధప్రాతిపదికన తాత్కాలికంగా గండ్లు పూడ్చేందుకు కలెక్టర్ రూ.5.5 కోట్ల టెంపరరీ ఫండ్స్‌ను కేటాయించారు. కలెక్టర్ ఆదేశాలతో 67 పనులను చేపట్టారు. ఇందులో భాగంగా ఇసుక బస్తాలతో గండ్ల వద్ద అడ్డుకట్టు వేశారు. గండ్లను పూడ్చేందుకు మెటీరియల్ తీసుకువెళ్లేందుకు అనేక ఆటంకాలు ఏర్పడుతున్నాయి. పొలాల్లోంచి వెళ్లాలంటే ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గండ్లు పూడిక పనులు ముందుకు సాగడం లేదు. మరో రెండు రోజుల్లోనే రబీ సీజన్ ప్రారంభం కానుంది. అయితే, పూర్తి స్థాయిలో గండ్లు పూడ్చే పనులను ఎప్పుడు ప్రారంభిస్తారనేది ఇంకా స్పష్టత లేదు. దీంతో, రైతులు కలవరం చెందుతున్నారు. రబీకు సాగునీరు సక్రమంగా అందుతుందా? లేదా? అనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో ప్రకృతి వైపరీత్యాలతో పంటను నష్టపోగా, రబీలో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల సాగునీరు సక్రమంగా అందే పరిస్థితి లేకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి శాశ్వతంగా గండ్లు పూడ్చి సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రబీకి నీటి ఎద్దడి లేకుండా చర్యలు

గండ్లు పూడిక పనుల కోసం రూ.19.53 కోట్లు అవసరం ఆవుతాయని ప్రతిపాదనలు పంపాము. ఈ నిధులు త్వరలోనే విడుదలయ్యే అవకాశం ఉంది. రబీకి ఎటువంటి ఆటంకమూ లేకుండా సగం పనులను పూర్తి చేశాం. త్వరలోనే మిగిలిన పనులూ పూర్తి చేస్తాం. రబీకి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

- శేషగిరి, ఏలేరు ప్రాజెక్టు ఇరిగేషన్ డివిజన్, పెద్దాపురం

నండూరి ప్రసాదరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కార్మికపక్షపాతి నండూరి

- వర్థంతి సభలో పలువురు వక్తలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

కార్మికవర్గ పక్షపాతి నండూరి ప్రసాదరావు అని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, సిఐటియు రాష్ట్ర నాయకులు ఎం.జగ్గునాయుడు, పూర్వ ఉపాధ్యక్షులు ఎ.అజశర్మ కొనియాడారు. విశాఖలోని జగదాంబ దరి సిఐటియు జిల్లా కార్యాలయంలో నండూరి ప్రసాదరావు 23వ వర్థంతి కార్యక్రమం సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నండూరి ప్రసాదరావు విశాఖ జిల్లా కార్మికవర్గ సమస్యలను పరిష్కరించడంలో కీలకపాత్ర పోషించారన్నారు. సిఐటియు ఏర్పాటు కాకముందే కార్మికుల సమస్యలను అధ్యయనం చేయడంలో దిట్టగా పేరుగాంచారని తెలిపారు. షిప్‌యార్డులో నాడు ఐఎన్‌టియుసి మూడు సున్నాల అగ్రిమెంట్ చేసి కార్మికులకు ద్రోహం చేస్తే.. దానిని కార్మికులంతా తిరస్కరించే విధంగా కార్మిక వర్గాన్ని ఐక్యపరిచి అగ్రిమెంట్‌ను రద్దు చేయించారని, మెరుగైన వేతన అగ్రిమెంట్ చేయించడంలో కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. జూట్‌మిల్లుల్లో పని చేసిన కార్మికుల సమస్యలపైనా, రక్షణ రంగం, బిహెచ్‌పివి, జింక్ పరిశ్రమల కార్మికులు, ఇతర అసంఘటిత రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపైనా అనేక పోరాటాలు చేశారన్నారు. ఆయన వేసిన పునాది వల్లే నేడు విశాఖలో సిఐటియు బలంగా ఉందని తెలిపారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నండూరి ప్రత్యక్షంగా పాల్గొన్నారన్నారు. బాలలకు సంఘాలను ఏర్పాటు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ చూపారని, వ్యవసాయ రంగంపై దృష్టిపెట్టి పని చేశారని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కో - కన్వీనర్ కెఎం.కుమార్ మంగళం, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్, ఎం.సుబ్బారావు, జి.పోలేశ్వరరావు, బాబూరావు పాల్గొన్నారు.

నేడు నేమకల్లులో గ్రామసభ

- ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రపజాశక్తి - బొమ్మనహాల్ (అనంతపురం జిల్లా)

అనంతపురం జిల్లా బొమ్మనహాల్ మండలం నేమకల్లులో శనివారం ఏర్పాటు చేయనున్న గ్రామ సభకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకుడు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో సిఎం పర్యటన ఏర్పాట్లను రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. గ్రామంలోని హెలిప్యాడ్ స్థలాన్ని, నేమకల్లు శ్రీ ఆంజనేయస్వామి దేవాలయాన్ని, నేమకల్లులో గ్రామసభ నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలించిన వారు అక్కడి ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, పోలీసు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పెద్దశేష వాహనంపై వైకుంఠనాథుని అలంకారంలో అమ్మవారు

పెద్దశేష వాహనంపై 'సిరుల తల్లి'

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజైన శుక్రవారం ఏడు తలల పెద్దశేష వాహనంపై పరమపద వైకుంఠనాథునిగా అమ్మవారిని అలంకరించారు. కోలాటాలు, చెక్కభజనల నడుమ అమ్మవారిని ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. ఆలయ అధికారులు మాట్లాడుతూ... శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలలో రెండవ వాహనం పెద్దశేషుడు, లక్ష్మీ సహితుడైన శ్రీవారికి దాసుడిగా, సఖుడిగా, శయ్యగా, సింహాసనంగా, ఛత్రంగా సమయోచితంగా సేవలందిస్తారని తెలిపారు. రాత్రి 7 నుండి 9 గంటల వరకు అమ్మవారు హంస వాహనంపై ఊరేగించారు. పెద్దశేష వాహన సేవలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఇఒ జె శ్యామలరావు, జెఇఒలు వీరబ్రహ్మం, గౌతమి, ఆలయ డిప్యూటీ ఇఒ గోవింద రాజన్, ఆలయ అర్చకులు బాబు స్వామి పాల్గొన్నారు.

డోలీ మోతల నివారణకు చర్యలు

- రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత
- మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - పాచిపెంట (పార్వతీపురం మన్యం జిల్లా)

డోలీ మోతలు గల గ్రామాలకు రహదారులు నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంటలో రూ.1.75 కోట్లతో నిర్మించిన గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల అదనపు వసతి భవనాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డోలీ మోతలుగల గ్రామాలకు రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చి, డోలీ మోతల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో గిరిజన ప్రాంతాల్లో రెండు వేల రహదారుల నిర్మాణానికి రూ.2,500 కోట్లు మంజూరు చేశామన్నారు. గిరిజన గ్రామాల్లో డోలీ మోతల నివారణకు గిరి వైద్య ఆరోగ్య కేంద్రాలు (కంటైనర్ ఆస్పత్రులు) ఏర్పాటు చేశామని తెలిపారు. అదనపు వసతి అవసరమైన ఆశ్రమ పాఠశాలల్లో నిర్మాణాలు త్వరగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. వసతి గృహాల్లో విద్యార్థుల ఆహార మెనూలో మార్పులు తీసుకొస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మంత్రి థింసా నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారి ఎ.మణి రాజ్, తహాశీల్దార్ డి.రవి, ఎంపిడిఒ బివిజె పాత్రో, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు

బాలికల ఆశ్రమ పాఠశాల అదనపు వసతి భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

స్మగ్లింగ్‌కు అడ్డాగా కాకినాడ పోర్టు

- అధికారుల నిర్లక్ష్యంతో దేశభద్రతకు తీవ్ర ముప్పు
- మొత్తం నెట్ వర్క్‌ను బ్రేక్ డౌన్ చేస్తాం
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ప్రజాశక్తి కాకినాడ ప్రతినిధి

కాకినాడ పోర్టును స్మగ్లింగ్‌కు అడ్డాగా మార్చేశారని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆరోపించారు. కాకినాడ పోర్టును ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ తీర ప్రాంతంలో అక్రమ రవాణా విషయంలో అధికార యంత్రాంగం వైఫల్యం చెందితే అది దేశ భద్రతకే భంగం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పోర్టు నుంచి ఇంత పెద్ద ఎత్తున రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నప్పుడు భవిష్యత్తులో పేలుడు, మత్తు పదార్థాలు దిగుమతి అయ్యే అవకాశమూ లేకపోలేదన్నారు. రేషన్ మాఫియా వెనుక ఎవరున్నా వదిలి పెట్టేది లేదని హెచ్చరించారు. మొత్తం నెట్‌వర్క్‌ను బ్రేక్ డౌన్ చేయాలని, రేషన్ బియ్యం పేద ప్రజలకు మాత్రమే అందాలని తెలిపారు. షిప్‌ను సీజ్ చేసి, దీని వెనుక ఎవరున్నారో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించామని తెలి పారు.

పోర్టులో తనిఖీలు

కాకినాడ పోర్టులో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలిసి పవన్‌కల్యాణ్ తనిఖీలు నిర్వహించారు.

సముద్రంలో ఉన్న స్టెల్లా ఎల్ పనామా షిప్ వద్దకు ప్రత్యేక బోటులో వెళ్లి తనిఖీలు చేపట్టారు. రెండు రోజుల క్రితం కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఇదే షిప్‌లో తనిఖీలు చేసి పట్టుకున్న 640 టన్నుల బియ్యాన్ని పరిశీలించారు. నౌకలో ఉన్న 38 వేల మెట్రిక్ టన్నుల బియ్యం ఎవరు సరఫరా చేశారనే దానిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ కాకినాడ పోర్ట్ నుంచి ఇంత భారీగా బియ్యం రవాణా అవుతుంటే ఏం చేస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. ప్రతిసారి ప్రజాప్రతినిధులు, నాయకులు వచ్చి బియ్యం అక్రమ రవాణా ఆపితేగాని ఆపలేరా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోర్ట్ ఆఫీసర్ ధర్మశాస్త్ర, డిఎస్‌పి రఘువీర్, సివిల్ సప్లయీస్ డిఎస్‌ఒ ప్రసాద్‌పై సీరియస్ అయ్యారు. పోర్టుకు రేషన్ బియ్యం వస్తుంటే పోలీసు శాఖ ఏం చేస్తోందని నిలదీశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు ఉంటాయని పవన్ హెచ్చరించారు.

పోర్టులో అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్

తప్పుడు ప్రకటనల్లో రియాల్టీనే టాప్

- బెట్టింగ్ యాడ్స్ ఎక్కువే
- ఎస్ఎస్‌సిఐ రిపోర్ట్

ముంబయి : రియల్ ఎస్టేట్, ఆఫ్‌షోర్ బెట్టింగ్ రంగాలలో వినియోగదారులను తప్పుదోవ పట్టించే చట్టవిరుద్ధ ప్రకటనలు భారీగా పెరిగాయని అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఎస్‌సిఐ) వెల్లడించింది. 2024-25 తొలి అర్థవార్షిక ఫిర్యాదుల రిపోర్ట్‌ను ఎస్ఎస్‌సిఐ విడుదల చేసింది. ఏప్రిల్-సెప్టెంబర్ 2024 మధ్య కాలంలో మొత్తంగా 4016 ఫిర్యాదులను సమీక్షించినట్లు తెలిపింది. ఉల్లంఘనలకు పాల్పడిన మొత్తం ప్రకటనల్లో రియల్టీ 34 శాతం, చట్టవిరుద్ధమైన బెట్టింగ్ 29 శాతం, ఆరోగ్య సంరక్షణ 8 శాతం, వ్యక్తిగత సంరక్షణ 7 శాతం, ఆహారం, పానీయాలు 6 శాతం చొప్పున వాటాలు కలిగి ఉన్నాయని తెలిపింది. 3031 ప్రకటనలకు కొంత సవరణలు అవసరమని గుర్తించినట్లు పేర్కొంది.

2087 ప్రకటనలు చట్టాన్ని ఉల్లంఘించినట్లు గుర్తించినట్లు పేర్కొంది. రియాల్టీకి సంబంధించి 1027 ప్రకటనలు, అక్రమ బెట్టింగ్‌ను ప్రోత్సహించే మరో 890 ప్రకటనల సమాచారాన్ని సమాచార, మంత్రిత్వ శాఖకు పంపించినట్లు వెల్లడించింది.

తయారీ, గనుల రంగాలు డీలా

- ఎన్ఎస్ఒ గణాంకాల వెల్లడి

న్యూఢిల్లీ : గడిచిన సెప్టెంబర్ త్రైమాసికంలో వ్యవసాయ రంగం 3.5 శాతం వృద్ధితో మెరుగైన ప్రగతిని కనబర్చింది. ఈ రంగం ఇంతక్రితం త్రైమాసికంలో 2 శాతంగా, గతేడాది సెప్టెంబర్ త్రైమాసికంలో 1.7 శాతంగా నమోదైంది. గనుల రంగం గతేడాది రెండంకెల పెరుగుదలను సాధించగా.. ఈ ఏడాది ప్రతికూల వృద్ధిలోకి జారుకుంది. ఈ రంగం క్రితం క్యూ2లో మైనస్ 0.1 శాతంతో ప్రతికూల వృద్ధిని చవిచూసింది. ఏడాదిక్రితం ఈ రంగంలో 11.1 శాతం పెరుగుదల ఉంది. అదే సమయంలో తయారీ రంగం 14.3 శాతం వృద్ధిని సాధించగా.. గడిచిన క్యూ2లో ఏకంగా 2.2 శాతానికి పడిపోయింది. విద్యుత్ రంగం వృద్ధి 10.5 శాతం నుంచి 3.3 శాతానికి క్షీణించింది. క్రితం క్యూ2లో నిర్మాణ రంగం 7.7 శాతం వృద్ధితో సరిపెట్టుకుంది. గతేడాది ఇదే త్రైమాసికంలో 13.6 శాతం పెరుగుదలను సాధించింది. ఇదే సమయంలో వాణిజ్యం, హోటళ్లు, రవాణా రంగాల జిడిపి 4.5 శాతంగా ఉండగా.. గడిచిన క్యూ2లో 5.7 శాతానికి పెరిగింది. ఫైనాన్షియల్, రియల్ ఎస్టేట్, నైపుణ్యాల సర్వీసులు ఏడాదికేడాదితో పోల్చితే 6.2 శాతం నుంచి 6.7 శాతానికి పెరిగాయి. ఊహించినదానికంటే బలహీనమైన వృద్ధి చోటుచేసుకోవడంతో భారత ఆర్థిక స్థిరత్వంపై ఆందోళనలను పెంచనుందని నిపుణులు పేర్కొంటున్నారు.. ముఖ్యంగా, తయారీ, మైనింగ్ లాంటి కీలక రంగాలు సవాళ్లను ఎదుర్కొంటున్నాయని స్పష్టమవుతోందన్నారు.

కీలక రంగాల నేల చూపులు

దేశ ఆర్థికవ్యవస్థలో అత్యంత ముఖ్యమైన ఎనిమిది కీలక రంగాలు డిమాండ్ లేక పడకేశాయి. ప్రస్తుత ఏడాది అక్టోబర్‌లో కీలక రంగాల వృద్ధి 3.1 శాతానికి పరిమితమైంది. 2023 ఇదే మాసంలో బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, స్టీల్, సిమెంట్, విద్యుత్ లాంటి ఎనిమిది కీలక రంగాలు ఏకంగా 12.7 శాతం శాతం వృద్ధి సాధించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ కాలంలో ఈ రంగాలు 4.1 శాతం వృద్ధికే పరిమితమయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో 8.8 శాతం శాతం వృద్ధిని కనబర్చాయి. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో ఈ రంగాలు ఏకంగా 40.27 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యత గల రంగాల వృద్ధి పడిపోవడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపనుంది.

బాబూ.. బుకాయింపులు ఆపండి : సిపిఐ

ప్రజాశక్తి-విజయనగరం కోట

అదానీ కుంభకోణం గురించి ప్రజలంతా చర్చించుకుంటున్నా.. తమకేమీ తెలియదన్నట్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవహరిస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. సమాచారం సేకరిస్తున్నామంటూ సిఎం బుకాయిస్తున్నారని ధ్వజమెత్తారు. విజయనగరంలోని ఆనంద గజపతి కళాక్షేత్రంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ అదానీ కుంభకోణానికి సంబంధించిన మూలాలన్నీ మన రాష్ట్రంవైపే వేలెత్తి చూపిస్తున్నా ఇప్పటి వరకు ముఖ్యమంత్రి స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ వ్యవహారంలో రూ.1750 కోట్లు.. నాటి ప్రభుత్వంలోని వారికి ఇచ్చారని కచ్చితంగా ఆధారాలు లభించినా ఇంకా ఆలోచన చేస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోందని తెలిపారు. చంద్రబాబు వద్ద ఆధారాలు లేకపోతే తాము అందజేస్తామని చెప్పారు. కార్పొరేట్ శక్తులకు మేలు చేకూర్చేలా దేశాన్ని మోడీ ప్రభుత్వం, కేంద్రం తొత్తులుగా ఉన్న టిడిపి కూటమి సర్కారు.. అదానీ విషయంలో కావాలనే తాత్సారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. మరోవైపు సెకీ కేసులో తనపేరు లేదని, తనకు సత్కారం చేయాలని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చెబుతుండటం చూస్తే ఆశ్చర్యం కలుగుతోందన్నారు. అదానీ చేతిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉండటంతో తనను ఏమీ చేయలేరనే ధీమాతో జగన్ ఉన్నారని పేర్కొన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అదానీతో ఒప్పందాలను రద్దు చేయాలని, కృష్ణపట్నం, గంగవరం పోర్టులను అదానీ నుంచి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర నాయకులు వి.కామేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ పాల్గొన్నారు.

జిల్లాలో అంతర్జాతీయ బృందం పర్యటన

- ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై క్షేత్రస్థాయి పరిశీలన

ప్రజాశక్తి- కుప్పం రూరల్ (చిత్తూరు జిల్లా)

ఆంధ్రప్రదేశ్‌లో ఆగ్రో ఎకాలజీ, వాతావరణ, ఆహారం, ఆరోగ్య సవాళ్లకు పరిష్కారాల ను చూపుతున్నారని అంతర్జాతీయ వ్యవసాయ ప్రతినిధులు ప్రశంసించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలపై 20 దేశాలకు చెందిన 51మంది అంతర్జాతీయ ప్రతినిధులు చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో శుక్రవారం పర్యటించి వేర్వేరు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ప్రపంచవ్యాప్తంగా ఆగ్రో ఎకాలజీలో జరుగుతున్న నూతన పరిజ్ఞానాన్ని పరిశీలించే క్రమంలో వాతావరణంలో వస్తోన్న మార్పులు, ఆహార భద్రత, ఆరోగ్యం తదితర అనేక సవాళ్లకు సమాధానంగా రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం అమలు చేయడం ప్రశంసనీయమని అంతర్జాతీయ ప్రతినిధుల బృందం పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం రైతు సాధికార సంస్థ ద్వారా అమలు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం రూపొందించిన సార్వత్రిక సూత్రాలు ప్రపంచంలో మరెక్కడా చూడలేదని, అనేక సవాళ్లను అధిగమించేలా ఈ సూత్రాలు ఉన్నాయని, ఈ సూత్రాలు ప్రపంచానికి ఎంతో అవసరమని అంతర్జాతీయ ప్రతినిధులు తెలిపారు. పనామా, బ్రెజిల్, గాంబియా, దక్షిణ కొరియా, ఇండోనేషియా, నెదర్లాండ్స్ తదితర దేశాల నుంచి ఆగ్రో ఎకాలజీ నిపుణులు, పరిశోధకులు, రైతు నాయకులు, వ్యవసాయ నిపుణులు ఈ బృందంలో ఉన్నారు. కుప్పం మండలంలోని సీగలపల్లి, అంకిరెడ్డిపల్లి, సింగా సముద్రం, జీడిమాకులపల్లి గ్రామాల లో వేర్వేరు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ఈ బృందం సభ్యులు సందర్శించారు. ఎపిఎస్‌ఆర్‌టిసి వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, ఎపిసిఎన్ఎఫ్ రీజనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ చక్రాల చంద్రశేఖర్ మునిరత్నం, జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ మురళీకృష్ణ, జిల్లా మేనేజర్ వాసు, రైతు సాధికార సంస్థ అధికారులు రాము, భాగ్యలక్ష్మి, సురేష్, జిల్లా స్థాయి మేనేజ్మెంట్ ప్రొఫెషనల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులు సాగు చేస్తున ప్రకృతి వ్యవసాయం గురించి అంతర్జాతీయ ప్రతినిధులకు వివరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారులు

డైమ్లర్ నుంచి భారత్ బెంజ్ టార్క్‌షిఫ్ట్ టిప్పర్లు

న్యూఢిల్లీ : డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్ (డిఐసివి)కి చెందిన సబ్సిడరీ డైమ్లర్ ట్రక్ ఎజి కొత్తగా భారత్ బెంజ్ హెవీ డ్యూటీ ట్రక్ శ్రేణిలో టార్క్‌షిఫ్ట్ టిప్పర్లను ఆవిష్కరించినట్లు తెలిపింది. ఇవి 12స్పీడ్ ఆటోమేటెడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ (ఎఎంటి) సామర్థ్యంతో రూపొందించబడ్డాయని పేర్కొంది. గనుల తవ్వకం కోసం భారీ ఆర్డర్ గెలుచుకున్నట్లు తెలిపింది.3532సిఎం మైనింగ్ టిప్పర్లకు సంబంధించి 80 యూనిట్ల తొలి ఆర్డర్ దక్కినట్లు వెల్లడించింది.

అమెజాన్ బ్లాక్ ఫ్రైడే ఆఫర్లు

న్యూఢిల్లీ : ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ బ్లాక్ ఫ్రైడే సేల్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. నవంబర్ 29 నుంచి డిసెంబర్ 2 వరకు ఆఫర్ల సేల్ ఉంటుందని శుక్రవారం ఆ సంస్థ వెల్లడించింది. నాలుగు రోజుల పాటు సాగే సేల్‌లో స్మార్ట్ ఫోన్లు, టీవీలు, ఇతర గృహోపకరణాలు, ఫ్యాషన్ ఉత్పత్తులపై ఆకర్షణీయ ఆఫర్లు పొందవచ్చని పేర్కొంది. యాక్సిస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ కార్డులపై 10 శాతం డిస్కౌంట్‌ను ఆఫర్ చేస్తోన్నట్లు తెలిపింది.

తరుగుతున్న విదేశీ మారకం నిల్వలు

ముంబయి : భారత విదేశీ మారకం నిల్వలు తగ్గిపోతున్నాయి. అమెరికా డాలర్‌కు డిమాండ్ పెరగడం.. రూపాయి విలువ పడిపోవడంతో మారకం నిల్వలపై ఒత్తిడి పెరిగింది. నవంబర్ 22తో ముగిసిన వారానికి ఫారెక్స్ నిల్వలు 1.31 బిలియన్ డాలర్లు తరిగి పోయి 656.58 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఇంతక్రితం వారంలో ఏకంగా 17.761 బిలియన్ డాలర్లు కరిగిపోయాయి. సెప్టెంబర్‌లో ఆల్‌టైం రికార్డ్ 704.89 బిలియన్లుగా ఉన్న ఫారెక్స్ రిజర్వుల నుంచి 47 బిలియన్లు కరిగిపోయాయి.

రాష్ట్రంలో కెవిబి కొత్త శాఖల ఏర్పాటు

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

రాష్ట్రంలో రెండు కొత్త శాఖలను ఏర్పాటు చేసినట్లు కరూర్ వైశ్యా బ్యాంక్ తెలిపింది. వీటిని కడప, విశాఖపట్నంలో అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. విశాఖలోని మురళినగర్‌లో ఏర్పాటు చేసిన కెవిబి నూతన శాఖను శుక్రవారం దేవాదాయశాఖ ప్రాంతీయ జాయింట్ కమిషనర్, సింహాచలం దేవస్థానం మూల్యాంకన అధికారి త్రినాధ్ రావు ప్రారంభించారని వెల్లడించింది. కడపలోని శాఖను రెవెన్యూ డివిజనల్ అధికారి జాన్ ఇర్విన్ పాలపర్తి లాంచనంగా ప్రారంభించారని తెలిపింది. వీటితో పాటు తమిళనాడులో రెండు కొత్త శాఖలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. దీంతో తమ మొత్తం శాఖల సంఖ్య 858కి విస్తరించినట్లు పేర్కొంది.

శ్రీవారి మెట్టుమార్గంలో యాత్రికుడు మృతి

ప్రజాశక్తి- తిరుమల:

తిరుమల శ్రీవారి మెట్టు మార్గంలో 500వ మెట్టు వద్ద గుండెపోటుతో ఓ వ్యక్తి మృతి చెందారు. తెలంగాణ హనుమకొండకు చెందిన గడ్డం సమ్మరావు తన కుటుంబ సభ్యులతో కలిసి మొక్కు తీర్చుకోవడానికి శ్రీవారి మెట్టు మార్గంలో శుక్రవారం ఉదయం బయలుదేరారు. 500 మెట్టు వరకు చేరుకోగానే చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో గుండె నొప్పిగా ఉందని చెప్పి ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు, తోటి యాత్రికులు అతన్ని రక్షించడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అప్పటికే గుండెపోటుతో మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఆయన స్వగ్రామానికి తరలించారు.

సంపాదకీయం

ప్రత్యేక హోదా!

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చే విషయంలో రాత పూర్వక హామీ లేనందున దీనిపై వ్యాజ్యంగా తీసుకోలేమని హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించడం ధర్మం కాదు. ప్రత్యేక హోదా అంశం రెండు ప్రభుత్వాల పరిధిలోని విషయమని, ప్రభుత్వాలు ఏం చేయాలో కోర్టులు చెప్పలేవని పేర్కొనడం నిరాశ కలిగించింది. పార్లమెంట్‌లో ఇచ్చిన హామీకి అనుగుణంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చేలా కేంద్రానికి ఆదేశాలు ఇవ్వాలంటూ ప్రజాశాంతి పార్టీ అధినేత కెఎ పాల్ దాఖలు చేసిన పిల్‌పై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. ప్రత్యేకహోదాపై మౌఖికంగానే కేంద్రం హామీ ఇచ్చిందని, రాతపూర్వకంగా లేనప్పుడు కోర్టులు ఎలా జోక్యం చేసుకుంటాయని కేంద్ర ప్రభుత్వం తరపున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ ప్రశ్నించడం తెంపరితనమే. అంతేగాక ఈ రాష్ట్ర ప్రజలను, వారి ఆకాంక్షలనూ తృణీకరించడమే ఔతుంది. పార్లమెంటులో ప్రధాని చేసిన ప్రకటనకు విలువ లేదని వాదించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం కూడా. వామపక్ష ఎంపిలతోపాటు బిజెపి సభ్యులు కూడా ప్రత్యేక హోదా కోసం ఆనాడు డిమాండ్ చేశారు. నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రత్యేక హోదాపై పార్లమెంటులో ప్రకటన కూడా చేశారు. అప్పుడు రాత పూర్వక హామీ ఇవ్వలేదని, దానికి విలువ లేదని ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం చెప్పడం ముమ్మాటికీ విద్రోహమే! కమలనాథులకు ఇది వెన్నుతో పెట్టిన విద్యని మరోమారు విదితమయింది.

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ప్రకటించాలన్న డిమాండ్ అత్యంత న్యాయసమ్మతమైనది, ధర్మబద్ధమైనది. కేంద్ర ప్రభుత్వ విద్రోహంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి. కార్యాచరణకు పూనుకోవాలి. రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ బిజెపితో అధికారం పంచుకుంటున్నారు కనుక టిడిపి, జనసేన నాయకులు కిమ్మనకుండా ఉండరాదు. ఒకప్పుడు ధర్మపోరాట దీక్షలని ఊరూరా తిరిగి యువతను, విద్యార్థులనూ సమీకరించిన ఈనాటి ముఖ్యమంత్రి ఒకసారి వాటిని గుర్తుకు తెచ్చుకోవడం అవసరం. ఆనాడు పాచిపోయిన లడ్డూలంటూ ఎద్దేవా చేసిన నేటి ఉప ముఖ్యమంత్రి తన వైఖరిని తెలుగు ప్రజలకు వెల్లడించాలి. తెలుగు ప్రజల ఆత్మగౌరవం పేరిట తెలుగుదేశం పార్టీని స్థాపించి కేంద్ర ప్రభుత్వ నిరంకుశ చర్యలను ఎదిరించిన ఎన్‌టి రామారావు వారసులమని చెబుతున్న ఆ పార్టీ నేతలు ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలి. రాష్ట్రాల హక్కుల కోసం ప్రతిపక్ష పాలిత ముఖ్యమంత్రులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, రాజ్యాంగంలోని ఫెడరలిజాన్ని కాపాడడానికి అవిరళ కృషి చేసిన యోధుడు ఎన్‌టిఆర్. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన ద్వారానే అటువంటివారి కలలు నెరవేరుతాయి. ఆ దిశగా టిడిపి శ్రేణులు యోచిస్తే పాలక కూటమిపై ఒత్తిడి పెరుగుతుంది.

భారతదేశ చరిత్రలో మొట్టమొదట ఏర్పడ్డ భాషాప్రయుక్త రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌ను కాంగ్రెస్, బిజెపి కూడబలుక్కొని నిలువునా చీల్చాయి. తీవ్రమైన నష్టాన్ని కలిగించే రాష్ట్ర విభజనను కోస్తాంధ్ర, రాయలసీమ ప్రజలు వ్యతిరేకించడంతో పార్లమెంటులో ప్రత్యేక హోదా, అదేవిధంగా ఇంకొన్ని హామీలనూ ఇచ్చారు. అంతేగాక 2014 ఎన్నికల్లో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామనీ, విభజన హామీలు నెరవేరుస్తామనీ నరేంద్ర మోడీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ తిరుపతి బహిరంగ సభలో వాగ్దానం చేసి కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారానికి వచ్చారు. కానీ మోడీ సర్కారు మాట మార్చి 'హోదా ముగిసిన అధ్యాయం' అని ప్రకటించి రాష్ట్ర ప్రజలను మోసపుచ్చింది. ఆ తరువాత రాష్ట్రంలో అధికారానికి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి కూడా హోదాపై ఏమీ చేయలేమని చేతులెత్తేయడం దారుణం. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఒక తప్పనిసరి అవసరం. రాష్ట్ర పారిశ్రామికీకరణకు, యువతకు ఉపాధి కల్పనకూ, రాష్ట్ర బడ్జెట్ సహాయానికీ... ఇలా సకల విధాలా ఇది ఎంతో ప్రయోజనకరం. దాన్ని సాధించుకోవడానికి రాష్ట్ర ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలి. పాలకులను నిలదీయాలి.

మంచి మాట

దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
వొట్టి మాటలు కట్టిపెట్టవోయ్
గట్టి మేల్ తలపెట్టవోయ్
- గురజాడ అప్పారావు

విశ్లేషణ

ప్రమాదంలో దేశ సమగ్రత



ఎం.వి. గోవిందన్

మెజారిటీ మెయితీల మద్దతుతో శాశ్వతంగా అధికారంలో తిష్ట వేయాలన్న ఆలోచనతో బిజెపి ఈ వివాదాన్ని రేపింది. ఇది నేడు దేశ సమైక్యతను, సమగ్రతను దెబ్బతీసే స్థాయికి వెళ్లింది. అందువల్లనే ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి చేతుల్లో దేశం ఏమాత్రం సురక్షితంగా లేదని సిపిఎం ఎప్పటి నుంచో చెబుతున్నది.సంఘ్ పరివార్ సమాజంలోని ఒక సెక్షన్‌ను శత్రువుల పక్షాన నిలిపి ఐక్యత కోసం పిలుపునిస్తుంది. అంతిమంగా అది విభజనకు, అంతులేని సంఘర్షణకు దారితీస్తుంది. మణిపూర్ ప్రారంభం మాత్రమే. మిజోరంలోని మెయితీలు భయం అంచున జీవనం సాగిస్తున్నారు. ఇతర ఈశాన్య రాష్ట్రాల్లోనూ బిజెపి ఇదే విధానాన్ని అవలంబిస్తోంది. మిజోరాం, నాగాలాండ్, జార్ఖండ్ లలో క్రైస్తవులను దువ్వి బంగ్లాదేశ్ ముస్లింలపైకి ఎగదోసేందుకు సంఘ్ పరివార్ ప్రయత్నిస్తోంది. ఇటువంటి విచ్ఛిన్నకర ఎజెండాను ఒకవైపు అమలు చేస్తూ మరోవైపు ఈశాన్య రాష్ట్రాల సంబంధాలను మెరుగుపరిచామని మోడీ గొప్పలు చెప్పకుంటున్నారు. మొత్తంమీద మోడీ పాలన ఈశాన్య రాష్ట్రాలలో రోసిపోయింది.

మణిపూర్‌లో కొనసాగుతున్న హింసలో తాజాగా మరో ఏడుగురు మృతి చెందడమే కాకుండా పరిస్థితి మరింత దిగజారింది. ఇటీవలి కాలంలో, కేంద్ర భద్రతా బలగాలు 11 మంది కుకీలను కాల్చి చంపినందుకు ప్రతీకారంగా జిరిబామ్ నుండి ఎనిమిది నెలల వయసున్న చిన్నారులు, రెండున్నరేళ్ల పిల్లలతో సహా ఆరుగురు మెయితీలను అపహరించారు. పోలీసుల కాల్పుల్లో మరో మెయితీ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఒకవైపు హత్యల పరంపర కొనసాగుతుండగానే మంత్రులు, రాజకీయ పార్టీల నేతల ఇళ్లు, కార్యాలయాలు తగలబడుతున్నాయి. మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ కుటుంబ సభ్యుల నివాసంపైనా దాడి జరిగింది. క్యాబినెట్ మంత్రులు తొంగం బిశ్వజిత్, గోబిందాస్ ఇళ్లకు నిప్పుపెట్టారు. తొమ్మిది మంది బిజెపి ఎమ్మెల్యేలు, ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే సహా 14 మంది ఎమ్మెల్యేల ఇళ్లపై దాడి జరిగింది. ఇంఫాల్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌ల బిల్‌బోర్డ్‌లను కూడా మూకలు ధ్వంసం చేశాయి. జిరిబామ్‌లో సి.ఆర్.పి.ఎఫ్ కాల్పుల్లో 11 మంది కుకీలు మరణించిన విషయాన్ని పోలీసులు దాచిపెట్టాలని చూశారు. కానీ పోస్టుమార్టం నివేదిక వాస్తవాన్ని బట్టబయలు చేసింది.

రాష్ట్రంలో దాడులు, కాల్పులు నిరంతరం జరుగుతుండటంతో రాజకీయ వాతావరణం కూడా శరవేగంగా దిగజారిపోతోంది. మెయితీ నాయకుడిలా పూర్తిగా పక్షపాత ధోరణిలో వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ పట్ల మిత్రపక్షాలు, సొంత ఎమ్మెల్యేలు సైతం విశ్వాసం కోల్పోయే పరిస్థితి నెలకొంది. బిజెపి తర్వాత ఫ్రంట్‌లో అతి పెద్ద భాగస్వామిగా వున్న 'నేషనల్ పీపుల్స్ పార్టీ' ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంది. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ... ఏడుగురు ఎమ్మెల్యేలతో కూడిన ఎన్‌పిపి తన మద్దతు ఉపసంహరించుకుంది. ప్రభుత్వానికి ముప్పు లేకపోయినప్పటికీ బీరేన్ సింగ్ ప్రభుత్వానికి ప్రజల్లో ఆదరణ రోజురోజుకు తగ్గుతోందని తెలుస్తోంది. ఇద్దరు ఎమ్మెల్యేలు వున్న 'కుకీ పీపుల్స్ ఫ్రంట్' మద్దతు ఉపసంహరించుకున్న ఏడాది తర్వాత మరో పార్టీ కూడా అదే బాటలో నడిచింది. ఇదిలా వుండగా ఎన్‌పిపి నేత, మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా మణిపూర్ ముఖ్యమంత్రిని మార్చాలని పట్టుబడుతున్నారు. మణిపూర్ ఘటనను ఈశాన్య రాష్ట్రాలు ఎలా చూస్తున్నాయనడానికిదొక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ప్రభుత్వం పూర్తిగా విఫలమైందంటూ జిరిబామ్ నియోజకవర్గ బిజెపి అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శితో సహా ఎనిమిది మంది రాజీనామా చేశారు. గత నెలలో స్పీకర్ సత్యవ్రత్ సింగ్, విద్యాశాఖ మంత్రి విశ్వజిత్ సింగ్ సహా 19 మంది బిజెపి ఎమ్మెల్యేలు బీరేన్ సింగ్‌ను మార్చాలని డిమాండ్ చేస్తూ ప్రధానికి లేఖ రాశారు. ఇంఫాల్‌లో సాధారణ పరిస్థితులు వున్నాయో లేవో నిర్ధారించుకోవడానికి మంగళవారం తన నివాసంలో ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన ఎన్‌డిఎ సమావేశం నుండి 11 మంది ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. వీరిలో ఏడుగురు బిజెపికి చెందిన వారు. ఇదంతా చూస్తుంటే కేంద్ర ప్రభుత్వం, బిజెపి రక్షణగా ఉన్న బీరేన్ సింగ్ కు మద్దతు తగ్గుముఖం పడుతోందన్న విషయం స్పష్టమౌతోంది. ఇదిలా వుండగా గవర్నర్ నివేదిక కోసం ఎదురు చూడకుండా శాంతిభద్రతలు దిగజారడానికి కారణమైన బీరేన్ సింగ్ ప్రభుత్వాన్ని కేంద్రం రద్దు చేయాలని ప్రముఖ న్యాయవాది దుష్యంత్ దవే డిమాండ్ చేశారు. ('ది హిందూ' కథనం). కాబట్టి ముఖ్యమంత్రిని మార్చేందుకు కేంద్రం, బిజెపి సిద్ధంగా ఉండాలి.

మణిపూర్ తగలబడిపోతున్నప్పుడు కూడా దాన్ని ఏమాత్రం సమస్యగా భావించని హోంమంత్రి అమిత్ షా మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల పర్యటనలో ఉన్నారు. అయితే పరిస్థితి విషమించడంతో అమిత్ షా ప్రచారానికి స్వస్తి చెప్పి ఢిల్లీకి హుటాహుటిన వెళ్లాల్సి వచ్చింది. అమిత్ షా రెండు రోజుల పాటు ఉన్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసి 50 కంపెనీల కేంద్ర పోలీసు బలగాలను మణిపూర్ పంపాలని నిర్ణయించారు. రాష్ట్రంలో సాధారణ పరిస్థితి నెలకొల్పాల్సిన అవసరం ఎంతైనా వుంది. ముందుగా ఈ విషయాన్ని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియచేయాలి. అందుకు తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి. సైనిక చర్యతో సమస్య పరిష్కారం కాదన్న విషయాన్ని మోడీ ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. వివాదం ప్రారంభమై ఏడాదిన్నర గడిచినా ప్రధాని రాష్ట్ర పర్యటనకు రాకపోవడం నేరపూరిత నిర్లక్ష్యమే. వివిధ వర్గాల ప్రజలను విశ్వాసంలోకి తీసుకునే ప్రయత్నాలు వేగంగా ప్రారంభించాలి. కాశ్మీర్, పంజాబ్, బాబ్రీ మసీదు సమస్యలు తలెత్తినప్పుడు జాతీయ సమైక్యత కమిటీ ద్వారా సమస్యను పరిష్కరించేందుకు అప్పటి ప్రభుత్వాలు ప్రయత్నించాయి. అయితే మోడీ ప్రభుత్వం వచ్చాక జాతీయ సమైక్యత కమిటీ గత చరిత్రగా మారింది. పదకొండేళ్లలో ఎన్నో సమస్యలున్నా ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదు.

అధికార బిజెపి, ప్రధాని మోడీ జాతీయ సమైక్యత, దేశ సమగ్రత, ఐక్యత గురించి పైకి చిలక పలుకులు పలుకుతుంటారు. కానీ ఆచరణలో మాత్రం వారు విభజించి పాలించాలన్న వలస పాలకుల వ్యూహాన్ని అనుసరిస్తుంటారు. కేంద్రంలోను, రాష్ట్రాలలోనూ అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు మతం, కులం, జాతి, భాష, ఆహారం ప్రాతిపదికన ప్రజలను విభజిస్తున్నారు. యు.పిలో యోగి ఆదిత్యనాథ్ ఆ నినాదంతోనే రాష్ట్ర ప్రజలను మత ప్రాతిపదికన చీలుస్తున్నారు. మొదట వారిని విభజిస్తారు. దాంతో వారు వినాశనం అంచుకు చేరుకుంటారు. సరిగ్గా మణిపూర్‌లో జరుగుతున్నది ఇదే.

ముస్లింలకు వ్యతిరేకంగా హిందువులు, క్రిస్టియన్లపై హిందువులు కాలు దువ్వేలా చేస్తున్నది. హిందీ మాట్లాడే వారిని ఇతర భాషలు మాట్లాడే వారిపైకి, శాకాహారులను మాంసాహారుల పైకి ఎగదోస్తోంది. హర్యానాలో జాట్‌లకు వ్యతిరేకంగా ఇతర జాతులవారిని, బీహార్, యు.పి లో అత్యంత వెనుకబడిన కులాల వారిపైకి యాదవులను ఎగదోయడం ద్వారా అధికారాన్ని సుస్థిరం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నది. హిందూత్వ వాదులు రాజ్యాంగంగా భావించే మనుస్మృతి ప్రజలను కులాల వారీగా విభజిస్తున్నది.

బిజెపి అనుసరిస్తున్న విభజన విధానమే ఈశాన్య రాష్ట్రాలను, ముఖ్యంగా మణిపూర్‌ను అశాంతికి గురిచేస్తున్నది. సంఘ పరివార్ క్రమంగా మెయితీలను వైష్ణవిజం వైపు తిప్పుకుంది. తరువాత సనాతన వాదాన్ని విశ్వసించే హిందూత్వ జాతీయవాదులుగా మార్చింది. తర్వాత క్రైస్తవ కుకీలకు వ్యతిరేకంగా వారిని సమీకరించింది. అరంబీలను సమీకరించి కుకీలపై దాడులకు థెమ్‌కాల్ అనే సాయుధ సమూహాన్ని ప్రోత్సహిస్తోంది.

మెజారిటీ మెయితీల మద్దతుతో శాశ్వతంగా అధికారంలో తిష్ట వేయాలన్న ఆలోచనతో బిజెపి ఈ వివాదాన్ని రేపింది. ఇది నేడు దేశ సమైక్యతను, సమగ్రతను దెబ్బతీసే స్థాయికి వెళ్లింది. అందువల్లనే ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి చేతుల్లో దేశం ఏమాత్రం సురక్షితంగా లేదని సిపిఎం ఎప్పటి నుంచో చెబుతున్నది. సంఘ్ పరివార్ సమాజంలోని ఒక సెక్షన్‌ను శత్రువుల పక్షాన నిలిపి ఐక్యత కోసం పిలుపునిస్తుంది. అంతిమంగా అది విభజనకు, అంతులేని సంఘర్షణకు దారితీస్తుంది. మణిపూర్ ప్రారంభం మాత్రమే. మిజోరంలోని మెయితీలు భయం అంచున జీవనం సాగిస్తున్నారు. ఇతర ఈశాన్య రాష్ట్రాల్లోనూ బిజెపి ఇదే విధానాన్ని అవలంబిస్తోంది. మిజోరాం, నాగాలాండ్, జార్ఖండ్ లలో క్రైస్తవులను దువ్వి బంగ్లాదేశ్ ముస్లింలపైకి ఎగదోసేందుకు సంఘ్ పరివార్ ప్రయత్నిస్తోంది. ఇటువంటి విచ్ఛిన్నకర ఎజెండాను ఒకవైపు అమలు చేస్తూ మరోవైపు ఈశాన్య రాష్ట్రాల సంబంధాలను మెరుగుపరిచామని మోడీ గొప్పలు చెప్పకుంటున్నారు. మొత్తంమీద మోడీ పాలన ఈశాన్య రాష్ట్రాలలో రోసిపోయింది.

/వ్యాసకర్త సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు /

సమస్య

సెకితో సౌర విద్యుత్ ఒప్పందం నష్టదాయకం

ఎం. వేణుగోపాలరావు



2025 సెప్టెంబరు, 2026 సెప్టెంబరుల నుండి 3000 మె.వా చొప్పున, 2027 సెప్టెబరు నుండి మరో 1000 మె.వా. చొప్పున ఈ సౌర విద్యుత్ కొనుగోలుకు ఎపి డిస్కాంలు, రాష్ట్ర ప్రభుత్వం సెకితో పిపిఎ చేసుకున్నాయి. ఆ మేరకు సరఫరా ప్రారంభమయ్యే నాటికి అంత సౌర విద్యుత్ రాష్ట్రానికి అవసరం లేదు. అనేక సంవత్సరాలుగా మిగులు విద్యుత్‌ను బ్యాక్ డౌన్ చేయాలని (ఉత్పత్తి తగ్గించాలని) థర్మల్ విద్యుత్ ప్లాంట్లను ఆదేశించటం, అలా ఉత్పత్తి చేయని విద్యుత్‌కు స్థిర చార్జీలను చెల్లించటం, మరోపక్క పీక్ కొరతను తీర్చటానికి మార్కెట్లో చాలా అధిక ధరలకు స్వల్పకాలిక విద్యుత్ కొనుగోళ్ళు చేస్తున్న పరిస్థితులు కొనసాగుతున్నాయి. విద్యుత్ డిమాండు పెరుగుదల, విద్యుత్ లభ్యత, మిగులు, పీక్ సమయాలలో కొరత అంచనాల ప్రకారం చూస్తే వచ్చే మూడేళ్ళలో కూడా ఇలాంటి నష్టదాయక పరిస్థితి కొనసాగుతుందని స్పష్టం అవుతుంది. అంటే, అదాని సౌర విద్యుత్‌ను కొనేందుకు డిస్కాంలు ఏ మేరకు థర్మల్ విద్యుత్‌ను బ్యాక్ డౌన్ చేయాల్సి వస్తే ఆ మేరకు నివారించదగిన స్థిర చార్జీలను చెల్లించాల్సి వస్తుంది. అవన్నీ ఎఫ్‌పిపిసిఎ రూపంలో వినియోగదారులపై పడతాయి.

అదాని గ్రూపుకు చెందిన రాజస్థాన్‌లోని ప్రాజెక్టుల నుండి ఏడాదికి 7000 మెగావాట్ల (17,000 మిలియన్ యూనిట్లకు మించకుండా) సౌర విద్యుత్ కొనుగోలుకు వైఎస్‌ఆర్‌సిపి ప్రభుత్వ ఆదేశం మేరకు రాష్ట్ర విద్యుత్ పంపిణీ కంపెనీలు భారత సౌర విద్యుత్ సంస్థ (సెకి)తో చేసుకున్న 25 ఏళ్ళ ఒప్పందం (పవర్ సప్లై అగ్రిమెంట్ పిఎస్‌ఎ) అనేక విధాలుగా నష్టదాయకమైనది. మోడి ప్రభుత్వ ఆశ్రిత పెట్టుబడిదారీ విధానంలో భాగంగా, మధ్య దళారిగా సెకి టెండర్లలో పేర్కొంటున్న షరతులు తమకు కావలసిన పెట్టుబడిదారీ సంస్థలకు ఎంపిక చేయడానికి వీలుగా తొత్తడం చేస్తున్నది. సౌర విద్యుత్ పరికరాలను తయారు చేసే సామర్థ్యం ఉన్న (ఉత్పత్తి చేయకపోయినా) సంస్థలే ఎంపికయ్యేలా టెండరు షరతులను రూపొందించింది. దీనితో, అలాంటి సామర్థ్యం లేని సంస్థలు టెండర్లు వేయడానికి వీలు లేకుండా పోయింది. నిజమైన పోటీకి తావు లేకుండా పోయింది. తొలుత పేర్కొన్న రేటును అదాని గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఎజిఈఎల్), అజూర్ పవర్ ఇండియా లిమిటెడ్ (ఎపిఐఎల్) యూనిట్‌కు రూ.2.93 నుంచి రూ.2.42కు తగ్గించాక, సెకి వాటిని ఎంపిక చేసింది. దీనికి తోడు మధ్య దళారిగా సెకికి యూనిట్‌కు ఏడు పైసలు చొప్పున కొనుగోలు సంస్థలు (ఎపి డిస్కాంలు) చెల్లించాలి. డిస్కాములే నిజమైన పోటీకి, అత్యధికంగా సంస్థలు పాల్గొనేందుకు వీలు కల్పించే షరతులతో నేరుగా టెండర్లు పిలిచి, అతి తక్కువ రేట్లను పేర్కొన్న సంస్థలను ఎంపిక చేస్తే పలు విధాలుగా ప్రయోజనకరంగా ఉండేది. సెకికి యూనిట్‌కు చెల్లించాల్సిన కమిషన్ 7 పైసలు చొప్పున భారీ మొత్తం ఆదా అయ్యేది. అంటే, ఏడాదికి రూ.119 కోట్ల చొప్పున 25 ఏళ్ళలో రూ.2975 కోట్ల మేరకు ఆదా అయ్యేది.

సెకి పై రెండు సంస్థలను ఎంపిక చేసిన నాటికి పోటీ బిడ్డింగు ద్వారా తేలిన సౌర విద్యుత్ రేట్లు చాలా తక్కువగా ఉన్నాయి. యూనిట్‌కు రూ.1.99 వరకు ఆ రేట్లు తగ్గాయి. ఆ విధంగా చూస్తే, యూనిట్‌కు 50 పైసల చొప్పున (సెకి కమిషన్‌తో కలుపుకుని) 17000 మి.యూ కు ఏడాదికి రూ.850 కోట్ల చొప్పున 25 ఏళ్ళలో రూ.21,250 కోట్ల మేరకు డిస్కాంలకు కొనుగోలు వ్యయం తగ్గేది. పోటీ బిడ్డింగులో తేలిన తక్కువ చార్జీలను బట్టి ఈ మొత్తంలో కొంత మార్పు ఉండవచ్చు.

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ కమిషన్ (ఎపిఈఆర్‌సి) వివరాలను వెల్లడించకుండా, బహిరంగా విచారణ జరపకుండా ఇచ్చిన ఆమోదంతో, రాష్ట్ర ప్రభుత్వం, డిస్కాంలు సెకితో 2021 డిసెంబరు మొదటి తేదీన పిఎస్‌ఎ చేసుకున్నాయి. ఒకేసారి 7000 మె.వా సౌర విద్యుత్ కొనుగోలుకు ఒప్పందం చేసుకోవటం అసాధారణం. సెకితో తాము చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పిపిఎ) ప్రపంచంలోనే అతి పెద్దది అని అదాని కంపెనీ 2021 డిసెంబరు 14న ప్రకటించింది. 2025 సెప్టెంబరు, 2026 సెప్టెంబరుల నుండి 3000 మె.వా చొప్పున, 2027 సెప్టెబరు నుండి మరో 1000 మె.వా. చొప్పున ఈ సౌర విద్యుత్ కొనుగోలుకు ఎపి డిస్కాంలు, రాష్ట్ర ప్రభుత్వం సెకితో పిపిఎ చేసుకున్నాయి. ఆ మేరకు సరఫరా ప్రారంభమయ్యే నాటికి అంత సౌర విద్యుత్ రాష్ట్రానికి అవసరం లేదు. అనేక సంవత్సరాలుగా మిగులు విద్యుత్‌ను బ్యాక్ డౌన్ చేయాలని (ఉత్పత్తి తగ్గించాలని) థర్మల్ విద్యుత్ ప్లాంట్లను ఆదేశించటం, అలా ఉత్పత్తి చేయని విద్యుత్‌కు స్థిర చార్జీలను చెల్లించటం, మరోపక్క పీక్ కొరతను తీర్చటానికి మార్కెట్లో చాలా అధిక ధరలకు స్వల్పకాలిక విద్యుత్ కొనుగోళ్ళు చేస్తున్న పరిస్థితులు కొనసాగుతున్నాయి. విద్యుత్ డిమాండు పెరుగుదల, విద్యుత్ లభ్యత, మిగులు, పీక్ సమయాలలో కొరత అంచనాల ప్రకారం చూస్తే వచ్చే మూడేళ్ళలో కూడా ఇలాంటి నష్టదాయక పరిస్థితి కొనసాగుతుందని స్పష్టం అవుతుంది. అంటే, అదాని సౌర విద్యుత్‌ను కొనేందుకు డిస్కాంలు ఏ మేరకు థర్మల్ విద్యుత్‌ను బ్యాక్ డౌన్ చేయాల్సి వస్తే ఆ మేరకు నివారించదగిన స్థిర చార్జీలను చెల్లించాల్సి వస్తుంది. అవన్నీ ఎఫ్‌పిపిసిఎ రూపంలో వినియోగదారులపై పడతాయి. ఉత్పత్తి సామర్థ్యాన్ని బ్యాక్ డౌన్ చేయాల్సిన మేరకు ఎపి జెన్‌కో, ఎపిపిడిసిఎల్ వంటి రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ఎన్‌టిపిసి వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలే సాంకేతికపరంగా, ఆర్థికంగా నష్టపోతాయి.

ఏటేటా డిమాండు పెరుగుదల, విద్యుత్ లభ్యత, అదనంగా చేర్చాల్సిన విద్యుత్ సామర్థ్యాన్ని వాస్తవికంగా అంచనా వేసుకుని, హెచ్చుతగ్గులుండే డిమాండును తీర్చేందుకు సాంకేతికంగా సాధ్యమైన మేరకు విద్యుత్ మిశ్రమం (థర్మల్, జల విద్యుత్, పునరుత్పత్తి అయ్యే సౌర, పవన విద్యుత్ వంటి వాటి మిశ్రమం) సమ తూకంలో ఉండేటట్లు పిపిఎలు చేసుకోవాలి. దానివల్ల మిగులు విద్యుత్ సాధ్యమైనంత తక్కువగా ఉండేటట్లు చూసేందుకు వీలవుతుంది. వినియోగదారులపై భారాలు కూడా ఆ మేరకు తగ్గుతాయి. ఒకేసారి 7000 మె.వా. సౌర విద్యుత్‌కు పిఎస్‌ఎ చేసుకోవటం వల్ల అదనపు భారాలు పెరుగుతాయి. ప్రతి సంవత్సరం సౌర విద్యుత్ ఏ మేరకు అవసరమౌతుందో వాస్తవిక అంచనాలు వేసుకుని, ఆ మేరకు లభ్యమయ్యే విధంగా పిపిఎలు చేసుకుని అనవసర భారాలను నివారించుకునే అవకాశాలను సెకితో చేసుకున్న ఒప్పందం వల్ల డిస్కాములు కోల్పోయాయి.

/ వ్యాసకర్త విద్యుత్ రంగ నిపుణులు /

వ్యాఖ్య

సంభాల్ మసీదు
మితిమీరుతున్న న్యాయ వ్యవస్థ

పార్లమెంటు 1991లో రూపొందించిన ప్రార్థనా స్థలాల చట్టం (ప్రత్యేక నిబంధనలు) ప్రాధాన్యత ఏమిటో ఇటీవల సంభవించిన సంభాల్ మసీదు ఘటనలు, అయిదుగురు ముస్లిం యువకుల మరణాలు నొక్కిచెప్పాయి. ఏదైనా ప్రార్థనా స్థలం మార్పిడి (సెక్షన్3)ని ఆ చట్టం నిషేధిస్తున్నది. 'ఏదైనా ప్రార్థనా స్థలం 1947 ఆగష్టు 15వ తేదీన మత పరంగా ఎలాంటి స్వభావం కలిగివుందో దాని కొనసాగింపు' (సెక్షన్ 8) జరగాలని చెబుతున్నది. ఏ వ్యక్తి అయినా 'ఏ మత సంబంధమైన లేదా అందులో ఒక తరహాకు చెందిన ప్రార్థనా స్థలాన్ని గానీ లేదా అందులో కొంత భాగాన్ని కానీ అదే మతానికి సంబంధించిన మరో విశ్వాసానికి లేదా మరో మతానికి మార్చడం' కుదరదని చెప్పింది. రామ జన్మభూమి–బాబ్రీ మసీదు వివాదాన్ని మాత్రం ఈ చట్టం పరిధిలోకి తీసుకోకుండా మినహాయింపునిచ్చింది

2019లో అయోధ్య వివాదంపై వెలువడిన అయిదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు కూడా ప్రార్థనా స్థలాల చట్టం చెల్లుబాటును పునరుద్ఘాటించింది. ప్రస్తుతమున్న ప్రార్థనా స్థలాలకు వ్యతిరేకంగా ఎలాంటి దావాలను స్వీకరించడానికి లేదని ప్రకటించింది. అయితే 2022 మే నెలలో సుప్రీం కోర్టు వారణాసి లోని గ్యానవాపి మసీదు సర్వేకు అనుమతినిచ్చింది. ఒక ఆలయ శిథిలాలపై ఆ మసీదు నిర్మించబడిందని జిల్లా కోర్టులో దాఖలైన ఒక పిటిషన్ పేర్కొంది. అప్పుడు సిజెఐ గా వున్న చంద్రచూడ్ అధ్యక్షతనగల ధర్మాసనం సర్వేను కొనసాగించడానికి అనుమతినిచ్చింది. ఒక మత ప్రదేశం స్వభావం ఏమిటో కనుగొనడం 1991 చట్టం కింద నిషేధించబడలేదని అభిప్రాయపడింది. పిపిటిషన్‌దారుడు 1947 ఆగష్టు 15వ తేదీ నాటికి ఆ ప్రార్థనా స్థలం పరిస్థితి ఏమిటో తెలుసుకోవాలనుకుంటున్నారే గానీ చట్టం చెప్పిన ప్రకారం దాని స్వభావాన్ని మార్చడం లేదా మార్పిడి చేయడం జరగాలని కోరడం లేదని కూడా కోర్టు భావించింది.

సంభాల్‌లో 16వ శతాబ్ది నాటి మసీదు వివాదం రగిలించేందుకు జరిగిన ప్రయత్నాలకు నాయ వ్యవస్థ కుమ్మక్కు దోహదపడింది. యు.పి లోని స్థానిక కోర్టులలో (వారణాసి, మధుర తర్వాత ఇప్పుడు సంభాల్ లో) మనం చూసింది ఒక క్రమపద్ధతిలో సాగుతున్నదే. హిందూ ఆధిక్యత నెలకొల్పడం కోసం శతాబ్దాల నాటి మసీదులను రణరంగాలుగా మార్చడం. ఇందులో అత్యంత ఆందోళనకరమైన అంశమేమంటే సాక్షాత్తూ సుప్రీం కోర్టు జస్టిస్ చంద్రచూడ్ నాయకత్వంలో అవకాశం కల్పించడం. అందుకోసం అంతకు ముందు తనే అందరూ అమలు చేయాలని ఆదేశించిన చట్టాన్ని బేఖాతరు చేయడం. వినాశకరమైన ఈ పంథాను వెనక్కు కొట్టాలంటే సుప్రీం కోర్టు తక్షణం జోక్యం చేసుకోవాలి.

మసీదు వివాదాల ప్రజ్వలన

సందేహాస్పదమైన ఈ తీర్పుతో ఎక్కడెక్కడ మసీదులు వున్నా వివాదాలు రగిలించేందుకు హిందూ మతతత్వ వాదులకు తలుపులు బార్లా తెరచినట్టయింది. గ్యానవాపి మసీదు సర్వే కోర్కె తర్వాత మధుర ఈద్గా మైదానంలోనూ అలాంటి కేసే రాగా జిల్లా కోర్టు సర్వేకు ఉత్తర్వునిచ్చింది. ఆ వరుసలో తర్వాత సంభాల్ వచ్చి చేరింది. 1526లో మొఘల్ యుగంలో నిర్మించిన ఈ మసీదుపై విష్ణుశంకర్ జైన్ అనే ఒక న్యాయవాది అభ్యర్థనపై నవంబరు 19న జిల్లా కోర్టు సర్వేకు అనుమతినిచ్చింది. అంతకు ముందు మధుర, వారణాసిలపై జిల్లా కోర్టులో పిటిషన్లు వేసింది కూడా ఈయనే. ఆ మసీదు రక్షిత కట్టడంగా వున్నప్పటికీ ఆ దరఖాస్తుకు వెంటనే అనుమతి లభించింది. దిగ్భ్రాంతి కలిగించేంత వేగంతో కోర్టు న్యాయవాదుల కమిటీని ఏర్పాటు చేసి ఆ రోజే సర్వే చేయాలని చెప్పింది. నవంబరు 29న సర్వే నివేదిక ఇవ్వాలన్నది. మసీదు కమిటీ వాదన సరిగా వినిపించడానికి కూడా సమయం ఇవ్వలేదు.

మసీదు కమిటీ పూర్తి సహకారంతో సర్వే పూర్తయింది. అయితే నవంబరు 24న మరోసారి సర్వే చేయాలని సర్వే బృందం అక్కడకు చేరుకుంది. అయితే ఈసారి వారితో పాటు పోలీసులేగాక 'జై శ్రీరాం' అని నినాదాలిస్తూ భారీ జన సమూహం కూడా వచ్చింది. ముస్లింలు కూడా సమీకృతులయ్యారు. కొద్ది సేపట్లోనే పరిస్థితి అదుపు తప్పిపోయింది. రాళ్ల రువ్వడం లాఠీచార్జి, బాష్పవాయు ప్రయోగం కాల్పుల దాకా వెళ్లింది. తుపాకి తూటాలు తగిలి ముగ్గురు ముస్లిం యువకులు కాల్పుల్లో చనిపోగా మరో ఇద్దరు తర్వాత గాయాలతో మరణించారు. స్థానిక సమాజ్‌వాది పార్టీ ఎంపీ, ఆయన కుమారుడు అల్లర్లు, హింసాకాండ రెచ్చగొట్టారంటూ పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి కోర్టుకు సమర్పించారు.

ఉత్తర ప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంలో ఏదో ఒక సాకుతో ముస్లింలపై దాడికి దిగడం పూర్తి స్థాయిలో సాగిపోతున్నది. కొద్ది వారాల కిందట బహ్రైచ్‌లో జరిగిన మత హింసాకాండ ముస్లింలపై నిర్బంధానికి దారితీసింది. డజన్ల కొద్ది ముస్లిం పురుషులను అరెస్టు చేశారు. హిందూత్వ సంస్థలు అనేక మసీదులను టార్గెట్ చేసుకుని లీగల్ వివాదాలను ప్రారంభించడానికి సిద్ధమవుతున్నాయి.

సుప్రీంకోర్టు తక్షణ జోక్యం

సంభాల్‌లో 16వ శతాబ్ది నాటి మసీదు వివాదం రగిలించేందుకు జరిగిన ప్రయత్నాలకు నాయ వ్యవస్థ కుమ్మక్కు దోహదపడింది. యు.పి లోని స్థానిక కోర్టులలో (వారణాసి, మధుర తర్వాత ఇప్పుడు సంభాల్ లో) మనం చూసింది ఒక క్రమపద్ధతిలో సాగుతున్నదే. హిందూ ఆధిక్యత నెలకొల్పడం కోసం శతాబ్దాల నాటి మసీదులను రణరంగాలుగా మార్చడం. ఇందులో అత్యంత ఆందోళనకరమైన అంశమేమంటే సాక్షాత్తూ సుప్రీం కోర్టు జస్టిస్ చంద్రచూడ్ నాయకత్వంలో అవకాశం కల్పించడం. అందుకోసం అంతకు ముందు తనే అందరూ అమలు చేయాలని ఆదేశించిన చట్టాన్ని బేఖాతరు చేయడం. వినాశకరమైన ఈ పంథాను వెనక్కు కొట్టాలంటే సుప్రీం కోర్టు తక్షణం జోక్యం చేసుకోవాలి. ఒక ప్రార్థనా స్థలంలో 1947 ఆగష్టు 15వ తేదీ తర్వాత ఎలాంటి న్యాయ వివాదాలకు అవకాశం లేదని చెబుతున్న ప్రార్థనా స్థలాల చట్టం శిరోధార్యతను గట్టిగా చెప్పడం జరగాలి.

(నవంబరు 27 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governerpet, VIJAYAWADA -520002 (A.P)

E Procurement Short Tender Notice

NIT No. 1. 14/MAU61/354/2024-IFR1 Dt.27.11.2024.
2. 05/MAU61/111/2024-IFR1/2nd call Dt.14.11.2024.

Name of Work:
1. "Providing Drinking water RO plant to APCRDA office at Lenin center and Sonovision CRDA office Eluru road in Vijayawada" - **Estimate Amount Rs.7,98,000/-**
2. "Providing Housekeeping services at APCRDA Office, Eluru Road, Vijayawada for a period of One Year" - **Estimate Amount Rs.13,60,116/-**

The bid can be downloaded on AP e-procurement portal from **02.12.2024** to **09.12.2024** up to **14.00 Hrs.** Due date for submission of Bid **09.12.2024** up to **15.00 Hrs,** Technical bid opening **09.12.2024 @16.00 Hrs.** For further details please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**

Sd/- Commissioner, APCRDA, Vijayawada

ఆధార్‌తో బ్యాంకు అనుసంధానం తప్పనిసరి

- ఆ దిశలో చర్యలకు అధికారులకు ఆదేశాలు
- లింకేజి కాని వారు రాష్ట్రంలో 50 లక్షలమంది

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నివసిస్తున్న ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలు ఆధార్‌తో అనుసంధానం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు ప్రతి ఒక్కరికి ఆధార్, బ్యాంకు ఖాతాలు తప్పని సరిగా ఉండేలా చూడటంతో పాటు, వాటిని అనుసంధానం చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. ఈ దిశలో సార్వత్రికమైన త్వరగా సూచనలు లక్ష్యాలను చేరుకోవాలని సూచించింది. ఇప్పటికీ బ్యాంకు ఖాతాలు ఆధార్‌తో అనుసంధానం కాని వారు రాష్ట్ర వ్యాప్తంగా 50 లక్షల మంది ఉన్నారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ కారణంగానే సంక్షేమ పథకాల నిధులు మంజూరుచేసినా లబ్ధిదారుల ఖాతాల్లో చేరడం లేదని అధికారులు అంటున్నారు. ప్రతి ఒక్కరి ఆధార్‌తో బ్యాంకు ఖాతాను అనుసంధానం చేయడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. 0-6 ఏళ్ల వయస్సులోపు చిన్నారులకు సంబంధించి మహిళా శిశుసంక్షేమ శాఖ పరిధిలో 11 లక్షల మందికి ఆధార్ కార్డులు లేవని కూడా ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. చిన్నారుల వివరాలను నూతనంగా నమోదు చేయడం, వారి బయో మెట్రిక్ తీసుకోవడాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఇటీవల విజయవాడ నగరంలో బుడమేరు సృష్టించిన వరద ప్రవాహంతో వందలాది కుటుంబాలు కట్టుబట్టలతో నిరాశ్రయులైన సంగతి తెలిసిందే. బాధిత గృహాలకు సకాలంలో జిపిఎస్ మ్యాపింగ్ లేక పోవడంతో వారికి ప్రభుత్వ సహాయం అందలేదని విమర్శలు వినవచ్చాయి. భవిష్యత్తులో ఇటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి ఇంటిని జిపిఎస్ మ్యాపింగ్ చేయడంతో పాటు ఆధార్, బ్యాంకు లింకేజీ కాని వారిని గుర్తించి వారి ఖాతాలకు లింకేజీ చేయించడం, ఇప్పటి వరకు అకౌంట్ లేని వారికి పోస్టాఫీసుల ద్వారా ఎన్‌పిసిఐ (నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) అకౌంట్లను తెరిపించి వారి ఖాతా నెంబరును కూడా ఆధార్‌కు లింక్ చేయాలని కూడా ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు బాధ్యతలు అప్పజెప్పింది. అంతే కాకుండా సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్ళి ఆయా గృహాలను జిపిఎస్‌తో లింక్ చేయడం, ఇంటిలో ఆధార్ లేని వారు ఉంటే వారి ఆధార్ కొత్తగా నమోదు చేయించడం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటి వరకు గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో ఉండే జిపిఎస్ మ్యాపింగ్‌ను ఇక పై ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో ఐదింటి చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
వలపర్ల బ్రాంచ్, మార్టూరు మండలం, బాపట్ల జిల్లా. ఫోన్: 77803 35618

బంగారు నగల వేలము ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఈ దిగువ ఖాతాదారులు మా బ్యాంకు నందు బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న ఋణము గడువు తీరిననూ చెల్లించలేదు. సదరు వ్యక్తులకు నోటీసులు పంపియున్నాము. సదరు నోటీసులను పంపినప్పటికీ ఖాతరు చేయనందున వారి బకాయిలను రాబట్టుకొనుటకు బ్యాంక్ నిబంధనలు అనుసరించి **తేది. 02-12-2024 అనగా సోమవారం మధ్యాహ్నం గం.3-00 లకు** బ్యాంకు ఆవరణలో బహిరంగంగా వేలం వేయుటకు నిర్ణయించడమైనది. **షరతులు : 1)** నోటీసులు చేరని వారు ఇదే ఆఖరు నోటీసుగా భావించవలెను. **2)** ఎటువంటి కారణములు తెలుపకనే వేలము వేయుటకు, నిలుపుదల చేయుటకు పూర్తిగా / పాక్షికంగా రద్దు చేయుటకు బ్యాంకు వారికి సర్వహక్కులు కలవు. **3)** ఈ ప్రకటన ఖర్చు అప్పుదారే భరించవలెను. **4)** వేలములో పాల్గొనువారు తప్పనిసరిగా **రూ. 10,000/-** ధరావత్తు సొమ్ము చెల్లించవలెను. వేలము పాడిన వెంటనే పూర్తిగా సొమ్ము చెల్లించి నగలను స్వాధీనం చేసుకోవలెను. లేనిచో ధరావత్తు సొమ్ము కోల్పోవుదురు.

అకౌంట్ నెం.	అకౌంట్ పేరు	బరువు గ్రా॥లలో
40795964494	షేక్ గౌస్ లాజమ్, తండ్రి : బాబు, వలపర్ల	70.00

తేది: 29-11-2024, ప్రదేశం: వలపర్ల సం/- బ్రాంచ్ మేనేజర్

FORM NO.14
{See Regulation 33(2)}

OFFICE OF THE RECOVERY OFFICER-I
DEBTS RECOVERY TRIBUNAL
(Department of Financial Services, Ministry of Finance, Government of India)
31-31-21, Narayana Bhavanam,
Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020.

DEMAND NOTICE
(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961)

RC/299/2020 **22.10.2024**

Canara Bank, Madhu Nagar Branch, Vijayawada, Krishna District
Versus
M/s Sri Kalli & another

To
(CD-1) M/s Sri Kalli, Rep. by its Prop. Smt. Seelam Rahel Kumari, Plot No. 31, Near Atkinson School, Gollapudi, Vijayawada, Krishna District.
(CD-2) Smt. Seelam Rahel Kumari, W/o Late Nathmel, HIG 384, APHB Colony, Bhavanipuram, Vijayawada, Krishna District.

1. This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, Debts Recovery Tribunal Vishakhapatnam in **OA/679/2019** an amount of Rs. **62,64,055/-** (**Rupees sixty two lakhs sixty four thousand and fifty five only**) (in which Rs. 36,10,546/- towards Term Loan with interest @ 10.40% p.a. and Rs. 26,53,509/- towards OCC with interest @ 11.45% p.a) along with pendentellite and future interest compounded with monthly rests from the date of application i.e. 03.07.2019 till realization / date of payment and the costs become due against you (Jointly and severally/ Fully/Limited).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of your assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on **02.12.2024** at **10:30 a.m.** for further proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay:
(a) Such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings.
(b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount.
6. Attention is invited to **Rule 16** of the Second Schedule to the Income Tax Act, 1961 which is reproduced below:
16(1) Where a notice has been served on a defaulter under Rule 2, the defaulter or his representative in interest shall not be competent to mortgage, charge, lease or otherwise deal with any property belonging to him except with the permission of the Recovery Officer, nor shall any Civil Court issue any process against such property in execution of a decree for the payment of money.
16(2) Where an attachment has been made under this Schedule, any private transfer or delivery of the property attached or of any interest therein and any payment to the defaulter of any debt, dividend or other moneys contrary to such attachment shall be void as against all claims enforceable under the attachment.

(Given under my hand and seal of this Tribunal at Visakhapatnam on the 22nd October, 2024)
(Avasarala Anil) Recovery Officer-I
Debts Recovery Tribunal, Visakhapatnam

టిటిడి అనుబంధ విభాగాల్లో నామినేటెడ్ పోస్టుల భర్తీకి కసరత్తు!

- డిసెంబరు మొదటి వారంలో నియామకాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిటిడి అనుబంధ విభాగాల్లోని కీలక నామినేటెడ్ పోస్టుల భర్తీకి రంగం సిద్ధమైంది. ప్రభుత్వం ఇప్పటికే టిటిడి పాలకమండలిని నియమించిన సంగతి తెలిసిందే. అందుకు అనుబంధంగా ఉండే పోస్టులను డిసెంబరు మొదటి వారంలో భర్తీ చేసేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం కసరత్తు వేగవంతం చేసినట్లు సమాచారం. యువత, విద్యావంతులు, ప్రత్యక్షంగా రాజకీయాలకు సంబంధం లేని వ్యక్తులకు ముఖ్యంగా శాసనసభలో ప్రాతినిధ్యం లేని కులాలకు పదవుల పంపిణీలో ప్రాధాన్యతనిచ్చే అవకాశం ఉంది. టిటిడి అనుబంధ విభాగాల్లో కీలకమైన శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానెల్ (ఎస్‌విబిసి), శ్రీ వెంకటేశ్వర ఎంప్లాయిస్ ట్రైనింగ్ అకాడమీ (ఎస్‌విఇటిఎ) ఛైర్మన్ నియామకం విభాగాలు అత్యంత కీలకమైనవి కావడంతో టిడిపి, జనసేన, బిజెపి నుంచి ఆశావహులు ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. వీరితోపాటు ఎస్‌విబిసి సిఇఒ, అడ్వైజర్, చీఫ్ అడ్వైజర్ పదవుల భర్తీ కోసం కసరత్తు జరుగుతోంది. ఎస్‌విబిసి ఛానెల్‌కు 2018లో అప్పటి టిడిపి ప్రభుత్వం సినీ దర్శకుడు రాఘవేంద్రరావును ఛైర్మన్‌గా నియమించింది. 2019లో వైసిపి అధికారంలోకి రావడంతో ఆ పదవికి ఆయన రాజీనామా చేశారు. అనంతరం వైసిపి ప్రభుత్వం ఆ పోస్టుకు సినీనటుడు పృథ్వీని నియమించింది. పలు వివాదాలు చుట్టుముట్టడంతో ఆ పదవికి ఆయన రాజీనామా చేశారు. అనంతరం వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ యాచేంద్ర ఎస్‌విబిసి ఛైర్మన్ బాధ్యతలు స్వీకరించారు. దాదాపు మూడేళ్లు ఆ పదవిలో కొనసాగిన ఆయన 2024 ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో ఆ పదవికి రాజీనామా చేశారు. శ్రీ వెంకటేశ్వర ఎంప్లాయిస్ ట్రైనింగ్ అకాడమీ ఛైర్మన్ పదవిని ఆశించే వారి సంఖ్య కూడా బాగానే ఉన్నట్లు తెలిసింది. టిటిడి ఉద్యోగులకు, అర్చకులకు ఎస్‌విఇటిఎ కేంద్రంగానే శిక్షణ ఇస్తుంటారు. ఆశావహులు పెరుగుతుండటం, గతంలో సినీ ఇండస్ట్రీ వారికి ఈ పదవి ఇచ్చిన నేపథ్యంలో వారికే ఈ దఫా కూడా పదవులు దక్కవచ్చని ప్రచారం జరుగుతోంది.

నిందితుడికి న్యాయ సహాయం కోరే హక్కుంది : హైకోర్టు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో : ఏదైనా కేసులో నిందితుడికి తనకు న్యాయ సహాయం అందించాలని కోరే హక్కు ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఒక కేసులో నిందితుడిని పోలీసులు పిటి వారంట్ మీద మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచినప్పుడు, ఆ నిందితుడు పోలీసు లేదా జ్యుడీషియల్ కస్టడీని వ్యతిరేకిస్తూ తనకు న్యాయ సాయం అందించాలని సదరు మెజిస్ట్రేట్‌ను కోరే హక్కు ఉంటుందని వెల్లడించింది. సోషల్ మీడియా కార్యకర్త ఇంటూరి రవికిరణ్‌కు హైకోర్టు అలాంటి వెసులుబాటును కల్పించింది. పోలీసులు పెట్టిన కేసుల విషయంలో తనకు న్యాయ సాయం చెప్పడం లేదంటూ రవి కిరణ్ న్యాయ సహాయం కోరడాన్ని సమర్థించింది. రవికిరణ్‌పై రాష్ట్రంలోని వేర్వేరు పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలన్నిటినీ తమ ముందుంచాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. తన భర్త ఇంటూరి రవికిరణ్‌పై ఉన్న కేసులకు సంబంధించిన వివరాలను గానీ, పిటి వారెంట్ గురించి గానీ పోలీసులు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదంటూ ఇంటూరి సుజన దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా హైకోర్టు పైవిధంగా ఉత్తర్వులు జారీ చేసింది.

బహిరంగ ప్రకటన

ICICI Home Finance | **రిజిస్టర్డు ఆఫీసు:** ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బంద్ర కుర్ల కాంప్లెక్స్, బంద్ర (ఈస్ట్), ముంబయి-400051.
కార్పొరేట్ ఆఫీసు: ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి టవర్, జెబి నగర్, అంధేరి కుర్ల రోడ్, అంధేరి ఈస్ట్, ముంబయి-400059.
బ్రాంచి చిరునామా: 54-20-1బి, యూనిట్ నం.4, మూడవ అంతస్తు, సూర్య ప్రకాశ్ స్క్వేర్, గురునానక్ కాలనీ, రెవెన్యూ వార్డు నం.2, విజయవాడ, ఆం.ప్ర-520007.

దిగువ రుణగ్రహీతలు ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ ("ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి") నుండి పొందిన రుణ సదుపాయంలో అసలు మరియు వడ్డీని తిరిగిచెల్లించుటలో డిఫాల్టిచెందుట ద్వారా వారి ఖాతాలు నాన్-పెర్ఫామింగ్ అసెట్ (ఎన్‌పిఏ)గా వర్గీకరించబడినవి. వారి గతంలో తెలిసిన చిరునామా పై సెక్యూరిటైజేషన్ అండ్ రీ-కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్-2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద వారికి నోటీసు జారీచేయబడినది. అయితే, వారికి బట్వాడా కానందున, ఈ బహిరంగ ప్రకటన రూపేనా ఇందుమూలంగా తెలియజేయబడుచున్నది.

క్ర. సం.	రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/హామీదారు పేరు/ (రుణ ఖాతా నంబరు) & చిరునామా	స్వాధీనంచేసుకున్న సెక్యూర్డ్ అసెట్ / ఆస్తి చిరునామా	పంపిన నోటీసు తేదీ/ నోటీసు తేదీ నాటికి బకాయి మొత్తాలు	ఎన్‌పిఏ తేది
1.	లంకసాయి కృష్ణ కుమార్ (రుణగ్రహీత), లంక రమాదేవి (సహ-రుణగ్రహీత), 31-167/2, ఎ.పి.హెచ్.ఎం.ఇ.ఎల్ రోడ్, పుల్లమ్మ గట్టు, కొండపల్లి, కృష్ణా, విజయవాడ, ఆం.ప్ర.-521228. LHVJW00001570682.	ఎపిహెచ్‌ఎంఇఎల్ రోడ్, కొండపల్లి మున్సిపాలిటీ, ఇబ్రహీంపట్నం ఎస్‌ఆర్‌ఒ, ఎన్‌టిఆర్ జిల్లా, ఆం.ప్ర-521228 వద్దగల ఆర్ఎస్ నం.281/2ఎ, అసెస్మెంట్ నం.1187013328 లో 100.11చ.గ.లు లేదా 83.70చ.మీ.ల విస్తీర్ణం మరియు 560చ.అ.ల ప్లింత్ ఏరియాతో డోర్ నం.31-7-1 గల ఆర్‌సిసి రూఫ్డ్ ఇంటి యొక్క మొత్తం భాగం. సరిహద్దులు: ఉత్తరం: లోకల రంగవాణి ఆస్తి, దక్షిణం: నడక దారి, తూర్పు: మున్సిపల్ రోడ్డు, పడమర: సునకార సత్యనారాయణ ఆస్తి.	16-11-2024 Rs. 15,69,128.38/-	08-11-2024
2.	ప్రొద్దుటూర్ రవీంద్రనాథ్ (రుణగ్రహీత), ప్రొద్దుటూరి రాజమని (సహ-రుణగ్రహీత), 6-611/ పి. కాకాని నగర్, జగ్గాయిపేట్, ఆం.ప్ర.-521175. LHVJW00001467357 .	కాకాని నగర్, జగ్గయ్యపేట మున్సిపల్ పరిధుల్లో, ఆం.ప్ర.-521175 వద్ద ఆర్ఎస్ నం.171లో 369చ.గ.ల విస్తీర్ణపు ల్యాండ్‌తో అసెస్మెంట్ నం. 1069006113 తో డోర్ నం.6-611గల ఇల్లు మొత్తం. సరిహద్దులు: ఉత్తరం: గుడిసె ప్రసాద రావు ఇల్లు& రోడ్డు, దక్షిణం: అల్లారపు సుబ్బారావు ఆస్తి, తూర్పు: సిసి రోడ్డు, పడమర: ధర్మవరపు బల్యా ఆస్తి.	16-11-2024 Rs. 20,84,756.48/-	08-11-2024
3.	మేడపాటి వీర రాఘవయ్య (రుణగ్రహీత), మేడపాటి అంబేద్కర్ (సహ-రుణగ్రహీత), 16-134/36, వలందపాలెం, మచిలీపట్నం, చిలకల పుడి, ఆం.ప్ర.-521002. LHVJW00001529098.	మాచవరపు శివారు, పట్టాభిపురం, మచిలీపట్నం టౌన్, కృష్ణా జిల్లా, ఆం.ప్ర. వద్ద ఆర్ఎస్ నం.251/2, పాత వార్డు నం.15, ప్రస్తుత వార్డు నం.16 లో డోర్ నం.16/134-36 గల అసంపూర్తి ఇల్లు మొత్తం. సరిహద్దులు: ఉత్తరం: రోడ్డు, దక్షిణం: అంబటి నాగేశ్వర రావు ఆస్తి, తూర్పు: కారె సుబ్రమణ్యం ఆస్తి, పడమర: మేడపాటి దుర్గ ప్రసాద్& మేడపాటి సురేశ్‌ల ఆస్తి.	16-11-2024 Rs. 9,13,667.04/-	08-11-2024
4.	మేడపాటి వీర రాఘవయ్య (రుణగ్రహీత), మేడపాటి అంబేద్కర్ (సహ-రుణగ్రహీత), 16-134/36, వలందపాలెం, మచిలీపట్నం, చిలకల పుడి, ఆం.ప్ర.-521002. LHVJW00001529165.	మాచవరపు శివారు, పట్టాభిపురం, మచిలీపట్నం టౌన్, కృష్ణా జిల్లా, ఆం.ప్ర. వద్ద ఆర్ఎస్ నం.251/2, పాత వార్డు నం.15, ప్రస్తుత వార్డు నం.16 లో డోర్ నం.16/134-36 గల అసంపూర్తి ఇల్లు మొత్తం. సరిహద్దులు: ఉత్తరం: రోడ్డు, దక్షిణం: అంబటి నాగేశ్వర రావు ఆస్తి, తూర్పు: కారె సుబ్రమణ్యం ఆస్తి, పడమర: మేడపాటి దుర్గ ప్రసాద్& మేడపాటి సురేశ్‌ల ఆస్తి.	16-11-2024 Rs. 41,822.26/-	08-11-2024

నోటీసుకు ప్రత్యామ్నాయంగా చర్యలు తీసుకోబడుచున్నవి. పై రుణగ్రహీతలు మరియు/లేదా వారి హామీదారులు (వర్తించునట్లుగా) ఈ నోటీసు ప్రచురించబడిన తేది నుండి 60 రోజుల కాలవ్యవధిలోగా బకాయిని తిరిగి చెల్లించవలసిందిగా సలహా ఇవ్వబడుచున్నది లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క నియమాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోబడుతాయి.

తేది: నవంబర్ 30, 2024
ప్రదేశం: విజయవాడ, జగ్గాయిపేట్, మచిలీపట్నం

అధీకృత అధికారి,
ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

FORM NO.14
{See Regulation 33(2)}

OFFICE OF THE RECOVERY OFFICER-I
DEBTS RECOVERY TRIBUNAL
(Department of Financial Services, Ministry of Finance, Government of India)
31-31-21, Narayana Bhavanam,
Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020.

DEMAND NOTICE
(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961)

RC/241/2019 **14.11.2024**

Canara Bank, Chandramouli Nagar Branch, Guntur District.
Versus
M/S VSR Cotton Traders & others

To
(CD-1) M/s VSR Cotton Traders, Rep. by its Prop. Sri. Yatam Tirumala Srinivasa Reddy, D.No. 8-211, C/o Sri. Siva Ramakrishna Ginning Mill, Anathavarappadu Road, Guntur District-522003.
(CD 2) Sri. Yatam Tirumala Srinivasa Reddy, S/o Sri. Venkata Reddy, Prop. of M/s VSR Cotton Traders, D No. 8-211, C/o Sri. Siva Ramakrishna Ginning Mill, Anathavarappadu Road, Guntur District-522003.

1) This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, Debts Recovery Tribunal Vishakhapatnam in **OA/516/2017** an amount of Rs. **88,60,763/- (Rupees eighty eight lakhs sixty thousand seven hundred and sixty three only)** along with pendentallite and future interest @ 11.70% p.a compounded with monthly rests from 27.06.2017 till realization / date of payment and the costs become due against you (Jointly and severally /Fully/Limited).
M/s Vijaya Sai Cotton Traders & another
To
(CD 1) M/s Vijaya Sai Cotton Traders, Rep. by its Prop. Sri. Chinta Ravindra Reddy, S/o Yella Reddy, D No. 9-8-22, Sistla Vaari Veedhi, Railpet, Guntur District-522001.
(CD-2) Sri. Chinta Ravindra Reddy, S/o Yella Reddy, D No. 9-8-22, Sistla Vaari Veedhi, Railpet, Guntur District-522001.
Whereas you the above said Certificate Debtors have failed to pay the sum of Rs. 1,62,36,725/- (Rupees one crore sixty two lakhs thirty six thousand seven hundred and twenty five only) minus Rs. 3,61,325/- (defendants paid on 23.03.2017 and Part Satisfaction Memo was filed on 14.03.2019) along with interest and also other costs payable by you in respect of Recovery Certificate dated 31.12.2019 in OA No. 210/2017 issued by the Hon'ble Presiding Officer, Debts Recovery Tribunal, Visakhapatnam and sent to the undersigned, specifying the amount to be recovered from you.
It is ordered that you, the said Certificate Debtors, are hereby prohibited and restrained until further order of the undersigned, from transferring or charging the under mentioned properties in any way and that all persons be, and that they are hereby prohibited from taking any benefit under such transfer or charge.
SCHEDULE OF THE PROPERTY
(Property belongs Sri. Chinta Ravindra Reddy, covered by Sale Deed bearing Document No. 8720/2013 dated 19.10.2013 registered at SRO-Guntur (R.O)
All that part and parcel of property consisting of Residential Apartment i.e Y.V.S Residency, D.No. 259, an extent of Ac. 0.86 1/2 Cents out of Ac.1.46 Cents out of Ac. 1.96 Cents, Door No. 261/B an extent of Ac. 0.52 Cents out of Ac. 1.04 Cents out of Ac.4.49 Cents, Plot No. 20, 21, 22, 11, 10, 9 constructed under total area of 1693.33 Sq.yds situated at Reddypalem Grama Panchayati, Guntur District and boundaries mentioned herein :
Boundaries of Appartement: East: Property of Eeda Sambireddy and Y Mallikarjuna Rao - 120 Ft., West: Plot 12 & 19 - 120 Ft., South: 40 Feet Width Road - 127 Ft., North: 40 Feet width Road - 127 Ft.
Boundaries of Flat. (Undivided and unspecified share of 42.75 Sq.yds in RCC Roof Structure, area of 980 Sq.Ft, Semi-finished including common area)
East: Open area, West: Common Corridor, South: Space between Flat No. 505 and this Flat open to sky, North: Flat No. 507 and this Flat open to sky.
(GIVEN UNDER MY HAND AND SEAL OF THIS TRIBUNAL AT VISAKHAPATNAM ON 19TH NOVEMBER, 2024)
(Avasarala Anil) Recovery Officer-I
Debts Recovery Tribunal, Visakhapatnam

TATA
టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
డిమాండ్ నోటీసు
సంప్రదించాల్సిన చిరునామా : 11వ అంతస్తు, టవర్ ఎ, పెనిన్సుల బిజినెస్ పార్క్, గణపత్‌రావు కదం మార్గ్, లోయర్ పారెల్, ముంబాయి 400013 సంప్రదించల్సిన నం. (022) 66069383.
సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ("రూల్స్") యొక్క రూల్ 3తో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 ("యాక్ట్") యొక్క సెక్షన్ 13(2) క్రింద.
ఏదైతే టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (టిసిహెచ్‌ఎఫ్‌ఎల్) యొక్క ఆధీకృత అధికారి అయిన దిగువ సంతకందారుడు చట్టం క్రింద మరియు రూల్స్ యొక్క రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద అధికారాలను అధ్యయనం చేస్తూ రుణగ్రహిత(లు)/సహ-రుణగ్రహీతల(లు)/హామీదారు(లు) (ఒక్కరు లేదా "పత్రం రాసి ఇచ్చినవారిని పరిగణించే వారందరిని)/చట్టబద్ధవారసు(లు)/చట్టబద్ధప్రతినిధు(లు) జాబితా దిగువ ఇవ్వడమైనది, సంబంధిత డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తం చెల్లించుటకు, సంబంధిత నోటీసు యొక్క తేది నుండి 60 రోజులలోగా, వివరాల ప్రకారం దిగువన ఇవ్వడమైనది. సదరు నోటీసుల కాపీలు రిజిస్టర్డ్ పోస్ట్ ఎ.డి ద్వారా పంపించడం జరిగింది మరియు దిగువసంతకందారుడుతో అందుబాటులో ఉంటుంది మరియు సదరు బాండ్ రాసి ఇచ్చినవారసు(లు)/చట్టబద్ధవారసుడు(లు)/చట్టబద్ధ ప్రతినిధి(లు), కాబట్టి వారి కోరిక మేరకు, సాధారణ కార్యాలయ వేళలో దిగువ సంతకందారుడి నుండి సంబంధిత కాపీని పొందవచ్చు.
పైదానికి అనుసందానంగా, ఇక్కడ నోటీసు ఇవ్వడమేమనగా, మరొక సారి, సదరు బాండ్ రాసి ఇచ్చినవారు(లు)/చట్టబద్ధవారసుడు(లు)/చట్టబద్ధ ప్రతినిధి(లు) లోను అగ్రిమెంట్ మరియు ఇతర డాక్యుమెంట్‌లు/వ్రాతపూర్వాకాలు చదువుతూ, చెల్లింపులు మరియు/లేదా తెలుసుకున్న తేది నుండి దిగువ కాలమ్ (డి) లో పేర్కొన్న సంబంధిత తేది నుండి దిగువ వివరించిన వడ్డీతో కలపుకొని సంబంధిత పేర్లకు ఎదురుగా దిగువ గుర్తించిన మొత్తాన్ని సంబంధిత నోటీసు/లు తేది నుండి 60 రోజులలోగా టిసిహెచ్‌ఎఫ్‌ఎల్‌కు చెల్లించవలెను, ఒకవేళ, సదరు లోన్ అగ్రిమెంట్ మరియు ఇతర డాక్యుమెంట్లు రాసి ఇచ్చినవారు(లు) ద్వారా అమలు జరిగినట్లయితే. లోను తిరిగిచెల్లించుటకు బకాయిల కొరకు సెక్యూరిటీగా ఉంచబడింది, సదరు బాండ్ రాసి ఇచ్చినవారు(లు) చే టిసిహెచ్‌ఎఫ్‌ఎల్‌కు దిగువ సెక్యూర్డ్ ఆస్తు(లు) తాకట్టుపెట్టబడింది.

క్ర సం.	లోన్ అకౌంట్ నం.	ఆబ్లిగేటర్(లు)/ చట్టబద్ధ వారసు(లు)/ చట్టబద్ధ ప్రతినిధు(లు) పేరు	దిగువ తేదీ ప్రకారం ఉన్న మొత్తం బకాయిలు (రూ)	డిమాండ్ నోటీసు తేది మరియు ఎన్‌పిఎ తేది
1.	10264983	శ్రీ. చంద్రశేఖరరావు కైటెపల్లి (రుణగ్రహీత) శ్రీమతి. పోలిమెట్ల శిరీష (సహ రుణగ్రహీత)	23-11-2024 నాటికి రూ.6,98,710/- (ఆరు లక్షల తొంభై ఎనిమిది వేల ఏడు వందల పది రూపాయలు మాత్రమే)	23.11.2024 & 07.11.2024

స్థిరాస్తి వివరణ : కృష్ణాజిల్లా-521185, నందిగామ సబ్ రిజిస్ట్రీ, చందర్లపాడు మండలం, కోనాయపాలెం గ్రామ పంచాయతీ ఏరియా, కోనాయపాలెం గ్రామంలో శ్రీ.కైటెపల్లి చందరశేఖర్ పేరు మీద ఉన్న వైడ్ సెటిల్‌మెంట్ డీడ్ నం.2093/2018 ప్లాట్ నం.106, ఆర్.ఎస్.నం.83/3లో ఉన్న స్థలం విస్తీర్ణం 165 చ.గ.లు. లేదా 137.96 చ.మీ.లు. బయట మొత్తం పరిధి ఎ.లు. 5.00 సెంట్లు. మరియు క్రింది విధంగా హద్దులు : తూర్పు : 40 అ.లు. వెడల్పు రోడ్డు 33.0 అ.లు., దక్షిణం : ప్లాట్ నం.105 - 45.0 అ.లు., పడమర : ప్లాట్ నం.113- 33.0 అ.లు., ఉత్తరం : ప్లాట్ నం.107- 45.0 అ.లు.
*తదుపరి వడ్డీతో, అదనంగా వడ్డీ సంబంధిత డిమాండ్ నోటీసులో తెలిపిన మరింత ప్రత్యేకంగా వివరించిన రేటు వద్ద, అదనపు వ్యయాలు, ఖర్చులు, చార్జీలు వగైర చెల్లించవలసిన మరియు/లేదా తెలిసినమేర తేదివరకు అనుభవించినవి. ముందు చెప్పి టిసిహెచ్‌ఎఫ్‌ఎల్‌కు చెల్లించుటకు బాండ్ రాసి ఇచ్చినవారసు(లు) విఫలంచెందినట్లయితే, సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద పై సెక్యూర్డ్ అస్సెట్(లు)/స్థిరాస్తు(లు) ఎదురుగా టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ తదుపరి చర్యలు సిద్ధమవుతుంది మరియు ఖర్చులు మరియు తదుపరి పర్యావసనాలకు బాండ్ రాసి ఇచ్చినవారసు(లు)/చట్టబద్ధవారసు(లు)/చట్టబద్ధప్రతినిధు(లు) వర్తించే నియమాలకు మొత్తం బాధ్యత వహిస్తారు.
బాండ్ రాసి ఇచ్చినవారసు(లు)/చట్టబద్ధవారసు(లు)/చట్టబద్ధప్రతినిధు(లు) టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ వారి ముందస్తు అనుమతి లేకుండా ఏవిధంగాను అమ్ముట, విక్రయించుట లేదా ఇతర ఏ రకంగాను ముందు చెప్పిన సెక్యూర్డ్ అస్సెట్(లు)/స్థిరాస్తు(లు) బదిలీ చేయడం చట్టం క్రింద నిషేదించబడింది. చట్టం యొక్క నిబంధనలను లేదా దానిపై చేసిన నిబంధనలను ఉల్లంఘించే లేదా ప్రోత్సహించే ఏ వ్యక్తి అయినా చట్టం ప్రకారం అందించిన విధంగా జైలు శిక్ష మరియు/లేదా జరిమానా విధించబడతాయి.
ప్రదేశం : ముంబై
తేది : 30.11.2024
సం/- అధీకృత అధికారి
టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్. కొరకు

ఢిల్లీలో కదం తొక్కిన ఆశా వర్కర్లు

- రెగ్యులర్ చేయాలని డిమాండ్
- కనీస వేతనం, ఇతర సమస్యల పరిష్కారం కోసం సంఘర్ష్ ర్యాలీ

ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన ఆశా వర్కర్లు, సహాయకుల ర్యాలీలో ప్రసంగిస్తున్న సిఐటియు అఖిల భారత అధ్యక్షులు హేమలత

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ రాజధాని నగరం న్యూఢిల్లీలో ఆశా వర్కర్లు, ఫెసిలిటేటర్లు కదంతొక్కారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సిబ్బంది అందరినీ రెగ్యులరైజ్ చేయాలని నినదించారు. ఆశా వర్కర్లను, సహాయకులను రెగ్యులర్ చేయడంతో పాటు పెన్షన్ తదితర సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ స్థానిక జంతర్ మంతర్ వద్ద సంఘర్ష్ ర్యాలీ చేపట్టారు. సిఐటియు అనుబంధ ఆశా వర్కర్స్ అండ్ ఫెసిలిటేటర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎడబ్ల్యుఎఫ్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా తరలివచ్చిన వేలాది మంది ఆశా వర్కర్లు, సహాయకులు పాల్గొన్నారు. ర్యాలీని ఉద్దేశించి సిఐటియు అఖిల భారత అధ్యక్షురాలు కె హేమలత తదితరులు ప్రసంగించారు. కేంద్రంలోని బిజెపి నేతృత్వ ఎన్‌డిఎ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను, కార్పొరేట్, మతతత్వ అనుకూల విధానాలను తిప్పికొట్టేందుకు శ్రమజీవులంతా కలిసికట్టుగా ఉమ్మడి పోరాటాలను బలోపేతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను హననం చేస్తోందని, అందులో భాగంగానే లేబర్ కోడ్‌లను తీసుకొస్తుందని విమర్శించారు. రాష్ట్ర స్థాయిలో స్థానిక పాలక పక్షాల దుర్మార్గపు విధానాలను వ్యతిరేకిస్తూ అద్భుతమైన పోరాటాలు చేస్తున్న ఆశా వర్కర్లను ఆమె అభినందించారు. అదే పోరాట స్ఫూర్తితో జాతీయ స్థాయిలో పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఎడబ్ల్యుఎఫ్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి మధుమిత బందోపాధ్యాయ మాట్లాడుతూ చార్టర్ ఆఫ్ డిమాండ్ల, సమస్యలను వివరించారు.

సిపిఎం ఎంపిల సంఘీభావం

ఆశా వర్కర్ల పోరాటానికి సిపిఎం రాజ్యసభ సభ్యులు వికాస్ రంజన్ భట్టాచార్య, వి శివదాసన్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశాల సమస్యలను రాజ్యసభలో లేవనెత్తుతామని తెలిపారు. ఈ ర్యాలీకి అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) నాయకులు విజు కృష్ణన్, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు జైభగవాన్, అంగన్ వాడీ సంఘం నేత ఎఆర్ సింధు తదితరులు ఆశా వర్కర్ల పోరాటానికి సంఘీభావం తెలిపారు. దేశవ్యాప్తంగా స్కీమ్ వర్కర్ల ఉద్యమాన్ని, ఐక్యతను క్షేత్రస్థాయి వరకు బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో వివిధ రాష్ట్రాలకు చెందిన నాయకులు నోని లిక్సన్ (అస్సాం), ప్రసన్న కుమారి (కేరళ), మధుజా సేన్ రాయ్ (పశ్చిమ బెంగాల్), హసుమతి పర్మార్ (గుజరాత్), ఆనంది మణిక.. (మహారాష్ట్ర), కబితా సోలంకి (మధ్యప్రదేశ్), దిల్షాద (కాశ్మీర్), సంగీత (ఉత్తరప్రదేశ్), శివ దుబే (ఉత్తరాఖండ్), సీమా (పంజాబ్), లీలావతి (రాజస్థాన్) మాట్లాడారు. అధ్యక్ష వర్గంలో సునీత (హర్యానా), మమతా రభా (అస్సాం), ప్రభావతి ఎంబి (కేరళ), పుష్పా పాటిల్ (మహారాష్ట్ర), పూజా కనోజియా (మధ్యప్రదేశ్), కళావతి (ఉత్తరాఖండ్), మంగమ్మ (తెలంగాణ) ఉన్నారు.

వేతనాలు పెంచకపోతే సమ్మెకు సిద్ధం

ఎడబ్ల్యుఎఫ్ఎఫ్ఐ కార్యదర్శి సురేఖ ఈ ర్యాలీలో పోరాట కార్యాచరణను ప్రకటించారు. తదుపరి బడ్జెట్‌లో వేతనాలు, ప్రోత్సాహకాలను పెంచకపోతే స్వతంత్రంగా, ఉమ్మడిగా సమ్మె చేపట్టనున్నట్లు హెచ్చరించారు. అందరికీ ఆరోగ్యం కోసం, మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆశా వర్కర్లు అందరూ ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని నిర్ణయించింది.

ప్రఖ్యాత ఆర్థికవేత్త, చరిత్రకారుడు అమీయ కుమార్ బాగ్చి కన్నుమూత

కోల్‌కతా : ప్రఖ్యాత మార్క్సిస్టు ఆర్థికవేత్త, చరిత్రకారుడు ప్రొఫెసర్ అమీయ కుమార్ బాగ్చి గురువారం కన్నుమూశారు. ఆయన వయస్సు 88 సంవత్సరాలు. వృద్ధాప్య సంబంధిత సమస్యలతో దక్షిణ కోల్‌కతాలోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం ఆయన తుదిశ్వాస విడిచారు. కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ కాలేజీలో బోధనా వ్యాసంగంతో ఆయన కెరీర్ ప్రారంభమైంది. న్యాయం కోసం మాట్లాడినందుకు ఆయన తొలుత చేరిన కాలేజీ నుండి బయటకు రావాల్సి వచ్చింది. తర్వాత కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ కాలేజీలో చేరారు. ఆ కాలేజీలో ఆర్థిక శాస్త్రంలో మాస్టర్స్ పూర్తి చేసిన బగ్చి పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ స్కాలర్‌షిప్‌పై 1960ల్లో కేంబ్రిడ్జి యూనివర్శిటీకి వెళ్లి డాక్టరేట్‌ను పూర్తి చేశారు. అనంతరం జీసస్ కాలేజీ ఫెలోషిప్‌తో ఫ్యాకల్టీ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పాలిటిక్స్‌లో చేరారు. 1969లో ఆ పదవికి రాజీనామా చేసి తిరిగి ప్రెసిడెన్సీ కాలేజీలో తన అకడమిక్ కెరీర్‌ను చేపట్టారు. తొలుత ఆయన గణిత ఆర్థికవేత్తగా విశ్లేషణలు సాగించిన ఆయన తదనంతరం ఆర్థిక చరిత్రను అధ్యయనంపై దృష్టి సారించి ఎన్నో అమూల్యమైన పుస్తకాలు, వ్యాసాలు రచించారు. ఆయన చిట్టచివరి అద్భుతమైన రచన పెరిలస్ ప్యాసేజ్ : మేన్‌కైండ్ అండ్ ది గ్లోబల్ అసెండెన్సీ ఆఫ్ కేపిటల్. అంతర్జాతీయంగా పేద,వర్ధమాన దేశాల అనుభవాలను ఆయన ఆ పుస్తకంలో వివరించారు. ప్రధానంగా సామ్రాజ్యవాదం వల్ల సంభవించిన ప్రజా పతనాలపై దృష్టి కేంద్రీకరించారు. 1974లో కలకతాలో కొత్తగా ఏర్పాటు చేసిన సెంటర్ ఫర్ స్టడీస్ ఇన్ సోషల్ సైన్సెస్‌లో చేరారు. భారత బ్యాంకింగ్, ఫైనాన్స్ చరిత్రలో బాగ్చి ప్రత్యేక కృషి చేశారు. 1976 నుండి 1998 వరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అధికార చరిత్రకారునిగా వ్యవహరించారు. ఎస్‌బిఐ ఆర్కైవ్‌లను భావితరాల కోసం భద్రపరచడంలో ఆయన ప్రముఖ పాత్ర పోషించారు. 2001లో కలకత్తాలోని సెంటర్ ఫర్ స్టడీస్ ఇన్ సోషల్‌సైన్సెస్ నుండి ఆర్‌బిఐ ప్రొఫెసర్‌గా రిటైరైన తర్వాత ఆయన ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ స్టడీస్‌కు వ్యవస్థాపక డైరెక్టర్‌గా వ్యవహరించారు.

సిపిఎం సంతాపం

ప్రొఫెసర్ అమీయ కుమార్ బాగ్చి మృతి పట్ల సిపిఎం తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. వామపక్ష ఉద్యమంతో ఆయనకు విడదీయరాని అనుబంధం వుందని అరుణాంజలి ఘటించింది. పేర్కొంది. పశ్చిమ బెంగాల్ లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వానికి అనేక అంశాలపై ఆయన విధానపరమైన సలహాదారునిగా వున్నారని పేర్కొంది. ఆయన అందించిన సేవలు, చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపింది. ఆయన కుటుంబ సభ్యులకు తీవ్రంగా సానుభూతి తెలియజేసింది.

మహారాష్ట్రలో బస్సు బోల్తా

- 12 మంది మృతి

గోండియా : మహారాష్ట్ర రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఎంఎస్‌ఆర్‌టిసి)కు చెందిన బస్సు బోల్తా పడిన ప్రమాదంలో 12 మంది మరణించారు. మరో 25 మంది గాయపడ్డారు. గోండియా జిల్లాలోని దవ్వ గ్రామంలో శుక్రవారం ఉదయం 11:30 గంటలకు ఈ ప్రమాదం జరిగినట్లు కలెక్టర్ ప్రజీత్ నాయర్ తెలిపారు. ప్రమాద సమయంలో బస్సులో 40 మంది ప్రయాణీకులు ఉన్నట్లు చెప్పారు. మితిమీరిన వేగం వల్లే ప్రమాదం చోటుచేసుకున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించామని, వీరిలో ముగ్గురి పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

రాజ్ కుంద్ర నివాసంలో ఇడి సోదాలు

ముంబయి : బాలీవుడ్ నటి శిల్పాశెట్టి భర్త, వ్యాపారవేత్త రాజ్‌కుంద్ర నివాసంతో పాటు అతనికి చెందిన 15 ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) గురువారం సోదాలు నిర్వహించింది. రాజ్‌కుంద్రపై నమోదైన పోర్నోగ్రఫీ కేసు, మనీలాండరింగ్ ఆరోపణలపై విచారణలో భాగంగా ఇడి ఈ సోదాలు నిర్వహించింది. 2021లో రాజ్‌కుంద్రాపై ముంబయి పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈ మనీలాండరింగ్ కేసును ఇడి నమోదు చేసింది. పోర్నోగ్రఫీ రాకెట్‌ను కుంద్రా నిర్వహిస్తున్నాడనే అభియోగాలు ఉన్నాయి. కుంద్ర రూపొందించిన పోర్న్ వీడియోలను వివిధ యాప్స్‌కు విక్రయించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ముంబయిలో రికార్డు స్థాయికి కనిష్ట ఉష్ణోగ్రత

ముంబయి : మహారాష్ట్ర రాజధాని ముంబయిలో శుక్రవారం రికార్డు స్థాయిలో కనిష్ట ఉష్ణోగ్రత 16.5 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయింది. ముంబయిలో గత ఎనిమిదేళ్లలో ఇదే అత్యంత కనిష్ట ఉష్ణోగ్రత అని భారత వాతావరణ శాఖ తెలిపింది. ముంబయిలో 2016 నవంబర్ 11న నమోదైన 16.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత తరువాత ఇదే కనిష్టమని తెలిపింది. ఈ నెల 26న కూడా ముంబయిలో కనిష్ట ఉష్ణోగ్రత 16.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయింది. అయితే ఈ నెల 30 నుంచి డిసెంబర్ 3 వరకూ మహారాష్ట్రలో చలిగాలులు వీచే అవకాశం లేదని, ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

చైనాలో సైనిక ఉన్నతాధికారి సస్పెన్షన్

బీజింగ్: తీవ్రమైన క్రమశిక్షణా ఉల్లంఘనకు పాల్పడ్డారన్న కారణంతో మియావో హువా అనే ఓ సైనిక ఉన్నతాధికారిని చైనా ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆ దేశ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మాట్లాడుతూ చైనా సెంట్రల్ మిలిటరీ కమిషన్ పొలిటికల్ వర్క్ విభాగం డైరక్టర్‌గా ఉన్న మియావో క్రమశిక్షణా ఉల్లంఘనపై విచారణ జరుగుతున్నందున ఆయనను విధుల నుంచి తొలగించినట్లు చెప్పారు.

ఇమ్రాన్‌పై మరిన్ని అభియోగాలు

ఇస్లామాబాద్: జైలులో ఉన్న మాజీ ప్రధాని, పాకిస్తాన్ తెహ్రీక్ ఇన్సాఫ్ (పిటిఐ) చీఫ్ ఇమ్రాన్ ఖాన్‌పైన, ఆయన భార్య పైన, మరి కొందరు అనుచరులపైన పాక్ పోలీసులు గురువారం పలు అభియోగాఆలు మోపారు. ఇమ్రాన్‌ను జైలు నుంచి విడుదలజేయాలని కోరుతూ మూడు రోజుల క్రితం ఇస్లామాబాద్‌కు లాంగ్ మార్చ్ నిర్వహించిన సందర్భంగా ప్రజలను హింసకు ప్రేరేపించారంటూ పలు అభియోగాలను వీరిపై మోపారు. లాంగ్ మార్చ్ సందర్భంగా తలెత్తిన ఘర్షణల్లో ఆరగురు చనిపోయిన సంగతి తెలిసిందే.

సిపిఎస్, యుపిఎస్ వద్దు...ఒపిఎస్ పునరుద్ధరించాలి

- ఎన్‌ఇపిని రద్దు చేయాలి
- ఎస్‌టిఎఫ్ఐ మహా ధర్నాలో డిమాండ్

పాఠశాల ఉపాధ్యాయుల మహాధర్నాలో ప్రసంగిస్తున్న సిపిఎం రాజ్యసభ సభ్యులు శివదాసన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్), యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యుపిఎస్) తమకు వద్దని, పాత పెన్షన్ స్కీమ్ (ఒపిఎస్)నే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా పాఠశాల ఉపాధ్యాయులు మరోమారు పోరుబాట పట్టారు. ఈ క్రమంలో స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్ఐ) ఆధ్వర్యంలో శుక్రవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మహా ధర్నా చేపట్టారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాల్సిందేనని ముక్తకంఠంతో నినదించారు. ఎన్‌పిఎస్, జిపిఎస్, యుపిఎస్, పిఎఫ్ఆర్‌డిఎ ఇవన్నీ ఉద్యోగులను తప్పుదారి పట్టించే పథకాలన్నీ, వీటితో భరోసా దక్కదని తెలిపారు. దేశ విద్యా రంగాన్ని నాశనం చేసే నూతన జాతీయ విద్యా విధానం- 2020ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. తాత్కాలిక, అడహాక్, కాంట్రాక్ట్, టెర్మ్ బేసిస్ టీచర్లను, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. శాశ్వత ప్రాతిపదికన టీచింగ్, నాన్ టీచింగ్ ఖాళీలను భర్తీ చేయాలని, విద్యా హక్కు చట్టాన్ని 12వ తరగతి వరకు పొడిగించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల కుదింపు, విలీనం వంటి చర్యలను నిలుపుదల చేయాలని, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులకు కూడా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని కోరారు.

ఈ సందర్భంగా ఎస్‌టిఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెసి హరికృష్ణన్, సిఎన్ భార్తి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న పాఠశాలల మూసివేతను ఆపాలని డిమాండ్ చేశారు. దేశంలో పేదలకు నాణ్యమైన విద్యను దూరం చేసి, కార్పొరేట్లకు లాభాలను అందించే జాతీయ విద్యా విధానాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్‌టిఎఫ్ఐ ఉపాధ్యక్షులు, టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ చందాతో కూడిన పింఛను పథకం (సిపిఎస్) రద్దు చేయాలని, ఇరవై ఏళ్ళుగా చేస్తున్న పోరాటానికి తలొగ్గి కేంద్ర ప్రభుత్వం యుపిఎస్ ప్రతిపాదించిందని అన్నారు. అయితే పాత ఒపిఎస్ పునరుద్ధరించడం మినహా మరే పథకాన్ని అంగీకరించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

వామపక్ష ఎంపిలు సంఘీభావం

ఉపాధ్యాయుల ధర్నాకు సిపిఎం రాజ్యసభ సభ్యులు శివదాసన్, సిపిఐ (ఎంఎల్) లోక్‌సభ ఎంపిలు సుధామ ప్రసాద్, రాజారాం సింగ్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌ఇపి కార్పొరేట్ల కోసం మాత్రమే తీసుకొచ్చారని, దీన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ విధానాలను ఉపాధ్యాయులు వ్యతిరేకించాలని కోరారు. ఈ ధర్నాలో అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఎఐఎస్‌జిఇఎఫ్) అధ్యక్షులు సుభాష్ లాంబ, ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.పి సాను, మయూఖ్ బిశ్వాస్, విద్యావేత్తలు మధుప్రసాద్, నందితా నారాయణ్ తదితరులు ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం నుండి టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, రాష్ట్ర కార్యదర్శి నాగమణి, రాష్ట్ర కమిటీ సభ్యులు బక్కా శ్రీనివాస చారి, సృజన్ కుమార్, ఎల్లయ్య, కిరణ్ కుమార్, టి కుమార్, రమేష్, శ్రీనివాసరెడ్డి, చిన్న వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ముప్పు నీడన ట్రంప్

- రష్యా అధ్యక్షులు పుతిన్ వ్యాఖ్య



అస్తానా : అమెరికా అధ్యక్షునిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికీ ముప్పు నీడనే ఉన్నారని రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్ వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచార సమయంలో ట్రంప్, ఆయన కుటుంబం అత్యంత అనాగరికమైన పద్ధతుల్లో దాడులను ఎదుర్కొనాల్సి వచ్చిందని ఆయన చెప్పారు. కలెక్టివ్ సెక్యూరిటీ ట్రియటీ ఆర్గనైజేషన్ (సిఎస్‌టిఓ) సదస్సు ముగింపు సందర్భంగా కజకస్తాన్ రాజధాని అస్తానాలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో పుతిన్ మాట్లాడారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయొంలో పదే పదే ట్రంప్‌పై హత్యా యత్నాలు చోటుచేసుకున్నాయని, చిన్నారులతో సహా ట్రంప్ కుటుంబాన్ని ఇలా రాజకీయ ప్రత్యర్థులు లక్ష్యంగా చేసుకున్నాయని, అయితే ట్రంప్ ఇప్పటికీ ముప్పు నీడనే ఉన్నారని పుతిన్ వ్యాఖ్యానించారు. ఇప్పటికీ ఆయనకు రక్షణ లేదన్నది తన ప్రగాఢ అభిప్రాయమని చెప్పారు. అనుభవజ్ఞుడు, మేధావి అయిన ట్రంప్ ఇలాంటి దాడలను జాగ్రత్తగా ఎదుర్కొగలరని పుతిన్ ఆశాభావం వ్యక్తం చేశారు. గత జులై 13న పెన్సిల్వేనియాలో ఎన్నికల ప్రచార సందర్భంగా ట్రంప్‌పై హత్యా యత్నం జరిగిన సంగతి తెలిసిందే.

ట్రంప్ టారిఫ్‌లపై ఆసియాన్ దేశాల్లో భయాందోళనలు

- పెట్టుబడులు, అభివృద్ధిపై తీవ్ర ప్రభావం : విశ్లేషకులు

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైన నేపథ్యంలో ఎగుమతుల ఆధారిత ఆగ్నేయాసియా దేశాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. దిగుమతి చేసుకున్న వస్తువులపై టారిఫ్‌లను పెంచుతామంటూ ట్రంప్ తన ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ కారణంగా ప్రాంతీయ దేశాల ఆర్థిక వ్యవస్థలన్నీ పోటీ పడాల్సి వుంటుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

అమెరికాకు ఆసియాన్ ఎగుమతులు బలమైన ప్రతికూలతలంటూ ప్రచారం సాగిస్తున్న ట్రంప్ తాను వైట్‌హౌస్‌కు రాగానే టారిఫ్‌లు పెంచుతానంటూ బెదిరింపులకు దిగుతున్న సంగతి విదితమే. మరింత రక్షణవాదంతో ట్రంప్ అనుసరించే విధానాల వల్ల ఆసియాన్ ఎగుమతులు తీవ్రస్థాయిలో దెబ్బతింటాయని సింగపూర్ అంతర్జాతీయ వ్యవహారాల సంస్థ ప్రతినిధి ఒకరు వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని 'మే బ్యాంక్' కూడా తన నోట్‌లో పేర్కొంది. ఆగ్నేయాసియాకు పెట్టుబడుల రాక కూడా తగ్గుతుందని, ప్రతి ద్రవ్యోల్బణ షాక్ తగులుతుందని తెలిపింది. ఈ టారిఫ్‌ల వల్ల అమెరికా కంపెనీలకు రాయితీలు పెరుగుతాయని, ఫలితంగా ఆసియాన్ దేశాలకు ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులు దెబ్బ తింటాయని ఆ సంస్థ పేర్కొంది. అన్ని దిగుమతులపై టారిఫ్‌లను 10 శాతం పెంచాలని ట్రంప్ ప్రతిపాదించినా ఆసియాన్ దేశాల వృద్ధి తీవ్రంగా ప్రభావితమవుతుందని, ఆ ప్రాంతంలోని కరెన్సీ విలువలు దెబ్బ తింటాయని మలేసియా-చైనా ఫ్రెండ్‌షిప్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ మజిద్ ఖాన్ వ్యాఖ్యానించారు.

హర్యానా, మహారాష్ట్రలో అనైక్యత వల్లే ఓటమి

- పాత పద్ధతుల్లో విజయాలు అసాధ్యం
- కాలానుగుణ మార్పులతోనే భవిత
- కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఖర్గే

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీల్లో ఎన్నికల్లో ఆయా రాష్ట్రాల్లోని నాయకత్వంలో నెలకొన్న అనైక్యత వల్లే ఓటమి చవిచూడాల్సివచ్చిందని కాంగ్రెస్ అధినాయకత్వం విశ్లేషించినట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే నేతృత్వాన ఎఐసిసి ప్రధానకార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో సీనియర్ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కెసి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. దాదాపు 5 గంటల పాటు సాగిన ఈ సమీక్ష సమావేశంలో తాజా అంసెబ్లీ ఎన్నికల్లో పార్టీ వైఫల్యం, క్షేత్రస్థాయిలో ఎదురైన సమస్యలు, రానున్న రోజుల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కీలకం చర్చించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. పాత పద్ధతుల్లో ప్రచారాలు సాగించడం, వ్యూహాలు పన్నడం విజయాలను అందించలేవని, కాలానుగుణ మార్పులకు అనుగుణంగా మారితేనే ముందుకెళ్లగలమని పార్టీ శ్రేణులకు ఖర్గే నిర్దేశించారు. తక్షణమే పాఠాలు నేర్చుకుని, సంస్థాగత స్థాయిలో బలహీనతలు, లోపాలను సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ఎన్నికల ప్రక్రియ అనుమానాస్పదం...!

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఇవిఎం) ఎన్నికల ప్రక్రియను అనుమానాస్పదంగా మార్చాయని నమ్ముతున్నట్లు ఖర్గే చెప్పారు. ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించడం ఎన్నికల సంఘం రాజ్యాంగ బాధ్యత అని నొక్కి చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడీ(ఎంవిఎ) కూటమి సాధించిన ఫలితాలు తరువాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాజకీయ పండితులను గందరగోళంలో పడేశాయన్నారు. బిజెపి పాలనలో దేశంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆర్థిక అసమానతలను పెరిగిపోయాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని ఆయన అన్నారు. మోడీ ప్రజా వ్యతిరేక విధానాలపై విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. కుల గణన కూడా ముఖ్యమైన అంశమని ఆయన చెప్పారు.

బ్యాలెట్ పేపర్ విధానాన్ని పునురుద్ధరించాలి : పల్లంరాజు

బ్యాలెట్ పేపర్ విధానం తీసుకురావాలనే అంశంపై సమావేశంలో చర్చించినట్లు సీనియర్ నేత పల్లం రాజు తెలిపారు. సమావేశ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇవిఎం, వివి ప్యాట్ ట్యాలీ అయ్యే విధానం తీసుకురావాలన్సిన అవసరం ఉందన్నారు. వైఫల్యాలు నేర్పిన పాఠాలతో రానున్న రోజుల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించామన్నారు.

బిర్సా ముండా మునిమనవడు మృతి

రాంచీ: జార్ఖండ్‌లో ఆదివాసీ పోరాట యోధుడు బిర్సా ముండా మునిమనవడు మంగళ్ ముండా గురువారం రాత్రి మరణించారు. ఈ నెల 25న కుంతి జిల్లాలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన..రాంచీలోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం 12:30 గంటలకు తుదిశ్వాస విడిచారు. కాగా ఈ 27న ఆసుపత్రిలో మంగళ్‌ను పరామర్శించిన ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అత్యుత్తమ వైద్యం అందించాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. మంగళ్ ముండా మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, గవర్నర్ సంతోష్ గంగ్వార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అంత్యక్రియలను ముండా పూర్వీకుల గ్రామం ఉలిహటు వద్ద నిర్వహించే అవకాశ ఉంది. కాగా, 1875లో జన్మించిన బిర్సా ముండా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. సామ్రాజ్యావాదానికి వ్యతిరేకంగా గిరిజనులను సమీకరించి పోరాటం కొనసాగించారు. అయితే 25 ఏళ్ల వయస్సులోనే బ్రిటిష్ అధికారుల కస్టడీలో మరణించారు. ఆ పోరాట యోధుని మునిమనువడు మంగళ్ మరణించడం ఆదివాసీలకు తీరని లోటు అని పలువురు పేర్కొన్నారు.

కాల్పుల విరమణ ఉల్లంఘనలు ఆపండి

- ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తేవాలన్న లెబనాన్ ప్రధాని

బీరుట్ : హిజ్బుల్లాతో కుదుర్చుకున్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇజ్రాయిల్ తాజాగా వైమానిక దాడికి పాల్పడిన నేపథ్యంలో ఇటువంటి ఉల్లంఘనలను ఆపేలా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తేవాలని లెబనాన్ ప్రధాని నజీబ్ మికాతి కోరారు. ఫ్రెంచి అధ్యక్షులు మాక్రాన్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ మికాతి ఈ విజ్ఞప్తి చేశారు. బుధవారం తెల్లవారు జాము నుండి కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిన లెబనాన్‌లో తాజా పరిస్థితుల గురించి వారు మాట్లాడుకున్నారు. ఒప్పందం కుదిరేలా సహకరించినందుకు ఆయన మాక్రాన్‌కు కృతజ్ఞతలు తెలియచేశారు. ఒప్పందాన్ని ఉల్లంఘించి గురువారం జరిగిన దాడిలో గణనీయంగా నష్టం జరిగిందని, పలువురు గాయపడ్డారని మికాతి తెలిపారు. కాగా హిజ్బుల్లానే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఇజ్రాయిల్ ఆర్మీ తెలిపింది. దక్షిణ లెబనాన్‌లో పలు ప్రాంతాల్లోకి వాహనాలు వచ్చాయని తెలిపింది. అందుకే తాము హెచ్చరికగా కాల్పులు జరిపామని వెల్లడించింది. అయితే తైబే గ్రామంపై ఇజ్రాయిల్ డ్రోన్‌తో జరిపినదాడిలో నలుగురు గాయపడ్డారని లెబనాన్ మిలటరీ తెలిపింది.

ఆస్ట్రేలియాలో 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం

కాన్‌బెర్రా: 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించే బిల్లును ఆస్ట్రేలియా సెనేట్ 34-19 ఓట్ల తేడాతో గురువారం ఆమోదించింది. త్వరలోనే ఇది చట్ట రూపం దాల్చనుంది. పిల్లలకు సోషల్ మీడియాను దూరం చేసే ఈ రకమైన చట్టాన్ని తెచ్చిన తొలి దేశం ఆస్ట్రేలియానే. 16 ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియాలో ఖాతాలను కలిగి ఉండడాన్ని ఈ చట్టం నిరోధిస్తుంది. ఎవరైనా ఈ చట్టాన్ని ఉల్లంఘించినట్లైతే భారీ జరిమానా విధిస్తారు.

సామాన్యులకు పకోడీల ఉపాధి.. అదానీలకు హల్వా పంపిణీ

- మోడీ మార్కు అభివృద్ధి ఇదే
- కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఎద్దేవా

న్యూఢిల్లీ : కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలపై కాంగ్రెస్ సీనియర్ నేతే జై రాం రమేష్ మరోమారు తీవ్ర విమర్శలు గుప్పించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పించడంలో ఘోరంగా విఫలమైన మోడీ సర్కార్ దేశ ప్రజలను పకోడీలు వేసుకొని బతకాలని ఉచిత సలహాలిస్తోందని, మరోవైపు దేశ వనరులను అదానీ, అంబానీ తదితర కార్పొరేట్ మిత్రులకు హల్వాల్లా పంచి పెడుతోందని ఆయన ఘాటుగా విమర్శించారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) నివేదిక ప్రకారం దేశంలో అత్యంత సంపన్నులుగా ఉన్న టాప్ 10 కుబేరుల ఆదాయం.. దేశంలోని అట్టడుగు 10 శాతం ప్రజల మొత్తం ఆదాయం కంటే 6.8 రెట్లు అధికంగా ఆదాయాన్ని గడిస్తున్నారని చెప్పారు. వేతన అసమానతల విషయంలో పొరుగున ఉన్న పాకిస్థాన్, బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్, మయన్మార్ కంటే తీవ్రంగా భారత్ పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. 'ఇది మన నాన్-బయోలాజికల్ ప్రధాని సృష్టించిన పకోడా-నామిక్స్ యొక్క ప్రత్యక్ష పరిణామమని గుర్తుంచుకోండి. సామాన్యులకు పకోడీలు, ఎంపిక చేసుకున్న కొందరికి హల్వాలు' అని సామాజిక మాధ్యమాల్లోనూ జైరాం రమేష్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

మైనార్టీలకు భద్రత కల్పించండి : సిఐటియు

ఇండియా న్యూస్ నెట్‌వర్క్ - న్యూఢిల్లీ

బంగ్లాదేశ్‌లో మైనార్టీల భద్రత, మైనార్టీల భద్రతకు ముప్పుగా జరుగుతున్న ఇటీవల జరుగుతున్న వివిధ సంఘటనలపై సిఐటియు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మైనార్టీల రక్షణకు తక్షణమే సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని బంగ్లాదేశ్‌లోని తాత్కాలిక ప్రభుత్వాన్ని సిఐటియు డిమాండ్ చేసింది. ఈ మేరకు సిఐటియు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. బంగ్లాదేశ్‌లో మతపరమైన విభజనలు సృష్టించేందుకు మతతత్వ శక్తులు తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నా, ఈ దాడుల నుంచి మైనార్టీలను రక్షించడానికి, మత సామరస్యం, శాంతిని నెలకొల్పడానికి అక్కడి అధికారులు, ప్రభుత్వం ఎటువంటి ప్రభావవంతమైన చర్యలు తీసుకోవడం లేదని సిఐటియు తన ప్రకటనలో విమర్శించింది. మరోవైపు భారత్‌లో మతోన్మాద శక్తులు బంగ్లాదేశ్‌లో పరిస్థితి గురించి క్రూరమైన, రెచ్చగొట్టే ప్రచారం చేస్తున్నాయని సిఐటియు ఆందోళనను వ్యక్తం చేసింది. ఇదే శక్తులు దేశంలోని ముస్లిం మైనార్టీలను లక్ష్యంగా చేసకుని దేశ ఐక్యత, సామరస్యానికి విఘాతం కలిగిస్తున్నాయని విమర్శించింది. ప్రజల జీవితాలను, ఉపాధిలను ఛిద్రం చేస్తున్న నయాఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటలను ఇలాంటి మత రాజకీయాలు బలహీనం చేస్తాయని, అలాగే ఇలాంటి మతరాజకీయాలు బంగ్లాదేశ్‌లోనే కాదు ప్రపంచంలో ఏ ప్రాంతంలోనైనా సరే శ్రామిక వర్గానికి హాని కలిగిస్తాయని సిఐటియు స్పష్టం చేసింది. ఇలాంటి మత రాజకీయాలను ప్రతీచోటా శ్రామిక వర్గాలు ప్రతిఘటించాలని సిఐటియు పిలుపునిచ్చింది.

మీకోసం

అరటిపండు తొక్క, శనగపిండి, పెరుగు కలిపి పేస్టులా రుబ్బి ప్యాక్ వేసుకుంటే ముఖంపై ఏర్పడిన నల్లని మచ్చలు పోతాయి.

జీవన సౌరభం

నిలబడి చూస్తే అంతా అగమ్యగోచరమే. నడక మొదలు పెడితేనే గమ్యం ఎదురుపడుతుంది.

సహాయం

ఒకసారి పొలంలో బావి తవ్వుదామని ఓ రైతు మనుషుల కోసం వెతికాడు. ఎవరూ ముందుకు రాలేదు. చేసేదేమీ లేక, తానే బావి తవ్వుకునేందుకు సామగ్రి తెచ్చుకున్నాడు. రోజుకు కొంత మేర కొన్ని అడుగుల లోతు తవ్వుకున్నాడు. ఆ సమయంలోనే అడవిలో చెలమలన్నీ ఎండిపోయి, నీళ్ళు లేక జంతువులన్నీ అలమటించసాగాయి.

నీళ్ళు ఎక్కడ ఉన్నాయో కనుక్కోమని నక్కకు ఆ పని పురమాయించింది సింహం. నక్క వెంటనే అడవి అంతా గాలించింది. ఒక చోట దూరంగా ఏవో శబ్దాలు వినపడితే ఆవైపు వెళ్ళి చూసింది. అక్కడ రైతు ఒంటరిగా బావి తవ్వుతున్నాడు. సాయంత్రం వరకు తవ్వి అలసిపోయి ఇంటికి వెళ్ళిపోయాడు. పనిముట్లు అక్కడే వదిలేశాడు. వెంటనే ఈ వార్త జంతువులకు చెప్పింది నక్క. అవన్నీ అక్కడికి చేరుకున్నాయి. ఒక్కో పని ముట్టు తీసుకుని రాత్రంతా శ్రమించి బాగా లోతు తవ్వాయి. నీళ్ళు బుడ బుడ మని పొంగాయి. అవన్నీ కేరింతలు కొడుతూ దాహం తీర్చుకుని వెళ్లాయి. ఉదయం రైతు వచ్చి చూడగానే బావి నీళ్ళతో నిండిపోయింది. అక్కడ చిత్తడిచిత్తడిగా ఉన్న నేలలో జంతువుల పాద ముద్రలు కనిపించాయి. మనుషుల శ్రమతో సమానంగా జంతువులు కష్టపడ్డాయని రైతు గ్రహించాడు. అవి చేసిన సాయానికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పాడు.

- కనుమ ఎల్లారెడ్డి, అమెరికా,
93915 23027.

అవి ఏవీ?



పిల్లలూ, పై వరుసలో ఉన్న ఒక బంతి, కింది వరుసలో ఉన్న ఒక బంతి ఒకే విధంగా ఉన్నాయి. అవి ఏంటో కనిపెట్టండి చూద్దాం.

జవాబు : 4 - 6

నేను గీసిన బొమ్మ

కె. జాస్విక,
8తరగతి,
నారాయణ సిఓ పాఠశాల,
మొగల్రాజపురం,
విజయవాడ.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

బాలల్లోని కథకులు బయటకొచ్చారు!

'డాక్టరుకి ఇచ్చే గౌరవమే ఆటోడ్రైవరుకీ ఇవ్వండి' అన్న వాక్యంతో మొదలౌతుంది 13 ఏళ్ల దివ్యదర్శిని రాసిన డెబ్యూ కథ 'డా.ఆటో'. 'పూలచెండు' కథల సంపుటిలో నాన్న రెండో వివాహంతో తొలి కథ మొదలైతే, సవితి తల్లి కూతురుతో తన అనుబంధం గురించి రెండో కథలో వివరిస్తుంది 13 ఏళ్ల అగళ్య. ఫ్రెండ్స్‌తో గొడవై, వాళ్లకి క్షమాపణ చెప్పేందుకు ఓ కథ రాస్తుంది 13 ఏళ్ల సంజన. డ్రగ్‌కి బానిసైన వ్యక్తి కుటుంబ దుర్భర పరిస్థితులను వివరిస్తూ, పెద్దయ్యాక ఐపిఎస్ ఆఫీసర్‌గా మాదకద్రవ్యాల్ని నిరోధించాలని కలలు గంటోంది తను. తప్పులు వస్తాయన్న భయంతో రాయడం మానేసిన 12 ఏళ్ల జ్యోతి శ్రీ, 'కథల పండగ' పుస్తకానికి మూడు నాటికలు రాసింది. ఈ బాల సాహిత్యకారుల్లో దాగున్న సృజనని వెలికితీయడం, ప్రోత్సహించడం వెనుక తమిళనాడుకి చెందిన 58 ఏళ్ల థామస్ కృషి ఎంతో ఉంది.

థామస్ ... పిల్లలు రాసిన కథలను, పుస్తకాలను స్వయంగా తానే ప్రచురించి ప్రోత్సహిస్తారు. కథా రచయితగా అందరికీ సుపరిచితుడైన థామస్ మరో గుర్తింపు వెంట్రిలాక్విస్ట్. ఈ కళతోనే ఆయన పిల్లలకి దగ్గరవుతారు. పిల్లలతో మాట్లాడతారు. వాళ్ల భయాలు పోగొడతారు. వాళ్ల భావాలు, భావోద్వేగాలను రచనల రూపంలో రాయమని ప్రోత్సహిస్తారు. అందుకే ఈ పిల్లలందరూ థామస్‌ని 'మాస్టారు' అని గౌరవంగా పిలుచుకుంటారు.

'క్యారీ విత్ లవ్' ట్రస్టు నిర్వాహకుడైన థామస్‌కి పిల్లల్లో దాగున్న సృజనని వెలికితీయడంలో ఎంతో శ్రద్ధ కనబరుస్తారు. ఆ

ఆసక్తితోనే పిల్లల కథల పుస్తకాలను ప్రచురించారు. 11 పుస్తకాలను స్వయంగా రాసి వెయ్యి కాపీల వరకు ముద్రించారు థామస్. 'ప్రచురణ ఖర్చులు భరించే ఆర్థిక స్థోమత నాకు లేదు. దీంతో నా రచన ముద్రితమయ్యేసరికి అప్పుల్లో మిగిలిపోతాను' అంటున్న థామస్‌కి పిల్లలకి వినోదం పంచడం కోసం విల్లుపురంలోని 'కన్నగి నగర్' స్లమ్ ఏరియాలో ట్రస్ట్ తరపున ఉచితంగా తోలుబొమ్మలాట సెషన్లు నిర్వహిస్తారు. విద్యాసంస్థలు, ఇన్‌స్టిట్యూషన్లలో నిర్వహించే వర్క్‌షాపులకు వచ్చే మొత్తాలనే పుస్తకాల ప్రచురణకై వినియోగిస్తారు.

కోవిడ్ సమయంలో థామస్ కృషి దేశ సరిహద్దులు కూడా దాటింది. పిల్లల కోసం నిరంతరం తపించే థామస్ 'లాక్‌డౌన్ కాలంలో చాలారోజులు దుర్భరంగా గడిపాన'ని చెబుతారు. చివరికి వాట్సాప్ గ్రూపు ద్వారా ఆయన ఆ లోటుని పూర్తిచేసుకున్నారు. తమిళనాడులోని సేలం, విల్లుపురం

వంటి వివిధ జిల్లాలతో పాటు విదేశాల్లో స్థిరపడిన తమిళ కుటుంబాల్లోని చిన్నారులు ఈ వాట్సాప్ గ్రూపులో చేరారు. 'వన్నతు పూచిగల్' పేరుతో నిర్వహించబడిన ఈ గ్రూపులో వినూత్న కార్యక్రమాలు నిర్వహించేవారు. ప్రస్తుతం ఈ గ్రూపులో 150 మంది పిల్లలు ఉన్నారు. వారిలో ఖతార్ నుండి జాయిన్ అయినవారు కూడా ఉన్నారు.

థామస్ భార్య ఎమిల్డా జ్ఞాపకార్థం ఆయన మొదటి సంకలనం 'పిల్లల కవిత్వ వర్షం' ప్రచురితమైంది. పిల్లల సృజనను వెలికితీయడంలో ఎమిల్డా ఎంతో చురుకుగా వ్యవహరించేదని కోల్పోయిన తన జీవితభాగస్వామిని ఆయన ఈ సందర్భంగా కన్నీళ్లతో గుర్తు చేసుకున్నారు. థామస్ తపన పిల్లల రచనలను ప్రచురించడానికే పరిమితమవ్వలేదు. డిజిటల్ మ్యాగజైన్, యూట్యూబ్ ఛానెల్, పోడ్‌కాస్ట్, వెబ్‌సైట్‌ని ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు.

తిరువన్నమలైకి చెందిన 15 ఏళ్ల సహానాకి 'తమిళ కురల్స్'పై ఉన్న ఆసక్తితో థామస్ ఛానెల్‌ని

సబ్‌స్క్రైబ్ చేసుకుంది. అందులో పిల్లలకి సంబంధించిన వీడియోలు తనని చాలా ప్రభావితం చేశాయి. ఎంతగా అంటే 'తిరుక్కురల్'లోని 'కురల్స్' మొత్తం 1330ని తండ్రి సాయంతో రాగి పత్రాలపై ముద్రించింది. వాటిని మ్యూజియంలో ప్రదర్శించాలని కూడా ఆశ పడుతోంది.

పిల్లలతో తరచూ తనకు ఎదురయ్యే అనుభవాలని థామస్ ఇలా చెబుతున్నారు. 'పిల్లలు తమ భావాలను వ్యక్తపరిచే స్వేచ్ఛా వాతావరణం అన్ని చోట్లా ఉండదు. ఒకసారి నేను తోలుబొమ్మలాట ప్రదర్శన చేస్తున్నాను. వాటికి కథలు రాయమని పిల్లలని ప్రోత్సహించాను. అయితే ఎక్కడ తనతో కథలు రాయిస్తారో, తప్పులు వస్తాయన్న భయంతో 12 ఏళ్ల జ్యోతి శ్రీ ఆ షోకి రావడమే మానేసింది. తన భయాన్ని పోగొట్టేలా మాట్లాడాను' అని చెబుతున్న థామస్ మాటల్లో పిల్లల్లో దాగున్న సృజనని వెలికితీయడంలో ఆయన తపన అర్థమవుతుంది. మాస్టారు ఇచ్చిన ధైర్యంతో జ్యోతి శ్రీ ఏకంగా మూడు డ్రామాలకి కథలు అందించింది. రెండు కథలు కూడా రాసింది. తన 'వెట్రిప్ప' కథ 'కథల పండగ' సంకలనంలో కూడా ప్రచురించబడింది.

ఐదేళ్ల పిల్లల నుండి కూడా రచయితలను తయారుచేయవచ్చు అంటారు థామస్. పిల్లల ఆలోచనలే కథల రూపంలో బయటికి వస్తాయంటారు. వాటిల్లో పెద్దలు ఎక్కడా జోక్యం చేసుకోవద్దంటారు ఆయన. పిల్లలు రాసే కథల్లో నైతికత ఉండేలా చూడడమే పెద్దల పని అంటారు.

పిల్లలు ముభావంగా ఉంటున్నా, ఎవ్వరితో కలవకుండా దిగులుగా కూర్చొంటున్నా వాళ్లతో కథలు రాయించమని చెబుతున్నారు. అలా చేస్తే పిల్లలు ఒత్తిడి నుండి దూరమవుతారు. రచనలు వారికి మంచి వైద్యంలా పనిచేస్తాయి అంటున్నారు. ఈ సందర్భంగా13 ఏళ్ల అగళ్య తల్లి లేని ఒంటరి తనపు మానసిక ఒత్తిడిని ఎలా అధిగమించిందో చెబుతారు. 'అగళ్య తండ్రి రెండో వివాహం చేసుకున్నాడు. అప్పుడు తను ఎంతో ఒత్తిడిని ఎదుర్కొంది. ఆ తరువాత సవితి తల్లికి పుట్టిన చెల్లితో అగళ్య బంధం పెనవేసుకుంది. ఈ అనుభవాలనే తన కథల్లో రాసింది. వాటిని చదివిన అగళ్య సవితి తల్లి, ఆ చిన్నారి పడిన వేదనని అర్థం చేసుకుంది. 'ఇంతలా తనని బాధ పెట్టానా' అని విచారించింది. 'ఇక నుండి తన భావాలను అర్థం చేసుకుంటాన'ని అగళ్యని దగ్గరకి తీసుకుంది. ఇప్పుడు అగళ్య ఎంతో సంతోషంగా ఉంది' అని చెబుతున్న థామస్, 'పిల్లలు తరచూ తమ చుట్టూ ఉండేవారి గురించి, ఆ బంధాలతో వాళ్ళ పెనవేసుకున్న ఆప్యాయతలు, కోపాలు, అలకలు వంటివన్నీ రచనల్లో రాస్తుంటారు. వాళ్ల పేర్లు కూడా యథాతథంగా అలానే రాసేస్తారు. వాటిని మార్చి రాయడమే నేను చేస్తుంటాను. మిగతాదంతా అలాగే ఉంచేస్తాను. ఆ రచనల్లో వాళ్ల సృజనని వెలికితీయడమే నా పని' అంటున్నారు.

జువైనల్ హోమ్‌కి వెళ్లి అక్కడి పిల్లలతో కూడా రచనలు చేయించారు థామస్. '16 ఏళ్ల ఓ బాలనేరస్తుడు తను, తన స్నేహితులు ఎదుర్కొన్న శిక్షని, విచారణలని, తీర్పులని ఒక్కొక్కటిగా తన రచనల్లో రాశాడు. అవి చదువుతున్నప్పుడు ఆ పిల్లలు పడ్డ మానసిక వేదన మనకి తెలుస్తుంది' అని చెబుతున్నారు. పిల్లల గురించి ఇంతలా ఆలోచిస్తున్న థామస్, పిల్లల కోసం వీధి లైబ్రరీ నిర్మించాలని ఆశపడుతున్నారు. పిల్లల రచనలతో అది నిండిపోవాలని తపన పడుతున్నారు. ఇప్పటికే రచనల వేట మొదలుపెట్టారు. దాతల కోసం ఎదురుచూస్తున్నారు. థామస్ 'మాస్టారు' సాధ్యమైనంత త్వరగా తన లక్ష్యం చేరుకోవాలని కోరుకుందాం.

మోక్షజ్ఞ 'గెట్ రెడీ ఫర్ సమ్ యాక్షన్'

ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో నందమూరి మోక్షజ్ఞ హీరోగా ఎంట్రీ ఇస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా మేకర్స్ నుంచి ఓ అప్‌డేట్ బయటికి వచ్చింది. చిత్ర దర్శకుడు ప్రశాంత్ వర్మ SIMBAisCOMING అనే హాష్ టాగ్‌తో 'గెట్ రెడీ ఫర్ సమ్ యాక్షన్' అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగమైన ఈ చిత్రాన్ని సుధాకర్ చెరుకూరి తన ఎస్ఎల్‌వి సినిమాస్‌పై లెజెండ్ ప్రొడక్షన్స్‌తో కలిసి భారీ స్థాయిలో నిర్మించనున్నారు. బాలకృష్ణ చిన్నకూతురు తేజస్విని నందమూరి ఈ చిత్రానికి సమర్పకురాలిగా వ్యవహరించనున్నారు. ఈ సినిమా షూటింగ్ డిసెంబర్ 5 నుంచి ప్రారంభం కానుంది.

వచ్చే నెలలో కీర్తి సురేష్ పెళ్లి

కీర్తిసురేష్ పెళ్లి సమయం దగ్గరపడింది. వచ్చే నెలలోనే ఆమె వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నారు. శుక్రవారం కీర్తిసురేష్ తన కుటుంబసభ్యులతో కలిసి తిరుమల వచ్చారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పెళ్లి విషయం బయటపెట్టారు. వచ్చే నెలలోనే తాను పెళ్లి చేసుకోబోతున్నట్లు తెలిపారు. గోవాలో వెడ్డింగ్ జరుగుతుందన్నారు. కీర్తిసురేశ్ ఇటీవల తన స్నేహితుడు ఆంటోనీతో ప్రేమలో ఉన్నట్లు ప్రకటించారు. ఆయనతో కలిసి దిగిన ఫొటోని షేర్ చేస్తూ దాదాపు 15 ఏళ్ల తమ స్నేహబంధం ఇకపై జీవితాంతం కొనసాగనుందని తెలిపారు.

ఒకే తరహా పాత్రలు ఇష్టం లేదు

తమన్నా కథానాయికగా నటించిన తాజా చిత్రం 'సికందర్ కా ముఖద్దర్'. నెట్‌ఫ్లిక్స్ వేదికగా శుక్రవారం నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె తన కెరీర్ గురించి పలు విషయాలు చర్చించారు. ఒకే తరహా పాత్రలు చేయడం తనకు నచ్చదని.. విభిన్నమైన పాత్రలతో తరచూ ప్రేక్షకులను అలరించాలనుకుంటున్నానని అన్నారు. 'సినిమాల్లోకి రావాలని నేను ఎప్పుడూ అనుకోలేదు. అనుకోకుండా ఇండస్ట్రీలోకి వచ్చా. దాదాపు 15 ఏళ్ల నుంచి నటిగా కొనసాగుతున్నా. గొప్ప వ్యక్తులతో కలిసి నటించా. ప్రతి సినిమా నుంచి, నటీనటుల నుంచి ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నా. కెరీర్ ఆరంభంలోనే తెలుగు, తమిళంలో కమర్షియల్ విజయాలు అందుకున్నాను. అయినప్పటికీ నటిగా ఏదో చేయాలనే తపన మాత్రం తగ్గలేదు. విభిన్నమైనవి, నన్ను సవాలు చేసే పాత్రలు చేయాలనిపించింది. కమర్షియల్‌గా సక్సెస్ అందుకున్న తర్వాత ప్రయోగాలు చేయడం అనవసరం అని అందరూ భావిస్తుంటారు. కాకపోతే నేను అలా అనుకోలేదు. ఆ క్రమంలోనే బాహుబలిలో యాక్ట్ చేశా. ఎన్నో ప్రశంసలు అందుకున్నా. ఆ తర్వాత కూడా విభిన్నమైన పాత్రలు పోషిస్తూ.. కెరీర్‌లో ముందుకుసాగుతున్నా' అని తెలిపారు.

1న 'పీలింగ్స్' ఫుల్‌సాంగ్ విడుదల

అల్లు అర్జున్–సుకుమార్ కాంబినేషన్‌లో డిసెంబర్ 5న విడుదల కానున్న సినిమా 'పుష్ప 2'. ఈ పాన్ ఇండియా మూవీ విడుదల సందర్భంగా పెద్దఎత్తున ప్రచార కార్యక్రమాలు జరుగుతున్నాయి. తాజాగా 'పీలింగ్స్' అనే పాట ప్రోమోను చిత్రబృందం విడుదల చేసింది. పూర్తి పాటను డిసెంబర్ 1న విడుదల చేస్తామని ప్రకటించింది. అయితే అన్ని భాషల్లో రానున్న ఈ సాంగ్‌లో వచ్చే పల్లవి లిరిక్స్ మలయాళంలోనే ఉండనున్నాయి. సంగీతం దేవీశ్రీ ప్రసాద్ అందించారు. 'పుష్ప 2 : ది రూల్' ఇప్పటికే సెన్సార్ పూర్తి చేసుకుంది. సుమారు ఐదు కట్స్ చెప్పి యూ/ఎ సర్టిఫికెట్‌ను సెన్సార్ బోర్డు ఇచ్చింది. సినిమా రన్ టైమ్ 3.20 గంటల 38 సెకన్లు.

మంచి నటుడిగా గుర్తింపుకోసమే ఆరాటం : గూడ రామకృష్ణ



70కి పైగా చిత్రాల్లో నటించిన గూడ రామకృష్ణ దాసరి నారాయణరావు దగ్గర 'మజ్ను' చిత్రంతో సహాయ దర్శకుడిగా సినీ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత సన్నజాజి, పెళ్ళాం వచ్చింది. జగద్గురు శ్రీ షిరిడి సాయిబాబా సినిమాలు తీశారు. ఇది జాతీయ సమగ్రతా చిత్రంగా 2009లో ఎంపికైంది. ఉత్తమ దర్శకుడిగా సరోజినీనాయుడు స్మారక నంది పురస్కారాన్ని అందుకున్నారు. తాజాగా పుష్ప 2, గేమ్ ఛేంజర్, రాజా సాబ్, తమ్ముడు, భైరవం వంటి చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'మంచి నటుడిగా గుర్తింపు కోసమే ఆరాటం' అన్నారు.

సమంత తండ్రి కన్నుమూత

సమంత తండ్రి జోసెఫ్ ప్రభు శుక్రవారం కన్నుమూశారు. ఈ విషయాన్ని సమంత సోషల్ మీడియా వేదికగా తెలిపారు. జోసెఫ్ మృతికి గల కారణం తెలియలేదు. అనారోగ్య సమస్యలతో చనిపోయినట్లు సమాచారం. 'నాన్నను ఇక కలవలేను' అని పేర్కొంటూ సమంత ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు పెట్టారు. దీనికి హార్ట్ బ్రేకింగ్ ఎమోజీని జతచేశారు. ఈ విషయం తెలియడంతో సినీ ప్రముఖులు పెద్ద ఎత్తున ఆమెకు సానుభూతికి తెలియజేస్తున్నారు. ధైర్యంగా ఉండాలని.. ఆమె తండ్రికి సంతాపం ప్రకటిస్తున్నారు.

మరో టెస్ట్‌కు సన్నద్ధత!

- నేటి నుంచి రెండు రోజుల వార్మప్ మ్యాచ్
- ఆసీస్ పిఎం ఎలెవన్‌తో భారత్ ఢీ
- ఉదయం 9.10 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

కాన్‌బెర్రా : పెర్త్ టెస్టులో సూపర్ విజయాన్ని ఆస్వాదిస్తున్న టీమిండియా.. కంగారూ గడ్డపై మరో కఠిన సవాల్‌కు సిద్ధమవుతోంది. ఆడిలైడ్ వేదికగా డే అండ్ నైట్ పింక్ బాల్ టెస్టు వచ్చేనెల ఆరో తేదీ నుంచి ఆరంభం కానుంది. ఇప్పటి వరకూ నాలుగు పింక్ బాల్ టెస్టుల్లో ఆడిన టీమిండియా మూడింట విజయాలు సాధించింది. చివరగా ఆడిలైడ్‌లో జరిగిన పింక్ బాల్ టెస్టులో భారత్ ఓటమి చవిచూసింది. దీంతో ఈసారి గులాబీ సవాల్‌కు మెరుగ్గా సన్నద్ధమయ్యేందుకు సిద్ధమైంది. ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఎలెవన్‌తో రెండు రోజుల వార్మప్‌తో మ్యాచ్ ప్రాక్టీస్ చేయనుంది. కాన్‌బెర్రా మనుకా ఓవల్‌లో శనివారం, ఆదివారం పింక్ బాల్ వార్మప్ జరుగనుంది. ఆడిలైడ్ డే అండ్ నైట్‌లో జరుగనుండగా.. వార్మప్ మ్యాచ్ మాత్రం పూర్తిగా డేలోనే జరుగుతుంది.

శుభ్‌మన్‌పై ఫోకస్ : బొటనవేలి గాయంతో పెర్త్ టెస్టుకు దూరమైన శుభ్‌మన్ గిల్ వార్మప్ మ్యాచ్‌లో ఆడనున్నాడు. శుక్రవారం నెట్ సెషన్‌లో గిల్ మంచిగా కనిపించాడు. పది నిమిషాల పాటు త్రోడౌన్స్ ఎదుర్కొన్న గిల్.. ఆ తర్వాత ఫుల్ లెంగ్త్ బాల్స్‌ను ఆడాడు. బ్యాటింగ్ కోచ్ నుంచి డిఫెన్స్ సూచనలు తీసుకున్నాడు. బొటనవేలి గాయం గిల్‌ను ఇబ్బంది పెట్టినట్టు కనిపించలేదు. దీంతో గిల్ నేడు వార్మప్ మ్యాచ్‌లో ఆడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. రోహిత్ శర్మ పెర్త్‌లోనే నెట్స్‌లో పింక్ బాల్‌పై సాధన చేశాడు. కాన్‌బెర్రాలోనూ అదే సాధన కొనసాగించాడు. విరాట్ కోహ్లి నెట్స్‌లో డ్రైవ్స్ ఆడగా.. ఎక్కువగా ఎడ్జ్ తీసుకున్నాయి. దీంతో ప్రాక్టీస్‌లో అసహనంగా కనిపించాడు. రిషబ్ పంత్, యశస్వి జైస్వాల్ బ్యాటింగ్ చేస్తూ ఉత్సాహంగా కనిపించారు. యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ పింక్ బాల్‌ను ఎదుర్కొనేందుకు ఇబ్బందిపడ్డాడు. జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్, ముకేశ్ కుమార్, ప్రసిద్ కృష్ణలు సైతం పింక్ బాల్ వార్మప్‌లో ఆడనున్నారు. స్పిన్నర్లు వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్‌లు ఇటు బ్యాట్‌తో, అటు బంతితో వార్మప్‌లో అవకాశం అందుకునే వీలుంది. కెఎల్ రాహుల్ నెట్స్‌లో శ్రద్ధగా సాధన చేశాడు. రోహిత్ శర్మ రాకతో జట్టు బ్యాటింగ్ ఆర్డర్‌లో రాహుల్ స్థానంపై అనిశ్చితి నెలకొంది. మూడోస్థానంలో ఆడిన దేవదత్ పడిక్కల్ బెంచ్‌కు పరిమితం కానుండగా.. ఆ స్థానంలో రాహుల్ వస్తాడా? లేదంటే యశస్వి, రాహుల్ జోడీ జోరు కొనసాగించేందుకు రోహిత్ శర్మనే మూడో స్థానంలో ఆడతాడా? అనేది చూడాలి.

వర్షం అంతరాయం? : రెండు రోజుల వార్మప్ మ్యాచ్‌కు వర్షం అంతరాయం పొంచి ఉంది. తొలి రోజు ఆట సాధ్యపడే వాతావరణం కనిపించటం లేదు. ఎడతెగని వర్ష సూచనలతో శనివారం రోజు ఆట సాగుతుందో? లేదో అనే అనుమానం నెలకొంది. రెండో రోజు మాత్రం వర్షం సూచల్లేవు. ఆసీస్ పిఎం ఎలెవన్‌కు ఎడ్వర్డ్స్ సారథ్యం వహిస్తున్నారు. మ్యాచ్ ఉదయం 9.10 గంటలకు ఆరంభం కానుంది.

సెమీస్‌లో సింధు

- లక్ష్యసేన్, అశ్విని–తనీశ జోడీ సైతం
- సయ్యద్ మోడీ ఇండియా ఓపెన్

లక్నో (ఉత్తరప్రదేశ్) : భారత అగ్రశ్రేణి షట్లర్ పివి.సింధు సెమీఫైనల్లోకి ప్రవేశించింది. సయ్యద్ మోడీ ఇండియా ఇంటర్నేషనల్ ఓపెన్ సూపర్ 300 టోర్నీ మహిళల సింగిల్స్‌లో సింధు జోరు కొనసాగించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో చైనా అమ్మాయి వాంగ్‌పై 21–15, 21–17తో వరుస గేముల్లో గెలుపొందిన సింధు సెమీస్‌కు చేరుకుంది. పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ లక్ష్యసేన్ సైతం సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. సహచర షట్లర్ లువాంగ్‌పై 21–8, 21–19తో ఏకపక్ష విజయం సాధించాడు. మరో క్వార్టర్స్‌లో ప్రియాన్ష్ రజావత్ 21–13, 21–8తో డాంగ్‌పై గెలుపొంది సెమీస్‌లో అడుగుపెట్టాడు. మహిళల డబుల్స్‌లో తనీశ క్రాస్టో, అశ్విని పొన్నప్ప జోడీ 21–12, 17–21, 21–16తో ప్రియ, శృతి జోడీపై మూడు గేముల మ్యాచ్‌లో గెలుపొందింది. మరో క్వార్టర్స్‌లో ట్రెసా జాలి, పుల్లెల గాయత్రి 21–8, 21–15తో వరుస గేముల్లో మలేషియా జోడీపై అలవోక విజయం సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల, తనీశ క్రాస్టోలు 21–16, 21–13తో మలేషియా జంటపై గెలుపొంది సెమీఫైనల్‌కు చేరుకున్నారు.

మైదానంలో కుప్పకూలిన క్రికెటర్

- గుండెపోటుతో మృతి

ఇంటర్నెట్ డెస్క్ : గుండెపోటు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. ఆరోగ్యంగా ఉన్నారనుకున్న ప్లేయర్లూ దీనిబారిన పడుతున్నారు. తాజాగా పూణె వేదికగా ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో ఓ క్రికెటర్ మైదానంలోనే కుప్పకూలి ప్రాణాలు వదిలాడు. అప్పటివరకూ తమతో ఆడుతున్న ఆటగాడు నిర్జీవంగా మారడంతో సహచరులంతా బాధలో మునిగిపోయారు. 35 ఏళ్ల ఇమ్రాన్ పటేల్ ఓపెనర్‌గా క్రీజ్‌లోకి వచ్చాడు. కాసేపటికే ఎడమవైపు ఛాతీలో నొప్పిగా ఉందంటూ సహచరులకు చెప్పాడు. ఆన్ ఫీల్డ్ అంపైర్లతో చర్చించిన అనంతరం అతడు డగౌట్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. కొద్దిదూరం వెళ్లగానే కుప్పకూలాడు. దీంతో ఒక్కసారిగా ఆటగాళ్లు, ప్రేక్షకులు హడలెత్తిపోయారు. ఆ మ్యాచ్ లైవ్‌స్ట్రీమింగ్ జరుగుతుండటంతో వీడియోలు బయటకు వచ్చేశాయి. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించినా ఫలితం మాత్రం లేదు. అప్పటికే ప్రాణాలు విడిచినట్లు వైద్యులు ప్రకటించారు.

ఇమ్రాన్ పటేల్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. కొడుకు వయసు కేవలం నాలుగు నెలలు మాత్రమే. క్రికెట్ ఆడటంతోపాటు రియల్ ఎస్టేట్, జ్యూస్‌షాప్ కూడా నిర్వహిస్తున్నాడు. పూణెలోనే ఇదే ఏడాది సెప్టెంబర్‌లో హబీబ్ షేక్ అనే క్రికెటర్ కూడా క్రికెట్ ఆడుతూ ప్రాణాలు వదిలాడు. అయితే, అతడికి అప్పటికే డయాబెటిక్ సమస్య ఉంది. కానీ, ఇమ్రాన్ పటేల్‌కు మాత్రం అనారోగ్య సమస్యలేమీ లేకపోవడం గమనార్హం. తోటి క్రికెటర్ మృతిపై సహచరులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. ఫిజికల్‌గా ఫిట్‌గా ఉండే ఇమ్రాన్‌కు ఇలా జరుగుతుందని అస్సలు ఊహించలేదని వాపోయారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68